ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
ప్రకాశం
జిల్లా వార్తలు
ఆదివారం 8, జూన్ 2025

24 మంది తహసీల్దార్ల బదిలీ

» ఇద్దరు నెల్లూరు, మరొకరు బాపట్ల జిల్లాకు కేటాయింపు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 24 మంది తహసీల్దార్లు బదిలీ అయ్యారు. ఈమేరకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఉత్తర్వులు జారీచేశారు. సెలవులో ఉన్న ఇరువురు తహసీల్దార్లను నెల్లూరు జిల్లాకు కేటాయించారు. మరొకరిని బాపట్లకు బదిలీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్లుగా పనిచేస్తున్న కొందరిని అడ్‌హక్ ఉద్యోగోన్నతిపై తహసీల్దార్లుగా నియమించారు.

బదిలీ అయిన తహసీల్దార్ల వివరాలు

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
టి.రవి	సింగరాయకొండ	కలెక్టరేట్ (అడ్మిన్)
కె.నాగలక్ష్మి	తాళ్లూరు	కలెక్టరేట్ సూపరింటెండెంట్
శ్రీనివాసరావు	కలెక్టరేట్ ఏవో	కలెక్టరేట్ సూపరింటెండెంట్
శ్రవణ్‌కుమార్	కలెక్టరేట్ సూపరింటెండెంట్	ఆర్డీవో ఆఫీసు, కేఆర్‌సీసీ
ఎ.దిలీప్‌కుమార్	హనుమంతునిపాడు	మార్కాపురం కేఆర్‌సీసీ
డి.మంజునాథరెడ్డి	సీఎస్‌పురం	యర్రగొండపాలెం
సిహెచ్.అశోక్‌రెడ్డి	రాచర్ల	దోర్నాల
కె.సంజీవరావు	కలెక్టరేట్ సూపరింటెండెంట్	తాళ్లూరు
నారాయణరెడ్డి	కలెక్టరేట్ సూపరింటెండెంట్	సంతనూతలపాడు
వి.ఆదిలక్ష్మి	సంతనూతలపాడు	మద్దిపాడు
మధుసూదనరావు	కొత్తపట్నం	ఒంగోలు అర్బన్
కె.శ్రీకాంత్	దోర్నాల	కొత్తపట్నం
ఎస్.శ్రీనివాసరావు	వలేటివారిపాలెం	కొండపి
పి.మురళి	కొండపి	జరుగుమల్లి
బి.జనార్దన్	జరుగుమల్లి	మర్రిపూడి
నాగార్జునరెడ్డి	మార్కాపురం కేఆర్‌సీసీ	అర్ధవీడు
హుస్సేన్	నెల్లూరు కలెక్టరేట్	సీఎస్‌పురం
ఎస్‌కే నాగూర్‌మీరా	సెలవు	హెచ్‌ఎంపాడు
ఎన్.వాసు	ఒంగోలు అర్బన్	వెలిగండ్ల
ఎస్‌కే రఫీఅహ్మద్	పెద్దారవీడు(డీటీ)	రాచర్ల
ఆర్.వాసుదేవరావు	ఎన్‌జీపాడు(డీటీ)	పామూరు
ఏపీఎస్ శ్రీనివాసరావు	మార్కాపురం(డీటీ)	బాపట్ల
నయూబ్‌అహ్మద్	సెలవు	నెల్లూరు కలెక్టరేట్
బి. జనార్దన్	సెలవు	నెల్లూరు కలెక్టరేట్

278 మందికి షైనింగ్ స్టార్స్ అవార్డులు

» వారిలో 242 మంది టెన్త్, 36 మంది ఇంటర్ విద్యార్థులు
» 'పది'లో ప్రతి మండలం నుంచి ఆరుగురు ఎంపిక
» ఒక్కొక్కరికి రూ.20వేల నగదు, మెడల్, సర్టిఫికెట్
» రేపు అందజేయాలని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ఆదేశం

7



ఒంగోలులోని ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు (ఇన్‌సెట్‌లో) సింగరాయకొండలో ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి స్వామి



భక్తిశ్రద్ధలతో బక్రీద్

ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

» సింగరాయకొండలో మంత్రి స్వామి, ఇతరచోట్ల పాల్గొన్న ఎమ్మెల్యేలు

ఒంగోలు కల్చరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా ముస్లింలు బక్రీద్‌ను శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదులు, ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతపెద్దలు అల్లాహ్ బోధనలు, ఖురాన్ సూత్రాలను వివరించారు. ఒంగోలు నగరంలోని కొణిజేడు బస్టాండ్ దగ్గర ఉన్న ఈద్గాలో నిర్వహించిన ప్రార్థనల్లో వేలాదిగా ముస్లింలు పాల్గొన్నారు. పలుచోట్ల అధికారపార్టీ ప్రజాప్రతినిధులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి సింగరాయకొండలో ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన విందులో మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య పాల్గొన్నారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పట్టణంలోని కొంగలవీడు రోడ్డులోని ఈద్గాలో ప్రార్థనలు చేశారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పట్టణంలోని ఈద్గాలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఒంగోలులోని బాలాజీనగర్‌కు చెందిన వీరాంజనేయులు తన మనుమడిని ఫస్ట్ క్లాస్ చదివించేందుకు ఓ కార్పొరేట్ స్కూలులో అడ్మిషన్‌కు వెళ్లారు. ఫీజు, బెల్ట్, టై, పుస్తకాలు కలిపి మొత్తం రూ.35వేలు చెల్లించాలనడంతో అవాక్కయ్యారు. యూనిఫాం మాత్రం బయట తీసుకోవాలని చెప్పడంతో ఏం చేయాలో అర్థం కాలేదు. తెలిసిన వాళ్లతో చెప్పించుకుంటే రూ.3వేలు తగ్గిస్తామన్నారు. దీంతో చేసేదేమీ లేక అడ్మిషన్ రాసి వచ్చారు.

నగరంలోని విజయనగర్ కాలనీలో నివసించే శ్రీనివాసరావు ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. తన ఇద్దరు పిల్లలను ఓ ప్రైవేటు స్కూలులో చదివిస్తున్నారు. కుమార్తె టెన్త్, కుమారుడు 7వ తరగతి. ఈ ఏడాది పాపకు రూ.30వేలు, బాబుకు రూ.28వేలకు ఫీజు పెంచినట్లు స్కూలు యాజమాన్యం చెప్పింది. ఆర్థిక భారమైనా స్కూలు మార్చలేక అక్కడే కొనసాగించాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టంగుటూరు మండలం కారుమంచి గ్రామానికి చెందిన శ్రీనివాసరావు కుమారుడు ఇటీవల 10వ తరగతి మంచి మార్కులతో పాసయ్యాడు. ఇంటర్ చేర్పించడానికి ప్రైవేటు కాలేజీకి వెళ్లిన ఆయన ఫీజుల వివరాలు చూసి అవాక్కయ్యారు. డేస్కాలర్‌కు ఏడాదికి రూ.50వేలపైనే అవుతుండగా, హాస్టల్‌లో చేర్పాలంటే అన్నీ కలిపి రూ.లక్షపైనే చెప్పారు. దీంతో అమ్మో.. ఇవేమి ఫీజులు అంటూ అవాక్కయ్యాడు.

సామాన్య కుటుంబాల వారు జూన్ వచ్చిందంటేనే భయపడిపోతున్నారు. అమ్మో.. అంటూ నోరెళ్లబెడుతున్నారు. నెలరోజుల వేసవి సెలవుల్లో ఆటపాటలతో ఆనందంగా గడిపిన విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పట్టేందుకు సిద్ధమవుతుండగా, వారి తల్లిదండ్రులు మాత్రం ఆర్థిక ఇబ్బందులను అధిగమించేది ఎలా అని ఆలోచన చేస్తున్నారు. అడ్మిషన్ నుంచి పిల్లలు తరగతి గదిలో అడుగుపెట్టేంత వరకు వారికి లెక్కల పరీక్షే. ఖర్చుల మోతే.



తల్లిదండ్రులకు జూన్ జాటం

» మధ్యతరగతి కుటుంబాల్లో గుబులు
» ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల మోత
» పెరిగిన బ్యాగులు, పుస్తకాల ధరలు
» విద్యార్థుల తల్లిదండ్రులపై రూ.లక్షల్లో భారం
» ఏటికేడు అధికమవుతున్న ఖర్చులు



జూన్ వస్తేనే భయమేస్తోంది



నేను రోజువారీ సమోసాలు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాను. జూన్ వస్తేనే భయం వేస్తుంది. అప్పు చేసే ధైర్యం లేదు. అలాగని దాచుకున్న డబ్బులు లేవు. ఏ రోజు పనిచేసుకుంటే ఆ రోజు పూటగడుస్తుంది. అలాంటిది పిల్లల ఫీజులు, యూనిఫాం, పుస్తకాల కొనుగోలు భారంగా మారింది. ఇద్దరు పిల్లలకు కనీసం ఎలా కాదన్నా రూ. 50వేలు ఖర్చవుతుంది.

- వెంకటేశ్వర్లు, చిరు వ్యాపారి

ఒంగోలు కార్పొరేషన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : జూన్ నెల అనగానే పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఖర్చుల దడ పుడుతోంది. ఏటికేడు పెరుగుతున్న స్కూలు, కాలేజీ ఫీజులు, అందుకు అయ్యే ఇతర వ్యయం తలచుకుంటేనే గుండె గుభేల్‌మంటోంది. ఈనెలలో విద్యా సంస్థల పునఃప్రారంభంతో ఖర్చు తడిసి మోపెడవుతోంది. దీంతో నెలవారీ జీతాలపైనే ఆధారపడి కుటుంబాలు నెట్టుకొచ్చే మధ్యతరగతి వారు లెక్కలతో మల్లగుల్లాలు పడుతున్నారు. ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు ఫీజులు, పుస్తకాలు, బస్సు చార్జీలు, యూనిఫాంలు, యాప్‌ల రూపంలో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి భారీగా వసూళ్లకు దిగడంతో వారు ఆందోళన చెందుతున్నారు.

భారీగా ఫీజులు

పాఠశాలలు ఈనెల 12 నుంచి పునఃప్రారంభం కానున్నాయి. ప్రైవేటు స్కూలు యాజమాన్యాలు ఒకటో తేదీ నుంచే అడ్మిషన్‌ల ప్రక్రియను ప్రారంభించాయి. అదేసమయంలో తల్లిదండ్రులు ఖర్చులకు భయపడాల్సిన పరిస్థితి వచ్చింది. ముఖ్యంగా పిల్లలు స్కూలులో అడుగు పెట్టాలంటే పుస్తకాలు, నోట్‌బుక్కులతోపాటు, బ్యాగు, దానికితోడు లంచ్

మిగతా 6వ పేజీలో



దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన వరాహ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు కన్నులపండువలా జరుగుతున్నాయి. శనివారం ధ్వజారోహణ నిర్వహించారు. రాత్రికి స్వామి వారు చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

6

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో వెనుకంజ

» ఫస్టియర్‌లో రాష్ట్రంలో జిల్లా 24వ స్థానం
» ద్వితీయ సంవత్సరంలో 21వ స్థానం

ఒంగోలు విద్య, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో జిల్లా విద్యార్థులు వెనుకంజ వేశారు. మార్చిలో జరిగిన పబ్లిక్ పరీక్షా ఫలితాలతో పోల్చితే రాష్ట్రస్థాయిలో జిల్లాస్థానం మరింత దిగజారింది. ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో కేవలం 37శాతం ఉత్తీర్ణతతో 24వ స్థానంలో నిలిచింది. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 57శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 21వస్థానంలో జిల్లా ఉంది. రాష్ట్ర సగటు ఉత్తీర్ణత కంటే ఆరుశాతం తక్కువతో విద్యార్థులు

మిగతా 6వ పేజీలో

భారీగా స్కూలు అసిస్టెంట్ల బదిలీ

» 2,205 మందికి స్థానచలనం
» నేడు రిలీవ్ కావాలని ఉత్తర్వులు



ఒంగోలు విద్య, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో భారీగా స్కూలు అసిస్టెంట్లకు స్థానచలనం కలిగింది. మొత్తం 2,205 మంది బదిలీ అయ్యారు. జిల్లాలో మూడో వంతు యూపీ స్కూళ్లను ప్రాథమిక పాఠశాలలుగా డౌన్‌గ్రేడ్ చేయడం, హైస్కూళ్లలోని 3, 4, 5 తరగతులను వెనక్కు పంపడంతో వందల సంఖ్యలో స్కూలు అసిస్టెంట్లు మిగులుగా తేలారు. దీంతో వారు తప్పనిసరిగా బదిలీ కావాల్సి వచ్చింది. ఒకే పాఠశాలలో ఎనిమిదేళ్లు పూర్తయిన వారు, పునర్విభజనలో మిగులుగా తేలిన వారు సుమారు 1,600మంది కూడా విధిగా బదిలీ కావాల్సి వచ్చింది. మిగులుగా తేలిన వారిలో 404 మంది స్కూలు అసిస్టెంట్లను ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా సర్దుబాటు

మిగతా 6వ పేజీలో



7

కొట్టి చంపి.. పెట్రోల్ పోసి నిప్పంటించి!

ముక్తినూతలపాడులోని కోల్డ్‌స్టోరేజీ సమీపంలో ఘటన

మృతుడు కారు డ్రైవర్.. ఆరుగురి ప్రమేయం ఉన్నట్లు సమాచారం

వీరయ్యచౌదరి హత్య కేసులో మరో మలుపు

» గతంలోనే ఆయన్ను హతమార్చేందుకు ప్రయత్నించిన గ్యాంగ్
» కార్యాలయానికి కత్తులతో వెళ్లి జనం ఉండటంతో వెనక్కి
» హైదరాబాద్ ముఠా కోసం పోలీసుల వేట
» బెయిల్ ప్రయత్నాల్లో సురేష్.. కోర్టులో విచారణ వాయిదా

ఒంగోలుక్రైం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నాయకుడు వీరయ్యచౌదరి హత్య కేసు మరో మలుపు తిరిగింది. కిరాయి హంతకుడైన నెల్లూరు జిల్లాకు చెందిన నాగరాజును విచారించిన పోలీసులకు ఆశ్చర్యం కలిగించే విషయాలు తెలిశాయి. వీరయ్య చౌదరిని హత్య చేయడానికి ఆరు నెలల ముందే పథకం రూపొందించిన విషయం విదితమే. ఈమేరకు ఆయన్ను హతమార్చేందుకు తొలుత హైదరాబాద్ గ్యాంగ్‌ను

మిగతా 6వ పేజీలో

అప్పులబాధతో కౌలురైతు ఆత్మహత్య

6వ పేజీలో

'జూన్'జాటం

(5వ పేజీ తరువాయి)

బాక్స్, పెన్ను, పెన్సిల్ నోట్ బుక్స్. ఇలా ఒకటేమిటి రకరకాలు కొనుగోలు తప్పనిసరి. గతంలో విద్యార్థులు కావలసిన పుస్తకాలు తమకిష్టమొచ్చిన చోట కొనుక్కునేవారు. అయితే ఇప్పుడు పాఠశాలల పంథా మారింది. పెన్సిల్ దగ్గర నుంచి పుస్తకాల వరకు, బెల్టు, టై, షూస్, యూనిఫాం అన్నీ ఆయా స్కూళ్లలోనే కొనాలి. దీంతో ఒక్కో విద్యార్థికి సుమారు రూ.10వేలకుపైనే ఖర్చు కళ్ల ముందు కనిపిస్తోంది. ఇక ఏటా పెరుగుతున్న ఫీజులతో అదనంగా మరో రూ.25వేలు కట్టాల్సి వస్తోంది. ఒకవైపు ఆర్థికభారం.. మరోవైపు పిల్లల భవిష్యత్ కోసం మౌనంగానే ముందడుగు వేస్తున్నారు.

ఒక్కో కుటుంబంపై రూ.వేలల్లో భారం

మధ్యతరగతి కుటుంబాలది ఎపుడూ లెక్కల పుస్తకమే. ఒకవైపు నిత్యావసర సరుకులు, వివిధ అవసరాల ఖర్చులు అడ్డగోలుగా పెరిగిపోయాయి. దీంతో ఏనెలకానెల ఆదాయ, వ్యయాలపై ఆచితూచి అడుగులు వేస్తున్నవారిలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, రోజువారీ కూలీలు ఉన్నారు. అయితే చదువు విషయంలో పేద, మధ్య తరగతి అనే భేదం లేదు. సాధారణ రోజుల్లోనే ఒక చిన్న కుటుంబం ఇంటి అవసరాలకు సుమారు రూ. 25 నుంచి 30వేల వరకు ఖర్చవుతోంది. ఈనెలలో ఇంటి అవసరాలను పక్కన పెడితే కేవలం పిల్లల స్కూలు కోసం ఒక్కొక్కరికీ సుమారు రూ.30వేల నుంచి రూ.50వేల వరకూ ఖర్చుచేయాల్సి వస్తుందని వాపోతున్నారు. అయితే ఒకరితో సరిపెట్టుకునే అంశం కాదని, ఇంట్లో ఇద్దరు పిల్లలు ఉంటే ఇక అంతే.. జూన్‌లో లక్ష రూపాయలకుపైనే ఖర్చు చేయాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు.

10వ తరగతికి రూ.60వేలు ఖర్చు

- మోదుబోయిన మహేశ్వర్, డెకరేషన్ వర్కర్



వృత్తి రీత్యా ఫంక్షన్లకు డెకరేషన్‌లు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. అమ్మాయి 10వ తరగతికి వచ్చింది. పోయిన సంవత్సరం సుమారు 40వేలు ఖర్చయ్యింది. ఈ సంవత్సరం స్కూలు ఫీజు రూ.40వేలు కాకుండా, పుస్తకాల కోసం రూ.9,500 అదనంగా డబ్బులు కట్టాలి అంటున్నారు. యూనిఫాం, కోటు, బెల్ట్, షూలు అన్నీ వాళ్ల స్కూలులోనే కొనాలంటున్నారు. దీంతో ఒక సంవత్సరానికి సుమారు రూ.60వేలు అవుతుంది. పిల్లలు బాగా చదివి, ఉన్నతంగా ఉండాలన్న ఆశతో ఆర్థిక భారమైనా ఖర్చు భరించాల్సి వస్తుంది.

భారీగా స్కూల్ అసిస్టెంట్ల బదిలీ

(5వ పేజీ తరువాయి)

చేశారు. ఈ నేపథ్యంలో స్కూలు అసిస్టెంట్లు మొత్తం 2,929 మంది బదిలీకి దరఖాస్తు చేశారు. వీటిలో 14 దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. బదిలీ అయిన వారిలో స్కూలు అసిస్టెంట్ తెలుగు 181మంది, హిందీ 233, ఇంగ్లీష 223. సంస్కృతం నలుగురు, ఉర్దూ ఆరుగురు, గణితం 282 మంది, ఫిజికల్ సైన్స్ 365, బయోలాజికల్ సైన్స్ 200, సోషల్ 164, స్పెషల్ ఎడ్యుకేషన్ 9, పీఎస్ హెచ్ఎంలుగా 404 మంది మొత్తం 2,205 మంది స్థానాలు మారారు. బదిలీ ఉత్తర్వులు అందుకున్న స్కూలు అసిస్టెంట్లంతా ఆదివారం సాయంత్రం ప్రస్తుతం వారు పనిచేస్తున్న స్థానాల నుంచి రిలీవ్ అయ్యి సోమవారం బదిలీ అయిన కొత్త స్థానాల్లో చేరాలని డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీ

ఫలితాల్లో వెనుకంజ

(5వ పేజీ తరువాయి)

చతికిలబడ్డారు. జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 4,266 మంది హాజరు కాగా 2,433 మంది పాసయ్యారు. రాష్ట్రంలో సగటున 63శాతం మంది పాసుకాగా జిల్లాలో ఆరుశాతం తక్కువగా 57శాతం మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 567మంది పరీక్ష రాయగా 348మంది పాసయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి 700 మంది పరీక్షకు హాజరు కాగా 428 మంది అంటే 61.1శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. కొండపి, తాళ్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. ఏపీ మోడల్ జూనియర్ కళాశాలల్లో 103 మందికి 67మంది అంటే 65శాతం పాసయ్యారు. దర్శి, ముండ్లమూరు మోడల్ జూనియర్ కళాశాలల విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. హైస్కూలు ప్లస్‌లో 63మందికి 40మంది పాసయ్యారు. పాకల, హెచ్.నిడమానూరు, కె.ఉప్పలపాడు హైస్కూలు ప్లస్‌లో నూరుశాతం ఉత్తీర్ణులయ్యారు. కేజీబీవీలో 104మందికి 59 మంది పాసై 56.86శాతం ఉత్తీర్ణత సాధించారు. ఏపీఎస్‌డబ్ల్యూఆర్/ఏపీటీడబ్ల్యూఆర్‌లో 36మందికి 19మంది పాసయ్యారు. కంభం, దూపాడులో వందశాతం ఉత్తీర్ణులయ్యారు. ఎయిడెడ్‌లో 31 మందికి 25మంది అంటే 81శాతం పాసయ్యారు. గిద్దలూరు ఎస్‌వీ జూనియర్ కళాశాలలో 95శాతం మంది పాసయ్యారు.

ప్రథమ సంవత్సరంలో..

ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షకు 5,999 మంది హాజరు కాగా కేవలం 2,248 మంది పాసయ్యారు. రాష్ట్రంలో సగటున 45శాతం మంది ఉత్తీర్ణులు కాగా జిల్లాలో 8శాతం తక్కువగా కేవలం 37శాతం మంది మాత్రమే పాసయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 369మందికి 173 మంది పాసు కాగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 977 మందికి 412 మంది, ఏపీ మోడల్ జూనియర్ కళాశాలల్ల 138 మందికి 60మంది, హైస్కూలు ప్లస్‌లో 130 మందికి 42 మంది, కేజీబీవీల్లో 290 మందికి 156మంది, ఏపీఎస్‌డబ్ల్యూఆర్/ఏపీటీడబ్ల్యూఆర్‌లో 123 మందికి 54 మంది, ఎయిడెడ్‌లో 54 మందికి కేవలం 13మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. ఈ కళాశాలల్లో అతితక్కువగా కేవలం 24 శాతం మంది మాత్రమే పాసయ్యారు.

వీరయ్య చౌదరి హత్య కేసులో మరో మలుపు

(5వ పేజీ తరువాయి)

పిలిపించారనేది కూడా పోలీసుల విచారణలో వెల్లడైంది. మీడియా సమావేశంలోనూ ఆ వివరాలను ఎస్పీ తెలిపారు. అయితే నాగరాజును విచారించిన తర్వాత మరిన్ని నిజాలు వెలుగుచూశాయి. వీరయ్యచౌదరిని హత్య చేసేందుకు హైదరాబాద్ నుంచి ముగ్గురు కిరాయి హంతకులు వచ్చి ఒంగోలులో మకాం వేశారు. ఏప్రిల్‌లో ఆ ముగ్గురితోపాటు ప్రస్తుతం హత్యకేసులో నిందితులుగా ఉన్న గౌతం, నాగరాజులు కలిసి కత్తులు తీసుకొని వీరయ్యచౌదరి కార్యాలయానికి వెళ్లారు. అయితే అక్కడ ఎక్కువమంది ఉండటంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకుని వెనుతిరిగారు. ఆ తర్వాత హైదరాబాద్ గ్యాంగ్ భయపడి వెళ్లిపోయింది. దీంతో నెల్లూరు జిల్లాకు చెందిన మరో ఇరువురిని కలుపుకొని హత్య చేశారు. అయితే హైదరాబాద్ గ్యాంగ్‌తో ముప్పా సురేష్‌కు లింక్ ఉందా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. హైదరాబాద్ గ్యాంగ్‌ను ఎవరు మాట్లాడారన్న విషయమై ఆరా తీస్తున్నారు. ఆ ముఠా కోసం పోలీసులు వేట ప్రారంభించారు. వారు దొరికితే మరింత సమాచారం బయటకు వచ్చే అవకాశం ఉంది. కాగా వీరయ్యచౌదరి హత్య కేసులో సూత్రధారిగా ఉన్న ముప్పా సురేష్ 40 రోజులుగా పోలీసులకు దొరకలేదు. హైదరాబాద్‌కు బృందాలు వెళ్లి తిరిగి వచ్చాయి. ఆయనకు సంబంధించిన బంధువులను పోలీసులు విచారిస్తున్నారు. సురేష్ కంపెనీలో డైరెక్టర్‌గా ఉన్న గౌతమ్‌రెడ్డి రెండు దఫాలుగా రూ.లక్ష హత్య కేసులో ప్రధాన పాత్రధారి వినోద్‌కు పంపినట్లు గుర్తించారు. దీంతో గౌతమ్‌రెడ్డిని పిలిపించి పోలీసులు విచారణ చేశారు. సురేష్ చెబితే పంపినట్లు గౌతమ్‌రెడ్డి చెప్పినట్లు తెలిసింది. ఈక్రమంలో సురేష్ ఇప్పటికే ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం విచారణ వాయిదాపడింది. కోర్టులో వచ్చే నిర్ణయం మేరకు సురేష్ లొంగిపోతాడనే ప్రచారం జరుగుతోంది.



స్వామివారిని గ్రామోత్సవానికి తీసుకెళ్తున్న మోతకాపులు

చంద్రప్రభ వాహనంపై లక్ష్మీనరసింహుడు

● శాస్త్రోక్తంగా ధ్వజారోహణ ● గరుడు ప్రసాదం స్వీకరణకు అధిక సంఖ్యలో వచ్చిన మహిళలు

సింగరాయకొండ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన వరాహ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు రమణీయంగా సాగుతున్నాయి. అందులో భాగంగా రెండోరోజైన శనివారం స్వామివారికి శాస్త్రోక్తంగా ధ్వజారోహణ నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను గరుత్మంతుడి ద్వారా ఆహ్వానం పలికేందుకు మూలవిరాట్ వరాహ లక్ష్మీనరసింహస్వామి ఎదురుగా ఉన్న ధ్వజస్తంభంపై గరుడపటాన్ని అర్చకులు ఎగురవేశారు. ధ్వజారోహణ సందర్భంగా స్వామివారికి నివేదన చేసిన గరుడ ప్రసాదాన్ని (పొడిముద్ద) సంతానంలేని మహిళలు స్వీకరించి 9 రోజులపాటు నియమనిష్టలతో ఉండి మరలా ధ్వజా అవరోహణ సందర్భంగా స్వీకరిస్తే సంతానప్రాప్తి కలుగుతుందని ఇక్కడి భక్తుల విశ్వాసం. దీంతో సంతానం లేని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని గరుడ ప్రసాదాన్ని స్వీకరించారు.

ధ్వజారోహణ అనంతరం మోతకాపులు ఉత్సవమూర్తులను గ్రామోత్సవానికి తీసుకెళ్లారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేకంగా అలంకృతుడైన స్వామివారు రాత్రి చంద్రప్రభ వాహనంపై విహరించారు. గ్రామస్థులు రంగవల్లులువేసి స్వామివారికి హారతులు పట్టారు. ఈ కార్యక్రమంలో ఈవో పి.కృష్ణవేణి, ప్రధాన అర్చకులు ఉదయగిరి వెంకట శేషా లక్ష్మీనరసింహాచార్యులు, అర్చకుడు నరసింహాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ఆదివారం ఉదయం స్వామివారిని సూర్యప్రభ వాహనంపై ఊరేగిస్తారు. రాత్రికి హంసవాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు.

పేదల సేవలోనే నిజమైన సంతృప్తి

● ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ● డీజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ఒంగోలు కార్పొరేషన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పేదవారికి సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి ఉందని, వారికి చేయూత నిచ్చేందుకు డీజేఆర్ ట్రస్ట్ ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. శనివారం ఒంగోలులోని ఎంఎస్ ఫంక్షన్ హాలులో డీజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పుస్తకాలు, బ్యాగ్‌లు, బూట్లు, యూనిఫారం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ దామచర్ల నాగసత్యలత అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తాను రాజకీయాలతో పాటు, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ అందించడమే లక్ష్యంగా ట్రస్ట్ అండగా ఉంటుందని చెప్పారు. పేద విద్యార్థులకు టాలెంట్ పరీక్ష నిర్వహించి వారికి కార్పొరేట్ స్కూలులో 100మంది విద్యార్థులను చదివిస్తామని తెలిపారు. ప్రతి విద్యార్థి కూడా క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతంగా ఎదగాలని కోరారు. తాను ఎమ్మెల్యేగా అభివృద్ధి, ప్రజా సేవకు ప్రాధాన్యత ఇస్తుండగా, మరోవైపు పేద విద్యార్థుల చదువు బాధ్యతను తీసుకోవడం సంతోషంగా ఉందని దామచర్ల తెలిపారు. అందుకోసం రూ. సుమారు రూ.30 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఐదేళ్లలో ట్రస్ట్ ద్వారా పదో తరగతి వరకు చదివిస్తామని, 500 మంది విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ అందించడమే ట్రస్ట్ లక్ష్యమన్నారు. చైర్మన్ నాగసత్యలత మాట్లాడుతూ ప్రతి ఏడాది కూడా వందమంది పిల్లలకు విద్య అందించేలా దృష్టి సారించామన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయాలని సూచించారు. ట్రస్ట్ డైరెక్టర్లు తనూజాలక్ష్మి, అనూషాలక్ష్మి, శ్రీహర్షిణి విద్యాసంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్, నగరంలోని పలు ప్రైవేటు విద్యాసంస్థల యాజమానులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందిస్తున్న ఎమ్మెల్యే దాచమర్ల జనార్దన్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నల్లూరి వెంకటేశ్వర్లు, ఈశ్వరయ్య, నారాయణ తదితరులు

సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు, పార్టీ సీనియర్ నేత నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న) కోరారు. స్థానిక మల్లయ్యలింగంభవన్‌లో శనివారం సీపీఐ రాష్ట్రమహాసభల ఆహ్వాన సంఘం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నల్లూరి మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన సీపీఐ రాష్ట్రమహాసభలు ఒంగోలులో తొలిసారిగా నిర్వహించడం అభినందనీయమన్నారు. దేశ అభివృద్ధిలో సీపీఐ పోరాటాల ద్వారా కీలక పాత్ర పోషించిందని చెప్పారు. మహాసభల నిర్వహణకు అన్ని వర్గాల ప్రజలు తమవంతు సహకారాన్ని అందించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ ఆగస్టు 20నుంచి 25వరకు జరిగే రాష్ట్రమహాసభల్లో వెయ్యి మందికిపైగా ప్రతినిధులు, వలంటీర్లు, ఆహ్వానితులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొంటారన్నారు. ఆగస్టు 23న జరిగే భారీ ర్యాలీ, బహిరంగ సభలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు. జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని వర్గాల కళాకారులతో పాటు సినీ రంగప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్.వెంకట్రావు, కె.వెంకటేశ్వర్లు, కె.వీరారెడ్డి, శ్రీరామ్ శ్రీనివాసులు, గద్దల రవి, నూనె జగన్మోహన్‌రావు, ఆదినారాయణ, బోడపాటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ సైదుబాబు

అప్పులబాధతో కౌలురైతు ఆత్మహత్య

మార్కాపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా వ్యవసాయంలో నష్టాలు, ఆర్థిక కష్టాలు ఎదురుకావడంతో భరించలేక కౌలురైతు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన ప్రకాశం జిల్లా మార్కాపురంలోని సుందరయ్య కాలనీలో శనివారం చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై ఎం.సైదుబాబు కథనం మేరకు.. తర్లుపాడు మండలం మీర్జాపేట గ్రామానికి చెందిన రాజారపు పెద్ద యలమంద(55) 20 ఏళ్ల క్రితం స్థానిక సుందరయ్య కాలనీకి వచ్చి అక్కడే నివాసముంటున్నారు. చుట్టుపక్కల ఉన్న భూములు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. ఈక్రమంలో పదేళ్లుగా జాతీయ రహదారి 565 ఆనుకుని ఎస్సార్ పెట్రోల్ బంకుకు ఇరువైపులా 10ఎకరాల్లో మిరపను సాగుచేస్తున్నారు. రెండేళ్లుగా దిగుబడి అంతంతమాత్రంగా రావడం, ధర లేకపోవడంతో సుమారు రూ.20లక్షల మేర అప్పులపాలయ్యారు. ఒకవైపు నష్టాలు, మరోవైపు అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. దీంతో మానసిక వేదనకు గురైన పెద్దయలమంద శనివారం ఉదయం 8.00 గంటలకు ఎప్పటిలాగే పొలానికి వెళ్లి అక్కడ కలుపు నివారణ కోసం వాడే మందును తాగారు. పొలంలో విగతజీవిగా పడి ఉన్న రైతును గొర్రెల కాపరి చూసి ఆయన భార్య కాశమ్మకు తెలియజేశారు. కుటుంబ సభ్యులు అక్కడి వెళ్లి చూసేసరికి అప్పటికే మృతిచెంది ఉన్నారు. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



యలమంద (ఫైల్)



ఇంట్లో పరిశీలిస్తున్న పోలీసులు

మద్దిపాడులో 10 సవర్ల బంగారం చోరీ

మద్దిపాడు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మద్దిపాడులోని పైపాలెంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. బాధితుల కథనం మేరకు మిండ తిరుపతిరావు అల్లూరి ఎఫ్‌సీఐ గోడౌన్‌లో ఉద్యోగిగా పని చేస్తున్నారు. ఆయన మద్దిపాడు పైపాలెంలో నివాసం ఉంటున్నారు. రాత్రి సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి బయట నిద్రిస్తుండగా దొంగలు తలుపులు పగులగొట్టి బీరువాలోని పది సవర్ల బంగారు ఆభరణాలు, రూ.10వేల నగదు, వెండి సామగ్రి తస్కరించారు. తెల్లవారి లేచిచూస్తే బీరువా తలుపులు పగులగొట్టి ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శివరామయ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఒంగోలు నుంచి క్లూస్ టీం వచ్చి వేలిముద్రలను సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి

ఒంగోలు క్రైం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన ఒంగోలులోని పాతమార్కెట్ దగ్గర శనివారం రాత్రి జరిగింది. స్థానిక ఇందిరకాలనీ 3వ లైన్‌లో నివాసం ఉండే చీమలదిన్నె వెంకాయమ్మ (62) ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఇంటికి స్కూటీ పైవెనుక కూర్చొని వెళుతుంది. పాతమార్కెట్ వద్ద వెనుక నుంచి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. దీంతో స్కూటీపై కూర్చున్న వెంకాయమ్మ రోడ్డు మీద పడి తలకు బలమైన గాయం తగిలి తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందింది. ఈమేరకు టూటౌన్ ఎస్ఐ పున్నారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.



వెంకాయమ్మ మృతదేహం

నేడు కొత్తపట్నంలో యోగా : కలెక్టర్

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర-25 మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు కొత్తపట్నం బీచ్ వద్ద యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమంలో ఆ ప్రాంత ప్రజలు అధికసంఖ్యలో పాల్గొనాలని, తమ వెంట యోగా మ్యాట్‌ను తీసుకోవాలని హాజరుకావాలని ఆమె సూచించారు.

రంగస్వామికి పోటెత్తిన భక్తులు

రాచర్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలో జేపీ చెరువు అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని పూజలు చేసి, స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.నాగయ్య భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేశారు. సత్రాలలో భక్తులకు ఉచిత అన్నదానం నిర్వహించారు.

స్థల వివాదానికి రాజకీయ రంగు

● టీడీపీ కేడర్, అధికారులను అప్రతిష్టపాల్జేసే యత్నం

● వైసీపీ సోషల్ మీడియాలో రాద్ధాంతం

● పురుగుమందు తాగేలా ప్రేరేపించి... ఆపై పరామర్శల పేరుతో విమర్శలు చేస్తూ పోస్టులు

బల్లికురవ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సెంటు స్థలం విషయమై రెండు కుటుంబాల మధ్య నెలకొన్న వివాదాన్ని వైసీపీ సోషల్ మీడియా బ్యాచ్ రాద్ధాంతం చేస్తూ టీడీపీ క్యాడర్‌ను, అధికారులను అప్రతిష్టపాలు చేసే పనిలో నిమగ్నం కావటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. మండలంలోని రామాంజనేయపురంలో నాగిపోగు ఏసురత్నం, నాసరమ్మ కుటుంబాల మధ్య సెంటు స్థలం విషయంపై గత కొంతకాలంగా వివాదం ఉంది. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన వైసీపీ నేతలు ఏసురత్నంను పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడేలా ప్రేరేపించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం ఏసురత్నం పురుగు మందు తాగటంతో తొలుత అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు, అనంతరం ఒంగోలు వైద్యశాలకు తరలించారు. అధికారులను బెదిరించే క్రమంలో పురుగు మందు తాగిన వ్యక్తి చేత స్టేట్‌మెంట్‌లు కూడా ఇప్పిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిని రాజకీయ రంగు పులిమే పనిలో వైసీపీ క్యాడర్ నిమగ్నమైంది. ఈ క్రమంలో ఒంగోలులో చికిత్స పొందుతున్న ఏసురత్నంను వైసీపీ నేతలు పరామర్శించినట్లు వెళ్లి టీడీపీ నేతలు, అధికారులపై విమర్శలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుండటం విమర్శలకు తావిస్తోంది. ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకపోయినా అధికార పార్టీని బదనామ్ చేసే ఉద్దేశంతో వైసీపీ సోషల్ మీడియా వ్యవహరిస్తుందనే విమర్శలు వస్తున్నాయి. ఈ విషయాలను టీడీపీ క్యాడర్ తీవ్రంగా ఖండిస్తున్నది. వైసీపీ నేతలు, సోషల్ మీడియా పుణ్యాన ప్రశాంతంగా ఉన్న గ్రామాలు కాస్తా రగిలిపోయే పరిస్థితి నెలకొందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అధికారులు స్పందించి ఆరంభంలోనే ఇటువంటి విషయాలకు ఫుల్‌స్టాప్ పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



హెలిప్యాడ్ వద్ద పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

11న పొదిలికి జగన్

పొదిలి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 11న పొదిలి పొగాకు బోర్డును ఈనెల 11న సందర్శించనున్నట్లు ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక హెలిప్యాడ్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొగాకు రైతులకు ధరలు లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అందుకు రైతుల సమస్యలు తెలుసుకునేందుకు జగన్ వస్తున్నారన్నారు.సమావేశంలో పార్టీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ తలశిల రఘు రాం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో భవిత కేంద్రాలు

రేపటితో ముగియనున్న ప్రత్యేక అవసరాల చిన్నారుల సర్వే

చీరాల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : దృష్టి, వినికిడి సమస్యలున్న చిన్నారులకు సైతం సాంకేతిక విద్యనందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఈక్రమంలోనే డిజిటల్ విధానంలో సాంకేతిక విద్యనందించేందుకు ట్యాబులు అందించి బోధన సాగిస్తున్నది. ప్రత్యేక అవసరాలున్న పిల్లల ఆరోగ్యంతో పాటు వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు భవిత కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈక్రమంలోనే భవిత కేంద్రాల సిబ్బంది ప్రత్యేక యాప్ విధానంతో శిక్షణ అందిస్తున్నారు. అందుకు సంబంధించిన ఎన్‌రోల్‌మెంట్ సర్వే గతేడాది మాదిరిగా ఈ ఏడాది కూడా నిర్వహిస్తున్నారు. మే 13 నుంచి ప్రారంభమైన ఈ సర్వే జూన్ 9తో ముగియనుంది. గతేడాది సర్వేలో 759 మందిని గుర్తించి బోధన అందిస్తుండగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 130 మంది మాత్రమే ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను అధికారులు గుర్తించడం విశేషం.



సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

పారదర్శక సేవలు - ప్రత్యేక బోధన

జిల్లా వ్యాప్తంగా ఉన్న 25 మండలాల్లో ఒక్కో మండలానికి ఒక కేంద్రం చొప్పున ప్రస్తుతం 25 భవిత కేంద్రాలు ఉన్నాయి. అలాగే ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు జిల్లా పరిధిలో 3,713 మంది ఉన్నారు. ఈక్రమంలో వారు భవిత కేంద్రాల్లో 460 మంది, జిల్లా పరిషత్‌లలో 1,809, జూనియర్ కళాశాలల్లో 176, యూపీ స్కూల్స్‌లో 306, ప్రాథమిక పాఠశాలల్లో 962 మంది చదువుతున్నారు. అయితే వీరిలో వినికిడి, దృష్టి సమస్యలున్న వారి బోధన కోసం గతేడాది 190 ట్యాబులు పంపిణీ చేయగా, వినికిడి సమస్య చిన్నారులకు 103, దృష్టి సమస్య చిన్నారులకు 11 ట్యాబులు పంపిణీ జరిగింది. వారికి శిక్షణ అందించేందుకు ఐఈఆర్‌పీలకు 49, స్కూల్ అసిస్టెంట్‌లకు 27 అందించి తద్వారా డిజిటల్ బోధన అందిస్తున్నారు.

అనునిత్యం పరిశీలన



ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ప్రత్యేక విద్యతో పాటు అనునిత్యం జీవన విధానాలపై దృష్టి సారిస్తున్నాం. తద్వారా వారికి బంగారు బాటలు పడతాయి. అలాగే ట్యాబులు పొందిన వారు వినికిడి, దృష్టి సమస్యలున్న వారికి ప్రత్యేక యాప్‌లు అందించి బోధన సాగిస్తున్నాము. అలాగే వినియోగం స్థితి గతులపై దృష్టి పెట్టాం.

- జ్యోత్స్న, జిల్లా సహిత విద్య సమన్వయకర్త



ఆఖర్లో కాక!

- రోహిణి కార్తె చివరి రోజున ఎండ భగభగలు
- పలుచోట్ల 40 డిగ్రీలు నమోదు
- దానికితోడు ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి
- నేడు మృగశిర రాక

ఒంగోలు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : రోహిణీ కార్తె చివరిరోజైన శనివారం జిల్లాలో ఎండలు మండాయి. నమోదైన ఉష్ణోగ్రతల కన్నా ఎండల తీవ్రత అధికంగా ఉంది. గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు కాస్తంతపైన మాత్రమే ఉన్నప్పటికీ ఆవిరి వాతావరణంతో జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. సాధారణంగా రోహిణీ కార్తెలోనే జిల్లాలో అత్యధికంగా ఎండలు ఉంటాయి. రెండువారాల కార్తె సమయంలో కనీసం ఒకవారమైనా 44 నుంచి 46 డిగ్రీల ఉష్ణోగ్రతలతో పాటు వేడిగాలులు, ఉక్కపోత తీవ్రత ఉంటుంది. అయితే ఈ ఏడాది రోహిణీ కార్తె కన్నా ముందు నుంచే వర్షాలు పడటం వారంరోజుల ముందే రుతుపవనాల రాకతో రోహిణీ కార్తె తొలివారం చల్లటి వాతావరణమే నెలకొంది. రెండవ వారంలో క్రమంగా ఎండల ప్రభావం కనిపించింది. చివరి రోజైన శనివారం ఎండల తీవ్రత అధికంగా ఉంది. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో రాష్ట్రంలోకల్లా అత్యధికంగా జిల్లాలోని టంగుటూరులో 40.10 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లాలో మధ్యాహ్నం 3 గంటల వరకు చాలా చోట్ల 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకు జిల్లాలోని టంగుటూరులో 40.10 డిగ్రీలు, కేకేమిట్లలో 40.09, సానికవరంలో 40.09, గోగులదిన్నెలో 40.09, ఉప్పలపాడులో 40.09, పచ్చవలో 40.09, కొండపిలో 40.08. ఒంగోలులో 40.30, దర్శి మండలం కొత్తపల్లిలో 40.0 డిగ్రీలు నమోదైంది. ఒంగోలు నగర పరిధిలోని త్రోవగుంటలో 40.07 డిగ్రీలు నమోదైంది. సాయంత్రం నాలుగు గంటలకు పలుచోట్ల వాతావరణం చల్లబడి జల్లులు పడ్డాయి. చల్లటి వాతావరణం వచ్చే మృగశిర కార్తె ఆదివారం నుంచి రానుండగా ముందుగానే వాతావరణంలో మార్పు వచ్చి జల్లులు పడ్డాయి. అలా శనివారం సాయంత్రం మేడపిలో 41.0 మి.మీ. పచ్చవలో 32.0, నర్శింగోలులో 23.0, పుచ్చకాయలపల్లిలో 21.50 మి.మీ. కురియగా ఇతర చోట్ల జల్లులు పడ్డాయి.

చెంచులకు రేషన్ బహుదూరం

- అటవీ ప్రాంతంలో ఉండే గిరిజనులకు తప్పని కష్టాలు
- దూర ప్రాంతాల వారికి వాహన ఏర్పాట్లు చేయాలని వేడుకోలు



బియ్యం మూటను ఇంటికి మోసుకెళ్తున్న మహిళ

ఎర్రగొండపాలెం రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) :రేషన్‌షాపుల వద్దే రేషన్ సరుకులు తీసుకోవాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో జీవించే చెంచు కుటుంబాలకు ఇది సమస్యగా మారింది. దూర ప్రాంతాల్లోని రేషన్ దుకాణానికి వెళ్లి రావాలంటే తీవ్ర ఇక్కట్లు తప్పడం లేదని చెంచు గిరిజనులు వాపోతున్నారు.

గంజివారిపల్లి పరిధిలో..

మండలంలోని గంజివారిపల్లిలో చెంచు గిరిజన స్టోర్ ఉంది. ఈ స్టోర్ పరిధిలో శాంతినగర్, గాంధీనగర్, దద్దనాల, అల్లిపాలెం, చెన్నుపల్లి చెంచు గూడేలు ఉన్నాయి. ఆయా గూడేలలో సుమారు 250 కార్డులు చెంచులవి ఉన్నాయి. వెంకటాద్రిపాలెం పరిధిలో సంఘం తాండ, పునరాస కాలనీలు ఉండగా సుమారు 70 కార్డులు ఉన్నాయి. వీరభద్రాపురం పరిధిలో యల్లారెడ్డిపల్లి ఎస్సీ పాలెంలో రేషన్‌షాపు ఏర్పాటు చేశారు. ఈ రేషన్ షాపు పరిధిలో పోతురాజు పెంట, గౌతమబుద్ధిని కాలనీ, బిల్లగొంది ఉన్నాయి. ఆయాచోట్ల 50 రేషన్ కార్డులు ఉన్నాయి. మొత్తం కలిపి 300 కార్డులు ఉన్నాయి. అయితే ఒక్కో కార్డుదారుడికి 35 కేజీల బియ్యం వస్తుంటాయి. డీలర్ షాపునకు ఒక్కో గ్రామం కనీసం 2 కి.మీటర్ల దూరం ఉంటుంది. అంత దూరం వెళ్లి తీసుకోని రావాలంటే ఇబ్బందులు పడుతున్నామని భూమని నాగన్న, భూమని అంకమ్మ, కుడుముల నాగమ్మ తెలిపారు. కావున అధికారులు స్పందించి మా చెంచు కుటుంబాల కోసం పంచాయతీ పరిధిలోని ట్రాక్టర్ లేదా ఏదైన వాహనం ఏర్పాటు చేసి ఒకరోజు తమకు కేటాయించి రేషన్ సరుకులు అందజేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల చెంచు కుటుంబాలు రెవెన్యూ, పంచాయతీ అధికారులతో పాటు నాయకులను కోరుతున్నారు. గతంలో మాదిరి రేషన్ షాపుల వద్ద తీసుకోవడం మంచిదే అయినా దూరం అవుతుందని కుడుముల వీరమ్మ వాపోయింది. పోతురాజు పెంట నుంచి యల్లారెడ్డి పల్లి ఎస్సీ పాలెం 2 కి.మీ దూరం ఉందనీ, అల్లిపాలెంకు 5 కిమీ దూరం ఉంటుందని అమె తెలిపారు. చెంచుల కోసం అధికారులు స్పందించి ఏదైన వాహనం ఏర్పాటు చేస్తే బాగుంటుందని బిల్లగొంది, పోతురాజు పెంట గూడేల ప్రజలు కోరుతున్నారు.



రేషన్ డిపో వద్ద సరుకుల కోసం ఉన్న కార్డుదారులు

ఎస్జీటీలకు వెబ్‌కౌన్సెలింగ్

ఒంగోలు విద్య, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల బదిలీల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లకు కూడా వెబ్ కౌన్సెలింగ్ విధానంలోనే బదిలీలు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు ఏర్పాట్లు కూడా చేస్తోంది. శుక్రవారం సాయంత్రమే ఎస్జీటీలకు వెబ్‌కౌన్సెలింగ్‌ను ఖరారు చేసి ఆప్షన్లు పెట్టుకోవడంలో పాటించాల్సిన జాగ్రత్తలపై వీడియోలు కూడా విడుదల చేసింది. పాఠశాల విద్యాశాఖ కార్యదర్శితో జరిగిన చర్చల్లో ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక కోరింది. దానికి ఆయన సూత్రప్రాయంగా అంగీకరించారు. దీంతో ఇప్పటి వరకు సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ మాన్యువల్‌గానే జరుగుతుందన్న ఆశతో ఉన్నారు. అయితే శుక్రవారం సీన్ మొత్తం మారిపోయింది. ఉపాధ్యాయుల బదిలీలను వెబ్ కౌన్సెలింగ్ ద్వారానే బదిలీలు నిర్వహించాలని ఆదేశించడంతో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. సెకండరీ గ్రేడ్ టీచర్లు వేల సంఖ్యలో బదిలీ అవుతారు. దీంతోవారు వెబ్ ఆప్షన్లు కూడా వందల్లో పెట్టుకోవాల్సి ఉంటుంది. వెబ్‌ఆప్షన్లు పెట్టుకునే విషయంలో వారికి అసౌకర్యం కలగకుండా ఫెసిలిటేషన్ సెంటర్లు పనిచేయనున్నాయి. ఒంగోలు డీఆర్ఆర్ఎం స్కూలులోని ఫెసిలిటేషన్ సెంటర్‌లో సాంకేతిక సిబ్బంది మరింతమందిని నియమించి ఎంతమంది వచ్చినా ఆప్షన్లు పెట్టుకునేందుకు వెసులుబాటు కల్పించారు. ప్రతి మండల విద్యావనరుల కేంద్రాల్లో కనీసం 10కి తగ్గకుండా ల్యాప్‌టాప్‌లు ఏర్పాటు చేసి కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న టీచర్లను నియమించనున్నారు. టీచర్లకు వెబ్‌ఆప్షన్లు పెట్టించే బాధ్యత మండల విద్యాధికారులదేనని కమిషనర్ స్పష్టంచేశారు.

- **ప్రాధాన్యత కేటగిరీ మార్చుకోవచ్చు**

సెకండరీ గ్రేడ్ టీచర్లు ప్రాధాన్యత కేటగిరీ మార్చుకొని జనరల్ స్థానాలు కోరుకునేందుకు అవకాశం కల్పించారు. అయితే వారు తమ దరఖాస్తులోని ప్రాధాన్యత కేటగిరీని వదులుకొని జనరల్‌కు మారితేనే ఈ వెసులుబాటు వస్తుంది. ఎస్జీటీలకు ఖాళీలు డివిజన్, మండలాలు, క్లస్టర్ స్థాయిలో మూడు కేటగిరీలుగా కనిపిస్తాయి. అయితే ఈ సారి ఆయాస్థానాల దూరం కూడా కనిపిస్తుంది. ఎన్ని ఆప్షన్లు అయినా పెట్టిస్తామని, టీచర్లు వెబ్ కౌన్సెలింగ్‌పై ఆందోళన చెందవద్దని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. టీచర్లకు నచ్చజెప్పేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

'ఎస్జీటీలకు మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహించాలి'

ఒంగోలు విద్య, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాన్యువల్ విధానంలోనే బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించాలని టీఎస్‌యూఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మన్నం శ్రీనివాస్, శెట్టి వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో కోరారు. గత 15 రోజులుగా మాన్యువల్ కౌన్సెలింగ్ అంటూ హఠాత్తుగా వెబ్ కౌన్సెలింగ్ అనడంతో సెకండరీ గ్రేడ్ టీచర్లు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. వేలాది మంది ఎస్జీటీలు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉందన్నారు. స్థానాల కోసం వేలాది ఆప్షన్లు పెట్టుకోవాలంటే ఇబ్బందికరంగా ఉంటుందని తెలిపారు. విద్యాశాఖ అధికారులు ఇచ్చిన మాటపై నిలబడి మాన్యువల్ విధానంలోనే కౌన్సెలింగ్ నిర్వహించాలని వారు కోరారు.

డీలర్లు రికార్డులను సక్రమంగా నిర్వహించాలి



డీలర్ల సమావేశంలోమాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఎరువులు విక్రయించే డీలర్లు రికార్డులను సక్రమంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు అన్నారు. పారదీప్ పాస్‌ఫెట్స్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక గ్రీవెన్స్ హాలులో పీవోఎస్ మిషన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈపీవోఎస్ మిషన్లు అమ్మిన వెంటనే అమ్మినట్లుగా క్లియర్ చేయాలన్నారు. అలా రికార్డుల్లో నమోదు చేయకపోతే డీలర్లపై చర్యలు తీసుకోవాల్సి వస్తోందని హెచ్చరించారు. కంపెనీ మార్కెటింగ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పీవీ సుభాష్ మాట్లాడుతూ డీలర్లకు కంపెనీ ద్వారా పీవోఎస్‌డివైస్‌లను అందజేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం డీలర్లకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఈ మిషన్ల వినియోగంపై వివరించారు.

278 మందికి షైనింగ్ స్టార్స్ అవార్డులు

ఒంగోలు విద్య, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మార్చిలో జరిగిన పదవ తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన 278 మంది విద్యార్థులకు ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ అవార్డులకు ఎంపిక చేసింది. వీరిలో 242 మంది పదవ తరగతి విద్యార్థులు కాగా 36 మంది ఇంటర్మీడియెట్ విద్యార్థులు ఉన్నారు. ఇంటర్మీడియెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో అత్యధిక మార్కులు సాధించి ప్రథములుగా నిలిచిన విద్యార్థులకు ఈ షైనింగ్ స్టార్స్ అవార్డులతో ప్రభుత్వం సత్కరించింది. అదే విధంగా జిల్లాస్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన వారికి కూడా ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ అవార్డులతో సత్కరించనుంది. ఈ విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి వారిని ఉన్నత చదువులకు ప్రోత్సహించేందుకు ఈ అవార్డులు అందజేస్తున్నారు. పదవ తరగతిలో 500లకుపైగా మార్కులు సాధించిన విద్యార్థులను పరిగణనలోకి తీసుకొని అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఎంపిక చేశారు. ప్రతి మండలం నుంచి ఆరుగురు విద్యార్థులను ఎంపిక చేశారు. వీరిలో ఓసీ-2, బీసీ-2, ఎస్సీ, ఎస్టీ ఒక్కొక్కటి చొప్పున ఈ మొత్తం ఆరుగురిని ఎంపిక చేశారు. అత్యధిక మార్కుల్లో ఒకే మార్కులు వచ్చిన విద్యార్థులు ఒకరికంటే ఎక్కువ మంది ఉంటే వారిని కూడా ఈ అవార్డులకు ఎంపిక చేశారు. జిల్లాలో ఈ అవార్డులకు ఎంపికైన వారిలో ఓసీ బాలురు 33, ఓసీ బాలికలు 52, బీసీ బాలురు 32, బీసీ బాలికలు 51, ఎస్టీ బాలురు 15, ఎస్టీ బాలికలు 16 మంది, ఎస్సీ బాలురు 16, ఎస్సీ బాలికలు 24 మంది, దివ్యాంగ బాలురు ఒకరు, దివ్యాంగ బాలికలు ఇద్దరు ఈ అవార్డులకు ఎంపికయ్యారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ, ఎంఈసీ, ఒకేషనల్ కోర్సుల్లో అత్యధిక మార్కులు సాధించిన 36 మందిని ఎంపికచేశారు. 830కిపైగా మార్కులు సాధించిన ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల పిల్లలను పరిగణనలోకి తీసుకొని అత్యధిక మార్కులు సాధించిన వారిని ఎంపిక చేశారు. దివ్యాంగ విద్యార్థులు పదవ తరగతిలో 70శాతంపైగా మార్కులు ఇంటర్మీడియెట్‌లో అయితే 700/1000 మార్కులుపైగా సాధించిన వారిని ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ అవార్డుల కింద విద్యార్థులకు రూ.20వేల నగదు, మెడల్, సర్టిఫికెట్ ఇస్తారు. ఈనెల 9న వీరికి షైనింగ్ స్టార్స్ అవార్డులు అందజేయాలని పాఠశాల విద్యా ముఖ్య కార్యదర్శి కోన శశిధర్ ఆదేశించారు.

నేడు డీఈవో కార్యాలయం ముట్టడి

- మండల కేంద్రాల్లో టీచర్లు నిరసన

ఒంగోలు విద్య, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాన్యువల్ విధానంలోనే బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్జీటీలకు వెబ్ కౌన్సెలింగ్‌ను నిరసిస్తూ ఐక్యవేదిక ఇచ్చిన పిలుపు మేరకు శనివారం సాయంత్రం జిల్లావ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో టీచర్లు నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. ఆదివారం డీఈవో కార్యాలయం ముట్టడికి వేదిక నాయకులు పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు డీఈవో కార్యాలయ ముట్టడి కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. శనివారం సాయంత్రం ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వేదిక నాయకులు షేక్ అబ్దుల్ హై, వాకా జనార్ధన్‌రెడ్డి, శేషారావు, ఎస్.రవి, ఎర్రయ్య, బి.వెంకట్రావు, డి.వీరాంజనేయులు, పీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

13 నుంచి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

నాగులుప్పలపాడు, జూన్7 (ఆంధ్రజ్యోతి): మద్దిరాలపాడులో ఈ నెల 13వ తేదీ నుంచి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ సీనియర్ నాయకుడు గుమ్మడి సాయిబాబా, పాలపర్తి రవికుమార్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీల విజేతలకు మొదటి బహుమతి రూ.20,116, రెండవ బహుమతి రూ.15,116, మూడవ బహుమతి రూ.10,116 ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు వివరాలకు 8247813160, 9398693235 సెల్ నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.



కుంట మాయం!

నీటి నిల్వల కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చుచేసి ఉపాధిహామీ పథకం ద్వారా అటు కూలీలకు ఉపాధితోపాటు ఇటు రైతులకు భూసంరక్షణ, నీటినిల్వలకు వీలుగా కుంటలను తవ్వే కార్యక్రమం చేపడుతోంది. పుల్లలచెరువులో (వర్క్ ఐడీ 030522) 2023 -24లో తవ్విన నీటి కుంటను 2024 జూన్‌లో జిల్లా అధికారులు కూడా వచ్చి పరిశీలించి కితాబు ఇచ్చారు. రూ.58 వేలు నగదు కూడా బిల్లు అయి చెల్లింపులు జరిగాయి. ఇప్పుడు అకస్మాత్తుగా ఆ స్థలంలో కుంట మాయమై పోయింది. ఆ పొలం రైతు కుంటను పూడ్చేశారు. అధికారులు పట్టించుకోవడం మానేశారు. - త్రిపురాంతకం (ఆంధ్రజ్యోతి)

కారు డ్రైవర్‌ను కొట్టి చంపి కాల్చేశారు!



- ముక్తినూతలపాడులో కోల్డ్‌స్టోరేజీ సమీపాన ఘటన
- ఆరుగురు నిందితులుగా ప్రాథమిక అంచనా

ఒంగోలు క్రైం,జూన్7(ఆంధ్రజ్యోతి): కారు డ్రైవర్‌ను దారుణంగా కొట్టి పెట్రోలు పోసి తగులబెట్టారు. ఈ ఘటన ఒంగోలు శివారు ప్రాతంలోని ముక్తినూతలపాడులో శుక్రవారం రాత్రి జరిగింది. ముక్తినూతలపాడుకు చెందిన బోడపాటి ద్రోణాచలం అలియాస్ రాజా (28)ని అత్యంత దారుణంగా హత్య చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. రాజా బెంగళూరులో కారు డ్రైవర్‌గా పనిచేస్తూ ఉంటాడు. ఈనెల 5న బెంగళూరు నుంచి పల్నాడు జిల్లా సత్తెనపల్లి సమీపంలోని తన అత్తగారి ఇంటికి వెళ్లాడు. అక్కడి నుంచి ముక్తినూతలపాడు వచ్చి చెరువు కట్టపైన కూర్చొని రాత్రి వరకు మద్యం సేవించాడు. అనంతరం అతని స్నేహితులు ఆరుగురు వచ్చారు. వారి మధ్య మాటామాట పెరిగి రాజాను కొట్టి పెట్రోలు పోసి తగులబెట్టినట్టు ప్రాథమికంగా తేలింది. ఈ ఘటన ముక్తినూతల పాడులోని మహలక్ష్మీ కోల్డ్ స్టోరేజీ సమీపంలో గల ముళ్ల పొదల్లో జరిగింది. అయితే వారి మధ్య వివాదాలకు వివాహేతర సంబంధం కారణాలున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఆరుగురిలో ఒకరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఒంగోలు తాలుకా సీఐ విజయకృష్ణ, సిబ్బంది పరిశీలించారు.



ఘటనా ప్రదేశంలో జనం

వసతిగృహాలకు మహర్దశ

- సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ స్వామి
- ఎస్సీ హాస్టల్ అభివృద్ధి పనుల పరిశీలన
- త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు ఆదేశం

సింగరాయకొండ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : వసతిగృహాలకు మహర్దశ పట్టిందని, వాటి రూపురేఖలను పూర్తిగా మారుస్తున్నామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. స్థానిక కందుకూరు రోడ్డు సమీపంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో రూ.40 లక్షలతో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన శనివారం పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తిచేసి పాఠశాలల పునఃప్రారంభం నాటికి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. హాస్టల్ ప్రాంగణంలో విద్యార్థులు క్రీడలు ఆడుకోవడానికి వీలుగా వాలీబాల్, కబడ్డీ, షటిల్ కోర్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం స్వామి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాల పిల్లలు ఉండి చదువుకునే వసతి గృహాలను ఐదేళ్లుగా పట్టించుకోలేదని విమర్శించారు. కనీస సౌకర్యాల కల్పనకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. దీంతో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్టవేసి ఉన్నాయని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత వసతి గృహాల్లో సౌకర్యాల కల్పనపై దృష్టిపెట్టామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 810 సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో కనీస సౌకర్యాల కల్పనకు రూ.140 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. జిల్లాలో కొత్త భవనాల నిర్మాణానికి రూ.54.65 కోట్లు, మరమ్మతులకు రూ.10 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. హాస్టళ్లలో వసతుల కల్పన పనులు శరవేగంగా జరుగుతున్నాయని వెల్లడించారు. మంత్రి వెంట ఎడ్యుకేషనల్ అండ్ వేల్ఫేర్ డీఈ జగన్మోహన్‌రావు, టీడీపీ నాయకులు ఉన్నారు.



ఎస్సీ హాస్టల్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మంత్రి స్వామి

సత్తా చాటిన శ్రీప్రతిభ విద్యార్థులు



విద్యార్థులతో చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు

ఒంగోలు విద్య, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో ఒంగోలులోని శ్రీప్రతిభ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులతో తమ సత్తా చాటారు. ఎంపీసీ విభాగంలో టి.మణికంఠ, వై. హేమవర్షిత 467 మార్కులతో రాష్ట్రంలో ద్వితీయస్థానం, బైపీసీ విభాగంలో పి.సంతోషిణి, వై.నాగనందినిలు 435 మార్కులతో రాష్ట్రంలో తృతీయ స్థానంలో నిలిచారు. ఎంపీసీలో 470కి 466 మార్కులతో ఆరుగురు మూడవ స్థానం, 465 మార్కులతో 17 మంది నాల్గవ స్థానం, 464 మార్కులతో 22మంది 5వ స్థానంలో నిలిచారు. బైపీసీలో 440కి434 మార్కులతో ఇద్దరు రాష్ట్రంలో నాల్గవ స్థానం సాధించారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను శనివారం స్థానిక శ్రీప్రతిభ విద్యా సంస్థలో చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు వైస్ చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈవో నల్లూరి జయప్రకాష్‌నారాయణ ప్రత్యేక అభినందించారు. ఉత్తమ ఫలితాలకు కారకులైన అధ్యాపకులను కూడా వారు ప్రశంసించారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో శ్రీసరస్వతి టాప్



చైర్మన్ రమణారెడ్డిని సత్కరిస్తున్న విద్యార్థులు

ఒంగోలు విద్య, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో ఒంగోలులోని శ్రీసరస్వతి విద్యా సంస్థల విద్యార్థులు విజయఢంకా మోగించారు. రాష్ట్రస్థాయిలో టాప్‌మార్కులతో సత్తా చాటారు. ఎంపీసీ విభాగంలో 470కి 467 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారు. అదేవిధంగా బైపీసీ విభాగంలో 440కి 436 మార్కులు సాధించారు. ఇక ఎంపీసీ విభాగంలో ఎన్.సహస్రశంకర్ 467, బైపీసీలో పి.ఖాదర్‌బి 440కి 436 మార్కులు పొందారు. ఇక సీఈసీలో ఎ.శ్రావ్యకృష్ణ 500లకు 489, ఎంపీసీలో 27 మంది 466 మార్కులు, 72 మంది 465, 144 మంది 464, 272 మంది 460 మార్కులు సాధించారు. బైపీసీలో ఐదుగురు 435, 10 మంది 434, 12 మంది 433, 28 మంది 420కిపైగా మార్కులు సాధించారు. సీఈసీలో ముగ్గురు 480కిపైగా మార్కులు పొందారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శనివారం స్థానిక శ్రీ సరస్వతి విద్యాసంస్థలో చైర్మన్ ఏవీ.రమణారెడ్డి, డైరెక్టర్లు గణేష్‌రెడ్డి, ఎ.గంగాశంకర్‌రెడ్డి, సీఈవో ఎన్‌వీ.సురేష్, ప్రిన్సిపాల్స్, డీన్లు, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

శ్రీహర్షిణి విద్యార్థుల విజయకేతనం



తేజ | లక్ష్మీనారాయణ | ధరణి

ఒంగోలు విద్య, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఒంగోలులోని శ్రీహర్షిణి జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. ఎంపీసీ విభాగంలో పి.లక్ష్మీనారాయణ, బట్టు తేజ, బత్తుల ధరణిలు 470కి 466 మార్కులు సాధించి ప్రథములుగా నిలిచారు. బైపీసీ విభాగంలో జి.ఉజ్వల, హర్షిణిలు 440కి 433 మార్కులు సాధించారు. ఇక ఎంఈసీ విభాగంలో ఎస్.మహేష్ 500లకు 467, సీఈసీలో కేవీ.పావని 500లకు 465 మార్కులు పొందారు. ఎంపీసీలో 26 మంది 465కు పైగా, 54 మంది 460కిపైగా మార్కులు సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను స్థానిక కళాశాలలో విద్యాసంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గోరంట్ల కవిత, డీన్ దాది ఆంజనేయులు, నారాయణ, ప్రిన్సిపాల్ దివి రమేష్, ఎం.ఏడుకొండలు, శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు.

సాయిరాం కాలేజీ విద్యార్థుల విజయభేరి

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీపరీక్షా ఫలితాల్లో ఒంగోలులోని శ్రీసాయిరాం జూనియర్ కాలేజీ విద్యార్థినులు విజయకేతనం ఎగురవేశారు. ఎ.భానుశ్రీ 465, ఎ.నవ్యశ్రీ 465, టి.రిషిచంద్రిక 465 మార్కులు సాధించారు. అలాగే బీఎన్.సంధ్యారాణి 440కి 435, ఎస్‌కే.ఫజియా 434మార్కులు పొందారు. 460కిపైగా 28 మంది, 450కిపైగా 46 మంది, 400లకు పైగా 105 మంది మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను శనివారం స్థానిక కళాశాలలో చైర్మన్ కరి అంజయ్య, కరస్పాండెంట్ కొప్పర్తి మోహనరావు, ప్రిన్సిపాల్ రాఘవ ప్రత్యేకంగా అభినందించారు.

నాయీ బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించాలి



ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నియోజకవర్గ పరిధిలో ఉన్న నాయీ బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని నగర క్షౌరశాలల సంఘం నాయకులు కోరారు. శనివారం ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పోను మిగతా యూనిట్లకు మాత్రమే బిల్లులు అమలయ్యేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి సమస్యను పరిష్కరించాలని కోరారు. నియోజకవర్గంలో ఐదువేల మంది నాయీ బ్రాహ్మణులు ఉంటే బీసీ కార్పొరేషన్‌లో కేవలం 10 యూనిట్లు మాత్రమే కేటాయించారని చెప్పారు. ఎక్కువ మందికి యూనిట్లు కేటాయించాలని కోరారు. అర్హులైన నాయీబ్రాహ్మణులకు ఇంటి స్థలాలు కేటాయించాలని, ఎన్నికల సమయంలో నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం హామీ ఇచ్చారని, వాటిని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయీ బ్రా హ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ నిడమానూరు రమేష్, కొణిజేటి నాగభూషణం, గుంటూరు రాంబాబు, కాపారపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో భర్త ఆత్మహత్య

పెద్దదోర్నాల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మనస్థాపం చెందిన భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా శనివారం వెలుగుచూసింది. మండలంలోని యడవల్లి గ్రామానికి చెందిన సింగా సుధాకర్ (35) తరచూ మద్యం సేవిస్తుండడంతో ఐదు రోజుల క్రితం భార్యాభర్తల మధ్య ఘర్షణ జరిగింది. భార్య గట్టిగా మందలించింది. దీంతో ఆ మరుసటి రోజు నుంచి సుధాకర్ కనిపించడం లేదు. శనివారం బలిజేపల్లి గ్రామానికి వెళ్లే రస్తాలో కొండ వద్దకు మేకల కాపరులు దుర్వాసన వస్తుండడంతో దగ్గరికి వెళ్లి చూడగా సుధాకర్‌గా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుధాకర్‌కు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

త్రిపురాంతకం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : సాగర్ కాలువలో పడిన యువకుడి మృతదేహం శనివారం లభ్యమైంది. విశ్వనాథపురం గ్రామానికి చెందిన గుమ్మా శివ (20) ఈత కోసం సాగర్ కాలువలోకి దిగి నీటి ప్రవాహంలో గల్లంతయ్యాడు. ఈక్రమంలో శివ మృతదేహం లభ్యం కావడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివబసవరాజు తెలిపారు.

నగర అభివృద్ధికి

వ్యాపారులు సహకరించాలి

● ఎమ్మెల్యే దామచర్ల



ట్రంక్‌రోడ్ వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర అభివృద్ధికి అందరూ కలిసి రావాలని, మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివృద్ధి వైపు దృష్టి సారిస్తున్నట్లు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. నగరంలోని ట్రంక్ రోడ్ విస్తరణ పనులు ప్రారంభమైన నేపథ్యంలో కొందరు వ్యాపారులు శనివారం ఎమ్మెల్యే దామచర్లను ఆయన నివాసంలో కలిసి తమ సమస్యలను వివరించారు. రోడ్డును వంద అడుగులు విస్తరించడం ద్వారా కొంతమంది షాపులు పూర్తిగా కోల్పోవాల్సి వస్తుందని, ట్రంక్‌రోడ్ విస్తరణపై పునః పరిశీలన చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేషన్ హోదాకు అనుగుణంగా నగర రహదారులు విస్తరించడం జరుగుతుందని, కేవలం ఒక ట్రంక్‌రోడ్ మాత్రమే కాదని, కొత్తపట్నం బస్టాండ్, బీవీఎస్ హాలు రోడ్, దశరాజుపల్లి రోడ్, సీవీఎన్ రోడ్, కర్నూలు రోడ్‌లు అన్నీ విస్తరణ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే పలు రోడ్ల విస్తరణ పనులు జరుగుతున్న విషయం అందరికీ తెలిసిన విషయమే అన్నారు. అయితే ట్రంక్‌రోడ్ విషయంలో ఎప్పటికప్పుడు వాయిదాలు వేసుకుంటూ వెళ్ళడం వల్ల అభివృద్ధి సాధ్యపడే పరిస్థితి లేదన్నారు. వ్యాపారులు కూడా నగర అభివృద్ధిని, ప్రజా శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని సహకరించాలన్నారు. రోడ్ విస్తరణ ద్వారా నష్టపోయే వ్యాపారులకు పరిహారంగా టీడీఆర్ బాండ్‌లు ఇస్తామని, ఎవరూ కూడా ఆందోళన చెందవద్దని కోరారు. నేడు రోడ్ విస్తరణ వద్దని చెప్పినవారే రేపు చాలా బాగుంది అనేలా పనులు చేపడుతున్నట్లు వివరించారు. వ్యాపారులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని, అపోహలు వీడి అధికారులకు సహకరించాలని కోరారు. మన ఒంగోలును మనమే అభివృద్ధి చేసుకోవాలని, అందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని దామచర్ల వ్యాపారులకు సూచించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, మాజీ మునిసిపల్ చైర్మన్ యక్కల తులసీరావు, టౌన్ ప్లానింగ్ అధికారులు, కార్పొరేటర్లు, ట్రంక్ రోడ్ వ్యాపారులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్రం కృషి

● బీజేపీ రాష్ట్ర నాయకురాలు యామిని



మొక్కలను నాటుతున్న యామిని, నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ సుపరిపాలనలో అన్ని వర్గాల సంక్షేమం అనేక పథకాలను అమలు చేశారని బీజేపీ రాష్ట్ర నాయకురాలు సాదినేని యామిని పేర్కొన్నారు. మోదీ 11 ఏళ్ళ పాలన, పర్యావరణ పరిరక్షణ, సేవా,పేదల సంక్షేమ కార్యక్రమాలపై ఒంగోలులోని ఇందిరా ప్రియదర్శిని లా కాలేజీలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాలేజీ అవరణలో మొక్కలు నాటారు. అనంతరం జరిగిన సదస్సులో యామినిశర్మ మాట్లాడుతూ వికసిత్ భారత్ లక్ష్యంగా అనేక కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. అంత్యోదయ స్ఫూర్తితో సబ్కాసాత్, సబ్కా వికాస్, సబ్కావిశ్వాస్ నినాదంతో ముందుకు వెళ్ళాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జి రవిశంకర్ నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 21న అంతర్జాతీయయోగా దినోత్సవం, 23న పార్టీ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదానం, ఈనెల 25న 1975 ఎమర్జెన్సీ ప్రకటించి 50 సంవత్సరాలను పూర్తయిన సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు శివారెడ్డి, నాయకులు డాక్టర్ కొమ్మి నరసింగరావు, శివాజీ యాదవ్, నరాల శ్రీనివాసరెడ్డి, మాకినేని అమరసింహ, కూకట్ల నాగేశ్వరరావు, దండు శ్రీనివాసరావు, కావూరి వాసు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు 90శాతం సబ్సిడీతో విత్తనాలు ఇవ్వాలి

రేపు మండల కార్యాలయాల ఎదుట ధర్నాలు ● ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య



మాట్లాడుతున్న ఈశ్వరయ్య

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు, కౌలు రైతులకు 90శాతం సబ్సిడీతో నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వం అందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లాలోని మండల కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య తెలిపారు. ఒంగోలులోని సీపీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20వేల నగదును వెంటనే రైతు ఖాతాల్లో జమ చేయాలన్నారు. కౌలు రైతులకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలపై మండల కార్యాలయాల వద్ద జరిగే ధర్నాల్లో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.హనుమారెడ్డి, కె.వీరారెడ్డి, నాయకులు చెరుకూరి వాసు, గద్దల రవి పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్ : మంత్రి స్వామి



సింగరాయకొండలో ముస్లింలతో చైర్మన్ దామచర్ల సత్య



ఒంగోలులో టోపీలు, సామగ్రి కొనుగోలు చేస్తున్న ముస్లింలు

● ఈద్గాల్లో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు

సింగరాయకొండ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : బక్రీద్ త్యాగానికి ప్రతీక అని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. పేదల పట్ల జాలి, దయ కలిగి ఉండటమే ఈ పండుగ ఇచ్చే సందేశమన్నారు. శనివారం స్థానిక ఈద్గాలో నిర్వహించిన బక్రీద్ ప్రార్థనల్లో ముస్లింలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇతరుల పట్ల సోదరభావం చూపాలన్నారు. అనంతరం టీడీపీ సీనియర్ నాయకుడు షేక్ సంధానీబాషా నివాసంలో ఏర్పాటు చేసిన విందుకు హాజరయ్యారు. మధ్యాహ్నం మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య కూడా బక్రీద్ వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

ఒంగోలు కల్చరల్: ఒంగోలు నగరంలోని ముస్లింలు బక్రీద్‌ను శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక కొణిజేడు బస్టాండ్ దగ్గర ఉన్న ఈద్గాలో ఉదయం వేలాదిగా ముస్లింలు తరలి వచ్చి ప్రార్థనలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ కరుణ, దయ, దాతృత్వం వంటివి అవలంభించటం ద్వారా అల్లాహ్ దయ కలుగుతుందన్నారు. సమాజంలో మనకంటే తక్కువ వారికి ఇచ్చే దానం ఎంతో గొప్పదని చెప్పారు. ఇక స్థానిక ఇస్లాంపేట, పెద్ద మసీదు, కోర్టుసెంటర్, మంగమూరు రోడ్డు బైపాస్ మొదలైన అనేక చోట్ల ఉన్న మసీదులలో సైతం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

మద్దిపాడు:త్యాగానికి ప్రతీకగా భావించే బక్రీద్ వేడుకలను మద్దిపాడులో ముస్లింలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఈద్గా వద్ద ప్రార్థనలు నిర్వహించారు. అదేవిధంగా వెల్లంపల్లి, రాచవారిపాలెం, ఇనమనమెళ్లూరు గ్రామాలలో సైతం బక్రీద్ వేడుకలు ఘనంగా జరిగాయి.

నాగులుప్పలపాడు: బక్రీద్‌ను మండల పరిధిలోని ముస్లింలు భక్తి శ్రద్ధతో శనివారం జరుపుకొన్నారు. అమ్మనబ్రోలు, బి.నిడమానూరు, ఉప్పుగుండూరు, నాగులుప్పలపాడు, మద్దిరాలపాడు తదితర గ్రామాలలోని మసీదులు, ఈద్గాలను వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

సంతనూతలపాడు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం బక్రీద్‌ను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. సంతనూతలపాడులోని మైనంపాడు డొంకవద్ద నున్న ఈద్గా వద్ద ముస్లింలు మత పెద్ద హఫీజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వారికి మాజీ సర్పంచ్ అంకారావు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయబ్, మునీరు, సుభానీ, కాలేషా, బషీర్ తదితరులు పాల్గొన్నారు.



సంతనూలపాడులోని ఈద్గా వద్ద..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ముండ్లమూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఎస్సీ కాలనీకి చెందిన తాతపూడి వెంకటేష్(54) ఉదయం బహిర్భూమికి వెళ్ళి ఇంటికి వస్తున్నాడు. ఈక్రమంలో ముండ్లమూరు బస్టాండ్ సమీపంలో ప్రైవేట్ అంబులెన్స్ ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే బంధువులు ఒంగోలుకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ కమలాకర్ పరిశీలించి తీవ్రంగా గాయపడిన వెంకటేష్‌ను ఒంగోలుకు తరలించే ఏర్పాట్లు చేశారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఏఎస్‌ఐ ఎం.వెంకటేశ్వరరెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

మహిళలను కించపరిచిన వారిపై

కఠిన చర్యలు తీసుకోవాలి : లక్ష్మి

దర్శి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): అమరావతి రైతులను కించపర్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఓ చానల్ రాజధాని అమరావతిపై విషం చిమ్ముతూ అసత్య ప్రచారాలు చేస్తుందని విమర్శించారు. అమరావతి ప్రాంత రైతులను, మహిళలను కించపర్చే విధంగా వ్యాఖ్యలు చేసినవారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజకు ఫిర్యాదు చేశారు. రాజధాని నిర్మాణం కోసం 36 వేల ఎకరాల భూములు ఇచ్చిన మహిళా రైతులను కించపర్చటం క్షమించరాని నేరమన్నారు. భవిష్యత్తులో ఎవరూ ఇలాంటి వ్యాఖ్యలు చేయ కుండా కఠినంగా శిక్షించాలని ఆమె కోరారు.

దొనకొండలో మోస్తరు వర్షం

దొనకొండ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. గత కొన్నిరోజులుగా ఎండ తీవ్రతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం కూడా భానుడు ప్రతాపం చూపటంతో వృద్ధులు, చిన్నారులు ఉక్కిరిబిక్కిరిఅయ్యారు. సాయంత్రం కొద్దిసేపు వర్షం కురిసి వాతావరణం చల్లబడటంతో ఉపశమనం పొందారు.

కొత్తపట్నం తహసీల్దార్‌గా శాంతి

కొత్తపట్నం, జూన్7(ఆంధ్రజ్యోతి): కొత్తపట్నం తహసీల్దార్‌గా కె.శాంతి నియమితులయ్యారు. ఆమె దోర్నాల మండలం నుంచి ఇక్కడకు బదిలీపై వస్తున్నారు. ఇప్పటి పని చేసిన మధుసూదనరావు ఇటీవల ఒంగోలు తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఆయనే ఇప్పటి వరకు కొత్తపట్నం ఇన్‌చార్జి బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఇప్పుడు శాంతిని రెగ్యులర్ తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా ఉత్తర్వులు ఇచ్చారు.

ఎమ్మెల్యే దామచర్లకు ఆపుస్మా కృతజ్ఞతలు

ఒంగోలు విద్య, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వ గుర్తింపును 8నుంచి 10 సంవత్సరాలకు పెంచేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు ఆపుస్మా నాయకులు శనివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సమస్యను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారం అయ్యేలా చూసిన ఎమ్మెల్యేకు వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు దామచర్లను సత్కరించారు. కార్యక్రమంలో అపుస్మా జిల్లా అధ్యక్షుడు కొల్లా మాధవరావు, గౌరవాధ్యక్షుడు బొడ్డు హనుమంతరావు, ఒంగోలు యూనిట్ అధ్యక్షుడు మురళీకృష్ణ, గౌరవాధ్యక్షుడు నేతాజీ మల్లికార్జున్, సాయి వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 12వ తేదీ నుంచి ప్రారంభంకానున్న కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బండి వీరస్వామి కోరారు. ఒంగోలులోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యా సంస్థల ఆవరణల్లోనే పుస్తకాలను అధికధరలకు విక్రయిస్తున్నారని తెలిపారు. విద్యాసంస్థ పేరులో చివరలో టెక్నో, ఈటెక్నో, ఒలంపియాడ్ వంటి పేర్లను వాడుకుంటూ అధికఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అధికంగా ఫీజులు వసూళ్ళు చేస్తున్న విద్యాసంస్థలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఫీజు నియంత్రణ చట్టప్రకారం ఫీజుల వివరాలను బహిరంగ నోటీసు బోర్డుల్లో కార్పొరేట్ విద్యా సంస్థలు పెటడం లేదన్నారు. అందువల్ల విద్యాసంస్థల్లో నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వినోద్, విజయ్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత యోగా తరగతులు

నాగులుప్పలపాడు, జూన్7 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఉప్పుగుండూరులోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వివేకానంద యోగా శిక్షణ కేంద్రం, వాసవీ క్లబ్ సంయుక్తంగా ఈ నెల 8 నుంచి 21 వరకు ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు శిక్షకులు కామిశెట్టి శంకరరావు, క్లబ్ అధ్యక్షుడు కొంజేటి జలంధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పర్యాటక ప్రాంతాల్లో యోగాపై అవగాహన

● ఆర్డీవో లక్ష్మీప్రసన్న

కొత్తపట్నం, జూన్7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో యోగాసానాల సాధన ద్వారా ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు ఆర్డీవో లక్ష్మీప్రసన్న తెలిపారు. శనివారం ఆమె కొత్తపట్నం బీచ్‌లో పర్యటించారు. యోగాపై అవగాహన కల్పించేందుకు బీచ్‌లో ఆదివారం యోగాసనాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా బీచ్ వద్ద యోగాసనాల సాధనకు అనువైన ప్రదేశాలను పరిశీలించారు. మూడు ప్రాంతాలను సందర్శించి అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేసి సిద్ధం చేయాలని స్థానిక రెవెన్యూ అధికారులను ఆమె ఆదేశించారు. తీరంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో యోగా సాధన చేయటం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆర్డీవో చెప్పారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్లు, మత్స్యశాఖ ఏడీ శ్రీనివాసరావు, కొత్తపట్నం తహసీల్దార్ మధుసూదనరావు, ఎంపీడీవో శ్రీకృష్ణ, ఈవోఆర్డీ వేణుగోపాలమూర్తి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముగిసిన ఫుట్‌బాల్ శిక్షణ తరగతులు



చిన్నారులకు సర్టిఫికెట్లను బహూకరిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు కార్పొరేషన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని ఏబీఎం జూనియర్ కాలేజీ క్రీడా మైదానంలో జరుగుతున్న ఫుట్‌బాల్ వేసవి శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. నెలరోజులపాటు సుమారు 100మందికిపైగా చిన్నారులకు ఫుట్‌బాల్ ఆటలో శిక్షణ ఇచ్చినట్లు నిర్వాహకులు కె.డేవిడ్‌రాజ్, కోచ్ బెన్ని తెలిపారు. గత పదిహేను సంవత్సరాలుగా ప్రతి ఏడాది వేసవి సెలవుల్లో క్యాంపులు నిర్వహించి ఎందరినో క్రీడాకారులుగా తీర్చిదిద్దడం ఆనందంగా ఉందని తెలిపారు. అనంతరం చిన్నారులకు ప్రోత్సాహక సర్టిఫికెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ గంగయ్య, తల్లిదండ్రులు, కోచ్‌లు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్‌ఐ శివరామయ్య



బ్యాటింగ్ చేస్తున్న ఎస్‌ఐ

మద్దిపాడు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఎస్‌ఐ శివరామయ్య పేర్కొన్నారు. శనివారం మద్దిపాడు సమీపంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాసేపు బ్యాటు చేతపట్టి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. యువత క్రీడాస్ఫూర్తితో మెలగాలని, క్రీడలు స్నేహభావాన్ని పెంచుతాయని చెప్పారు. రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించటం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కొణిజేటి శివకుమార్, మణి, చందు, భావన, క్రికెట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో చీమకుర్తి విద్యార్థుల ప్రతిభ



శేఖరరెడ్డి, లోహిత

చీమకుర్తి, జూన్7(ఆంధ్రజ్యోతి) : ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాల్లో చీమకుర్తికి చెందిన విద్యార్థుల ప్రతిభ చాటారు. ఎంఎస్ఆర్ జూనియర్ కళాశాలకు చెందిన జి.శేఖరరెడ్డి ఎంపీసీలో 470కి 467మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ద్వితీయ, జిల్లాలో ప్రథమ స్థానాన్ని పొందినట్లు ప్రిన్సిపాల్ శివారెడ్డి తెలిపారు. అదేవిధంగా జాష్టి లోహిత 466, చందన, గోవర్ధిని, ప్రేమిక 464మార్కులు సాధించారు. వారిని శనివారం ప్రిన్సిపాల్ వీవీ.శివారెడ్డి డైరెక్టర్లు ఎం.నాగార్జునరెడ్డి, గోపీకృష్ణారెడ్డి, వెంకారెడ్డి, అధ్యాపకులు అభినందించారు. అలాగే పట్టణంలోని చైతన్యభారతి విద్యార్థులు అరేఖ్య, నాగఅశ్వితలు 462మార్కులు సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ నాగండ్ల శ్రీనివాసులు, అధ్యాపకులు అభినందించారు.

ఏడున్నర కేజీల గంజాయి పట్టివేత : సీఐ

చీమకుర్తి, జూన్7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో పోలీసులు శనివారం జరిపిన ఆకస్మిక దాడుల్లో ఏడున్నర కేజీ గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు చీమకుర్తి సీఐ సుబ్బారావు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి వలస కార్మికుల రూపంలో వచ్చి అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామన్నారు. ఈక్రమంలో వలస కార్మికుల వివరాలను ఆయా యజమానులు రెండు రోజులలోపు పోలీస్‌స్టేషన్‌లో అందజేయాలని కోరినట్లు చెప్పారు. ముఖ్యంగా గ్రానైట్ క్వారీలు, ఫ్యాక్టరీలు, డెయిరీఫారంలు, గృహాలను అద్దెకు ఇచ్చినవారు, హోటళ్ళు, ఇతర ఏరకమైన కార్యకలాలపాల్లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పనిచేస్తుంటే వారికి సంబంధించిన ఆధార్‌కార్డు, ఫొటో, ఫోన్‌నంబర్ వివరాలను పోలీస్‌స్టేషన్‌లో అందజేయాలన్నారు. అదేవిధంగా కార్మికులు, వారి కార్యకలాపాలపై ఓనర్లు నిఘా వేసి ఉంచాలని సీఐ సుబ్బారావు సూచించారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

కంభం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో శ్రీకృష్ణదేవరాయ బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గుండె, కంటి, క్యాన్సర్, ఆర్థోపెడిక్ మెగా వైద్య శిబిరానికి పెద్ద సంఖ్యలో రోగులు తరలివచ్చారు. నంద్యాల శ్యాంతిరామ్ ఐ హాస్పిటల్, మార్కాపురం మృదుల మోహన్ హాస్పిటల్, హెచ్‌సీజీ ఎంఎస్‌ఆర్ క్యాన్సర్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఉదయగిరి బృందావనం కల్యాణ మండపంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. 100 మందికి పైగా కంటి పరీక్షలు చేయించుకోగా, 50 మందికి ఆపరేషన్లు అవసరమని, కర్నూలు శాంతిరామ్ ఆసుపత్రికి తరలించారు. 30 మందికి ఈసీజీ తీయగా 20 మందికి ఆపరేషన్లు అవసరమని తెలిపారు. ఎముకలకు సంబంధించి 30 మందికి పరీక్షించారు. గైనకాలజిస్టు, క్యాన్సర్ రోగులను పరీక్షించారు. కార్యక్రమాన్ని మాజీ ఎంపీపీ డాక్టర్ రంగనాయకులు, డాక్టర్ మోహన్‌క్రిష్ణ, డాక్టర్ మృదుల నాయుడు, అర్ధవీడు ఎంపీపీ వెంకటరావు ప్రారంభించారు. బలిజ సంఘ అధ్యక్షుడు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి మల్లికార్జునరావు, ఉపాధ్యక్షుడు తాండవ వెంకటేశ్వర్లు, ఆర్‌ఎంపీ రామక్రిష్ణ, నరసింహారావు, బాలరంగయ్య పాల్గొన్నారు.

మెరిసే నక్షత్రాలకు ఉపకారం

- నియోజకవర్గంలో 33 మంది ఎంపిక
- 9న ఒక్కొక్కరికి రూ.20వేల నగదును అందజేయనున్న ప్రభుత్వం
- తల్లిదండ్రుల ఆనందం



వర్ష లోకేష్ విక్రమ్ విష్ణువర్ధన్‌రెడ్డి హిమశ్రీ హాసిని

త్రిపురాంతకం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : పదవతరగతిలో ప్రతిభ కనబరచిన విద్యార్థినీవిద్యార్థులకు షైనింగ్ స్టార్స్ (మెరిసే నక్షత్రాలు) పేరుతో అవార్డులను ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. పదవతరగతిలో కనీసం 500 మార్కులు సాధించిన విద్యార్థుల్లో ప్రతి మండలం నుంచి ఓసీ, బీసీల నుంచి ఇద్దరేసి చొప్పున ఎస్సీ, ఎస్టీల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఈ పథకం కోసం ఎంపిక చేసి జాబితా రూపొందించారు. రాష్ట్రస్థాయి అవార్డులు వచ్చిన వారికి ఇప్పటికే బహుమతులు అందజేయగా జిల్లా స్థాయిలో అర్హులైన వారికి ఈనెల 9న కలెక్టర్, ఇన్‌చార్జి మంత్రి ఆధ్వర్యంలో అవార్డులు అందజేయనున్నారు. వారికి రూ.20వేల నగదుతో పాటు సర్టిఫికెట్, మెడల్‌ను అవార్డుగా అం దజేస్తారు. ఈ అవార్డుల కోసం జిల్లా లో 242 మందిని ఎంపిక చేయగా అందులో ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 33 మంది ఎంపికయ్యారు. ప్రతి మండలంలో 6మంది ఉండగా, ఎర్రగొండపాలెం, త్రిపురాంతకం, దోర్నాల మం డలాల్లో ఇద్దరేసి విద్యార్థులకు సమాన మార్కులు రావడంతో అక్కడ 7 మందిని ఎంపిక చేశారు. ప్రభుత్వ ప్రోత్సాహకంపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని గాయత్రిసింగ్‌కు రూ.5వేల నగదు అందజేస్తున్న ఎంఈవో

ఎంపికైన విద్యార్థుల వివరాలు

ఎర్రగొండపాలెం మండలంలో పోలెబోయిన లోకేష్, రామావత్ హిమశ్రీబాయి, చేకూరి నాగసాయివెంకట హాసిని, కందుల విష్ణువర్ధన్ రెడ్డి, బొందిలి గాయత్రిసింగ్, కొత్తపల్లి విక్రమ్, కొప్పరపు వర్ష ఎంపికయ్యారు. త్రిపురాంతకం మండలంలో బేతం వెంకటేష్, నారు ధనలక్ష్మి, రాచర్ల భావన, పులిమి హర్షవర్ధన్, షేక్ ఫర్హానా, మొగిలి జ్ఞానదీప్తి, పుచ్చకాయల నవీన్, దోర్నాల మండలంలో తాటి శివ ఇందు, గుంటూరు రేవంత్‌కుమార్ రెడ్డి, చింతల త్రివేణి, షేక్ బషీర్, చక్కా సుశాంత్, సన్నెపోగు సంజయ్, పత్తి కాశివైష్ణవి, పెద్దారవీడు తిరుమలరెడ్డి నర్మద, మెట్టుపూజిత, ఉల్లెబోయిన నాగేంద్ర, వేశపోగు జోషిత, షేక్ అశ్రఫున్నీషా, నల్లబోతుల రాజశేఖర్, పుల్లలచెరువు మండలంలో దేవనపల్లి నరేంద్ర, దేవనపల్లి శివమణి, పోట్ల భార్గవచౌదరి, బందెల అమృత, గాజుల ఆదిలక్ష్మి, రామావత్ రామచరణతేజనాయక్ ఎంపికయ్యారు.

రాచర్ల : 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనపరచిన 6 మంది విద్యార్థులకు ప్రతిభా అవార్డులకు ఎంపికైనట్లు ఎంఈవో గిరిధరశర్మ తెలిపారు.



కల్యాణ క్రతువును నిర్వహిస్తున్న పురోహితులు

వైభవంగా లక్ష్మీచెన్నకేశవుని కల్యాణం

రాచర్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యడవల్లి గ్రామంలో లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణ మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. అర్చకుల వేదమంత్రాల నడుమ స్వామి వారి కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలలో భాగంగా కల్యాణ క్రతువును ఆలయ కమిటీ సభ్యులు గ్రామ ప్రజలందరి సహకారంతో జరిపించారు. గత శుక్రవారం నుంచి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన విషయం విదితమే. 7వ తేదీ ఉదయం నిత్య హోమం, బలిహరణం, గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కోలాటం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలోఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యేతో ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలను అందచేశారు. కోలాట కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తిలకించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. బ్రహ్మోత్సవాలలో ఎస్సై పి.కోటేశ్వరరావు బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా వార్షిక వేడుకలు

గిద్దలూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పీఆర్‌కాలనీలో లక్ష్మీనారాయణస్వామి దేవస్థానంలో శనివారం 16వ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి విగ్రహానికి అభిషేకం నిర్వహించారు. నవగ్రహ హోమం, లక్ష్మీగణపతి హోమం, సుదర్శన హోమం, శాంతి హోమాలు నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయ శిఖరానికి కుంభాభిషేకం, ధ్వజస్తంభ పూజ నిర్వహించారు. లక్ష్మీనారాయణ స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమాలలో దేవస్థాన అధ్యక్షుడు, రిటైర్డ్ సీఐ కొండయ్య, కార్యదర్శి రవీంద్రనాథరెడ్డి, కమిటీ ప్రతినిధులు కొండయ్య, చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆక్రమణలను ఉపేక్షించం

నగర పంచాయతీ కమిషనర్



ఇంకుడు గుంతను ఎక్స్‌కవేటర్‌తో పూడ్చివేయిస్తున్న కమిషనర్ రెడ్డి

పొదిలి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : నగర పంచాయతీ పరిధిలో ప్రభుత్వ స్థలాల్లో ఎక్కడైనా ఆక్రమణలు జరిగితే ఉపేక్షించేది లేదని నగర పంచాయతీ కమిషనర్ కేవీఎన్ రెడ్డి హెచ్చరించారు. విశ్వనాధపురంలో కొందరు అనుమతులు లేకుండా ఇంకుడు గుంతలు తీస్తున్నారని తెలుసుకొని కమిషనర్ అక్కడకు వెళ్లి పరిశీలించారు. ప్రభుత్వ స్థలంలో ఇంకుడు గుంతను ఏర్పాటు చేయొద్దని హెచ్చరించారు. ఎక్స్‌కవేటర్‌తో గుంతను పూడ్చివేయించారు. ఎవరి ఇంటి పని నిమిత్తం వెళ్లే ఎక్స్‌కవేటర్ డ్రైవర్లు, తాపీమేస్త్రీ, పైపులైన్ మరమ్మతులు చేసే కార్మికులు నగర పంచాయతీ అనుమతి ఉందాలేదా తెలుసుకొని చేయాలని కమిషనర్ సూచించారు.

పేద ప్రజల సంక్షేమమే టీడీపీ అజెండా

22 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించిన ఎమ్మెల్యే కందుల



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు తీసుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే కందుల

మార్కాపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ అజెండా అని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. జవహర్‌నగర్ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 22 మంది లబ్ధిదారులకు రూ.12 లక్షలకు పైగా మొత్తాన్ని చెక్కుల రూపంలో అందించారు. అనంతరం ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసమే నిత్యం పనిచేస్తోందన్నారు. గత వైసీపీ పాలనలో సీఎం సహాయనిధి అందిన దాఖలాలులేవన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పేద, మధ్యతరగతి ప్రజల కోసం ఎక్కడా కూడా ఆటంకం లేకుండా సీఎం రిలీఫ్ ఫండ్ సాయాన్ని అందజేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా వెనుకబడిన పశ్చిమ ప్రకాశం ప్రజల నుంచి అందే దరఖాస్తులకు ప్రాధాన్యతను ఇస్తున్నారని కందుల అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాలపాటి వెంకటరెడ్డి, కాకర్ల శ్రీనివాసులు, పఠాన్ హుసేన్‌ఖాన్, వేశపోగు జాన్ పాల్గొన్నారు.

ఘనంగా బక్రీద్



నమాజ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే కందుల

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్‌ను మార్కాపురం పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముస్లింలు నూతన వస్త్రాలు ధరించి తగ్బీర్ చదువుతూ పట్టణ శివార్లలోని ఈద్గాల వద్దకు చేరుకున్నారు. కంభం రోడ్డులోని పెద్ద ఈద్గాలో ముఫ్తి మహమ్మద్ మిన్హాజ్ ఖుద్బా చదివారు. అనంతరం ఈద్ నమాజ్ నిర్వహించారు. దయ, జాలి గుణంతో జీవించాలన్నారు. పొరుగు వారికి సహాయ పడాలని, ధనికులు తన సొమ్మును పేదల కోసం ఖర్చు చేయాలన్నారు. అనంతరం ప్రత్యేక దువాలు నిర్వహించారు. నాగులవరం రోడ్డులోని ఈద్గాలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి హాజరై ఈద్ నమాజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అల్లా దయ వల్ల మరో పదేళ్ల కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంటుందన్నారు. ప్రతి ముస్లిం ఒక మొక్కను నాటాలని, ఆ మొక్కను తాను స్వయంగా అందజేస్తానని అన్నారు. ముస్లింల అభివృద్ధికి కట్టుబడి ఉంటామన్నారు. తర్లుపాడు రోడ్డులోని ఈద్గాలో ఈద్ నమాజ్ నిర్వహించారు. ఈద్ నమాజ్ అనంతరం ముస్లింలు ఖబరస్తాన్‌లలో దువాలు నిర్వహించి పేదలకు దానధర్మాలు చేశారు.



గిద్దలూరులో ముస్లిం పెద్దలతో కలిసి ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్ : పట్టణంలోని నంద్యాల రోడ్డు, కొంగళవీడు రోడ్డులోని ఈద్గాల వద్ద జరిగిన సామూహిక ప్రార్థనల్లో ముస్లింలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి కొంగళవీడు రోడ్డులోని ఈద్గా వద్దకు వెళ్లి ముస్లింలతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. నేటి ఆధునిక కాలంలో సాటి మనిషిని ప్రేమించిన వారే నిజమైన దేశ భక్తులని అశోక్‌రెడ్డి అన్నారు. ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే నంద్యాల రోడ్డులోని ఈద్గా వద్ద ప్రార్థనల్లో క్రిష్ణకిశోర్‌రెడ్డి పాల్గొని బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మతపెద్దలతోపాటు పట్టణ టీడీపీ అధ్యక్షుడు సయ్యద్ షానావలి, మున్సిపల్ కౌన్సిలర్ లొక్కు రమేష్, నాయకులు బిల్లా రమేష్, వేములపాటి చండి పాల్గొన్నారు.

కంభం : కంభం, అర్ధవీడు మండలాల్లో శనివారం బక్రీద్‌ను ముస్లింలు ఘ నంగా జరుపుకున్నారు. ఈద్‌గాల వద్ద సామూహిక ప్రార్థనలు చేశారు. మత గురువులు బక్రీద్ ప్రాముఖ్యతను వివరించారు. కుర్బానీలో భాగంగా పేదలకు మాంసం, ఇతర దానధర్మాలు చేశారు.

బేస్తవారపేట : మండలంలో శనివారం బక్రీద్‌ను ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం ఈద్గా వద్దకు చేరుకొని ప్రార్థనలు చేసిన అనంతరం పేదలకు దానాలు ఇచ్చారు.

కొమరోలు : త్యాగానికి ప్రతీక బక్రీద్ అని ఇమ్‌సాహెబ్ సెఫీఉల్లా అన్నారు. బక్రీద్ సందర్భంగా ఈద్గా వద్ద ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ముస్లింలు పాల్గొన్నారు.

రాచర్ల : మండలంలోని అన్ని గ్రామాలలో బక్రీద్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుని ప్రార్థనలు చేశారు.


పొదిలి : బుగ్గచలం నీటి ట్యాంక్ సమీపంలో ఉన్న ఈద్గా వద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనాలు చేసుకొని శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

ఎర్రగొండపాలెం : ప్రతి కుటుంబానికి మంచి జరగాలని మౌలానా హిదయా తుల్లా నమాజ్ చేశారు. బక్రీద్ సందర్భంగా ఈద్గాల వద్ద ప్రార్థనలు చేశారు. అనంతరం దువా ఇచ్చారు.

పెద్ద దోర్నాల : మండలంలోని ముస్లింలు బక్రీద్‌ను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈద్గా వద్దకు వెళ్లి ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పేదలకు దానధర్మాలు నిర్వహించారు.

ఎక్కడి చెత్త అక్కడే

- కార్మికులకు అందని జీతాలు
- పనులకు హాజరుకాని వైనం



ప్రధాన రహదారిలో డివైడర్ల వద్ద పేరుకుపోయిన చెత్త

ఎర్రగొండపాలెం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్మికులకు జీతాలు చెల్లించలేదని ఎర్రగొండపాలెం మేజరు గ్రామపంచాయతీలో కార్మికులు విధులకు గైర్హాజరు అవుతున్నారు. దీంతో ప్రధాన రోడ్లపై ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి తీవ్రమైన కంపు వస్తోంది. శుక్ర, శనివారం రెండు రోజులు పంచాయతీ కార్మికులు చెత్త తొలగించక పోవడంతో వీధులు అపరిశుభ్రంగా కన్పిస్తున్నాయి. ఇదిలావుండగా శనివారం పంచాయతీ కార్మికులతో ఎంపీడీవో శ్రీనివాసరావు చర్చలు జరిపారు. పంచాయతీకి కార్యదర్శిని నియమించిన వారంలోజుల వ్యవధిలో 8 నెలలు జీతాలు చెల్లిస్తామని ఎంపీడీవో, సర్పంచి అరుణాబాయ్ హామీ ఇచ్చారు. అనంతరం సాయంత్రం కొన్ని వీధుల్లో కార్మికులు చెత్తను తొలగించారు.

నాయకులతో సమన్వయంగా ఉండాలి

వెలుగు సిబ్బందితో ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : వెలుగు సిబ్బంది టీడీపీ నాయకులను సమన్వయం చేసుకుని గ్రామాలలో డ్వాక్రా మహిళలకు సేవలందించాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కోరారు. పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలోని టీడీపీ కార్యాలయంలో మార్కాపురం, తర్లుపాడు మండలాల పరిధిలోని వెలుగు సిబ్బంది, వీవోఏలు, పార్టీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామాలలో పనిచేసే వీవోఏల ద్వారా గ్రూపుల వివరాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. డ్వాక్రా మహిళలకు అందించే సేవలలో స్థానిక నేతలను భాగస్వామ్యం చేయాలని కోరారు. బ్యాంకుల ద్వారా, స్త్రీ నిధి, తదితర రుణాలను మంజూరు చేసేటపుడు తనకు వివరాలను తెలియజేయాలన్నారు. వెలుగు ఏపీఎంలు పిచ్చయ్య, రమేష్ బాబు, సీసీలు, వీవోఏలు ప్రభుత్వం ఏర్పాటై ఏడాదైన సందర్భంగా ఎమ్మెల్యేతో కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జవ్వాజి రామాంజులరెడ్డి, కాకర్ల శ్రీనివాసులు, గొలమారి నాసర్‌రెడ్డి, మట్టం వెంకటేశ్వర్లు, చిన్నపరెడ్డి, మార్కాపురం, తర్లుపాడు మండలాల నాయకులు పాల్గొన్నారు.

దర్గా అభివృద్ధికి చేయూత



నగదును అందజేస్తున్న నాయబ్ రసూల్

కొమరోలు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : దర్గా అభివృద్ధికి గ్రామ బ్యాంక్ ఉద్యోగి చేయూతనందించారు. ఈ మేరకు రూ.80వేలను దర్గా కమిటీ సభ్యులకు శనివారం ఆయన అందజేశారు. మండలంలోని పోసుపల్లి గ్రామానికి చెందిన కలగొట్ల పుల్లయ్య కుమారుడు నాయబ్‌రసూల్ స్టేట్ బ్యాంకు కందుకూరు మెయిన్ బ్రాంచిలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. తనవంతు సాయంగా దర్గా అభివృద్ధికి రూ.80వేలను అందజేశారు. కార్యక్రమంలో హాఫీజ్ షేక్ అబ్దుల్ హమీద్, గురవయ్య, పీరయ్య, హుసేన్‌పీర, బాలయ్య, షేక్ రసూల్ పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీలో విద్యార్థుల ప్రతిభ

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో కమలా జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించారు. ప్రిన్సిపాల్ సుధాకర్ శనివారం తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో అశోక్ 465, నిశ్చల, సబిహా, జోత్స్న, ఫయాజ్ 464 మార్కులు సాధించారని తెలిపారు. కుసుమిత 463, స్వప్న 462, జోత్స్న 462, అర్షియాభాను 461, అక్షయసాయి 460 మార్కులు సాధించారని తెలిపారు. బైపీసీలో షాహిన్ 435, ప్రిస్కిల్లా 432, సీఈసీ విభాగంలో అనులేఖ 477, శ్రుతి 462 మార్కులు సాధించారని తెలిపారు. విద్యార్థులను కళాశాల కార్యదర్శి పెనుగొండ పవన్ కుమార్ అభినందించారు.

పొదిలి : సప్లిమెంటరీలో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించిన మహమ్మద్ తహీరాను వివేకానంద జూనియర్ కాలేజీ యాజమాన్యం అభినందించి ఘనంగా సత్కరించారు. బైపీసీలో 440కి గాను 437 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో నిలిచిందని కరస్పాండెంట్ రమణారెడ్డి తెలిపారు. ఎంపీసీలో 470కిగాను 465 మార్కులు సాధించిన నందినిని సన్మానించారు. అనంతరం కేక్‌కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు.



కేక్ కట్‌చేసి, తహీరాను అభినందిస్తున్న కరస్పాండెంట్ రమణారెడ్డి

యూటీఎఫ్ నాయకుల నిరసన

బేస్తవారపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఇచ్చిన హామీకి భిన్నంగా బదీలీల కౌన్సెలింగ్‌లో ఎస్జీటీలకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించడానికి పూనుకోవడంపై యూటీఎఫ్ నాయకులు నిరసన తెలిపారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ మండల యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఎంఈవో కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు ఒంగోలులో జరిగే డీఈవో కార్యాలయ ముట్టడి కార్యక్రమానికి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎస్.లక్ష్మీరెడ్డి, ఉపాధ్యక్షులు పి.వి.రాజశేఖర్, ప్రధాన కార్యాదర్శి డి.ఖాశింవలి, కోశాధికారి జి.శ్రీనివాసరావు, సభ్యులు ఐ.రాజశేఖర్‌రెడ్డి, ఎస్.రమేష్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పెద్దదోర్నాల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల గొడవలో మనస్థాపం చెందిన వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా శనివారం వెలుగు చూసింది. మండలంలోని బలిజేపల్లి గ్రామానికి వెళ్లే రస్తాలో కొండపై ఇది చోటుచేసుకుంది. మండలంలోని యడవల్లి గ్రామానికి చెందిన సింగా సుధాకర్ (35) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సుధాకర్ తరచూ మద్యం సేవిస్తుండడంతో ఐదు రోజుల కిందట భార్యాభర్తల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో భార్య మందలించింది. ఆ మరుసటి రోజు నుంచి సుధాకర్ కనిపించడం లేదు. శనివారం మేకలను మేపుకు తీసుకెళ్లినవారు దుర్వాసన వస్తుండడంతో దగ్గరికి వెళ్లి చూడగా సుధాకర్‌గా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుధాకర్‌కు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



శివ మృత దేహం

త్రిపురాంతకం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదావశాత్తు సాగర్ కాలువలో పడిన యువకుని మృతదేహం శనివారం లభ్యమైంది. మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన గుమ్మా శివ (20) అనే యువకుడు ఈత కోసం సాగర్ కాలువలోకి దిగి ప్రమాదావశాత్తు నీటి ప్రవాహంలో గల్లంతయ్యాడు. శివ మృతదేహం లభ్యం కావడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివబసవరాజు తెలిపారు.

వాహనాల తనిఖీ

రాచర్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడుపవద్దని ఎస్సై పి.కోటేశ్వరరావు అన్నారు. పోలీసుస్టేషన్ సమీపంలో శనివారం ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలను గుర్తించి జరిమానా విధించారు. సరైన పత్రాలు, లైసెన్సులు కలిగి ఉండాలని, యూనిఫామ్ ధరించాలని, హెల్మెట్ లేకుండా వాహనాలను నడపవద్దన్నారు. ఈతనిఖీల్లో ఏఎస్ఐ ఆదిశేషయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రతి వార్డులో పర్యటిస్తా!

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

కనిగిరి(వెలిగండ్ల), జూన్ 7(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై ప్రతి వార్డులో పర్యటిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. శనివారం కనిగిరి పట్టణంలోని 1, 2 వార్డుల్లో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు పర్యటించారు. ఈసందర్భంగా బీసీ కాలనీ వాసులు తమ సమస్యలను ఏకరువుపెట్టారు. నెలకోసారి కూడా మురుగు కాల్వలు శుభ్రం చేయడంలేదని, రాత్రి పూట దోమల ఉధృతికి జాగారం చేస్తున్నామన్నారు. బతిమలాడిన పారిశుధ్య సిబ్బంది ఇటు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

దొనకొండలో మోస్తరు వర్షం

దొనకొండ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. గత కొన్నిరోజులుగా ఎండ తీవ్రతతో ప్రజలు అల్లాడిపోతు న్నారు. శనివారం ఉదయం కూడా భానుడు ప్రతాపం చూపటంతో వృద్ధులు, చిన్నారులు ఉక్కిరిబిక్కిరిఅయ్యారు. సాయంత్రం కొద్దిసేపు వర్షం కురిసి వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఉపశమనం పొందారు.

కుటుంబ కలహాలతో భర్త ఆత్మహత్య

పెద్దదోర్నాల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల గొడవలో మనస్తాపం చెందిన వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసు కున్న ఘటన ఆలస్యంగా శనివారం వెలుగు చూసింది. మండలంలోని బలిజేపల్లి గ్రామానికి వెళ్లే రస్తాలో కొండపై ఇది చోటుచేసుకుంది. మండలంలోని యడవల్లి గ్రామానికి చెందిన సింగా సుధాకర్ (35) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివ రాల మేరకు.. సుధాకర్ తరచూ మద్యం సేవిస్తుండడంతో ఐదు రోజుల కిందట భార్యాభర్తల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో భార్య మందలించింది. ఆ మరుసటి రోజు నుంచి సుధాకర్ కనిపించడం లేదు. శనివారం మేకలను మేపుకు తీసుకెళ్లిన వారు దుర్వాసన వస్తుండడంతో దగ్గరికి వెళ్లి చూడగా సుధాకర్‌గా గుర్తించి పోలీసు లకు ఫిర్యాదు చేశారు. సుధాకర్‌కు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

త్రిపురాంతకం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదావశాత్తు సాగర్ కాలువలో పడిన యువకుని మృతదేహం శనివారం లభ్య మైంది. మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన గుమ్మా శివ (20) అనే యువకుడు ఈత కోసం సాగర్ కాలువ లోకి దిగి ప్రమాదావశాత్తు నీటి ప్రవా హంలో గల్లంతయ్యాడు. శివ మృతదేహం లభ్యం కావడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివబసవరాజు తెలిపారు.

నిబంధనలు పాటించని సంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 12వ తేదీ నుంచి ప్రారంభంకానున్న కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధన లు పాటించకపోతే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బండి వీరస్వామి కోరారు. ఒంగోలులోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో శనివారం ఏర్పా టు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధన లకు విరుద్ధంగా విద్యా సంస్థల ఆవరణల్లోనే పుస్తకాలను అధికధరలకు విక్ర యిస్తున్నారని తెలిపారు. విద్యాసంస్థ పేరులో చివరలో టెక్నో, ఈటెక్నో, ఒలం పియాడ్ వంటి పేర్లను వాడుకుంటూ అధికఫీజులు వసూలు చేస్తున్నారని ఆ రోపించారు. అధికంగా ఫీజులు వసూళ్ళు చేస్తున్న విద్యాసంస్థలపై అధికారు లు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఫీజు నియంత్రణ చట్టప్రకారం ఫీ జుల వివరాలను బహిరంగ నోటీసు బోర్డుల్లో కార్పొరేట్ విద్యా సంస్థలు పెట్టడం లేదన్నారు. అందువల్ల విద్యాసంస్థల్లో నిబంధనలు పాటించేలా చర్యలు తీ సుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వినోద్, విజయ్ పాల్గొన్నారు.

ఏడున్నర కేజీల గంజాయి పట్టివేత

చీమకుర్తి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో పోలీసులు శనివారం జరిపిన ఆకస్మిక దాడుల్లో ఏడున్నర కేజీ గంజాయిని స్వాధీనం చేసుకుని న లుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు చీమకుర్తి సీఐ సుబ్బారావు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి వలస కార్మికుల రూపంలో వచ్చి అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామన్నారు. ఈక్రమంలో వలస కా ర్మికుల వివరాలను ఆయా యజమానులు రెండు రోజులలోపు పోలీస్‌స్టేషన్‌లో అందజేయాలని కోరినట్లు చెప్పారు. ముఖ్యంగా గ్రానైట్ క్వారీలు, ఫ్యాక్టరీలు, డెయిరీఫారంలు, గృహాలను అద్దెకు ఇచ్చినవారు, హోటళ్లు, ఇతర ఏరకమైన కార్యకలాలపాల్లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పనిచేస్తుంటే వారికి సంబం ధించిన ఆధార్‌కార్డు, ఫొటో, ఫోన్‌నంబర్ వివరాలను పోలీస్‌స్టేషన్‌లో అందజే యాలన్నారు. అదేవిధంగా కార్మికులు, వారి కార్యకలాపాలపై ఓనర్లు నిఘా వేసి ఉంచాలని సీఐ సుబ్బారావు సూచించారు.

యూటీఎఫ్ నిరసన

బేస్తవారపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఇచ్చిన హామీకి భిన్నంగా బదిలీల కౌన్సెలిం గ్‌లో ఎస్జీటీలకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించ నుండటంపై యూటీఎఫ్ నాయకులు నిరసన తెలిపారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ మండల యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఎంఈవో కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు ఒంగో లులో జరిగే డీఈవో కార్యాలయ ముట్టడి కార్యక్రమానికి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయా లని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో యూటీ ఎఫ్ మండల అధ్యక్షుడు ఎస్.లక్ష్మీరెడ్డి, ఉపా ధ్యక్షులు పి.వి.రాజశేఖర్, ప్రధాన కార్యాదర్శి డి.ఖాశింవలి, కోశాధికారి జి.శ్రీనివాసరావు, సభ్యులు ఐ.రాజశేఖర్‌రెడ్డి, ఎస్.రమేష్ బాబు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై ప్రతి వార్డులో పర్యటిస్తా!

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి(వెలిగండ్ల), జూన్ 7(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై ప్రతి వార్డులో పర్యటిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. శనివారం కనిగిరి పట్టణంలోని 1, 2 వార్డుల్లో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు పర్యటించారు. ఈసందర్భంగా బీసీ కాలనీ వాసులు తమ సమస్యలను ఏకరువుపెట్టారు. నెలకోసారి కూడా మురుగు కాల్వలు శుభ్రం చేయడంలేదని, రాత్రి పూట దోమల ఉధృతికి జాగారం చేస్తున్నామన్నారు. బ్రతిమలాడిన పారిశుధ్య సిబ్బంది ఇటు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పది రోజులకోసారి కూడా నీటి ట్యాంకర్లు రావడం లేదన్నారు. పలుకుబడి కల్గినవారికి మాత్రమే నీటి ట్యాకర్లు సరఫరా చేస్తున్నారని చెప్పారు. మాలాంటి నిరుపేద కుటుంబాలకు నీళ్ల సరఫరా చేయడం లేదన్నారు. వీధుల వెంబడి చిల్ల చెట్లతో ఇబ్బందులు పడుతున్నామన్నారు.. మట్టి రోడ్ల స్థానంలో సీసీరోడ్లు నిర్మించాలని కోరారు. ఎక్కడచూసిన చెత్త పేరుకుపోయి ఉందన్నారు. ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి



బీసీ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

మాట్లాడుతూ వార్డులో పర్యటించి ఎక్కడికక్కడే సమస్యలు పరిష్కరిస్తానన్నారు. పారిశుధ్య పనులు చేయిస్తానని చెప్పారు. రెండు రోజులకోసారి నీటి ట్యాంకర్లు వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ డానియల్ జోసెఫ్, శానటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్‌ను ఆదేశించారు. లేకుంటే మీపై చర్యలుంటాయని హెచ్చరించారు.

కార్యక్రమంలో తమ్మినేని శ్రీను, ముకుంద, నారాయణమ్మ, తులసి, దొరసాని, వెంకటరెడ్డి, జానీ, రాచర్ల నారాయణ, ఈదర్ల రవి, తదితరులు పాల్గొన్నారు.

ఈద్ ముబారక్

» భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

పామూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ వేడుక లను శనివారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నా రు. పట్టణంలోని సీఎస్‌పురం రోడ్డులోగల ఈద్గా మైదా నంలో ఉదయం 7 గంటలకే సామూహిక నమాజ్ ని ర్వహించేందుకు ఈద్గా మైదానానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా పెద్ద మసీదు ఇమాం కరిముల్లా బక్రీద్ పండుగ విశిష్టత గురించి వివరించారు. ప్రార్థనల అ



పామూరు: ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నంతరం ఒకరుకొకరు ఈద్ ముబారక్ తెలుపుకుంటూ అలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గా మైదానం వద్ద శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్న సీఐ ఎం.బీమానాయక్, ఎస్ఐ టి.కిశోర్‌బాబు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. పామూరు పట్టణంతోపాటు మండలంలోని మోపాడు, లక్ష్మీనరసాపురం, కందులవా రిపల్లి, వగ్గంపల్లి, నుచ్చుపొద, గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే సీఎస్‌పురం మండల కేం ద్రంతోపాటు ఆనికాలపల్లె, నల్లమడుగుల, కోవిలం పాడు, డీజీపేట, అరివేముల, రేగులచిలక, ఉప్పలపా డు తదితర గ్రామాల్లో బక్రీద్ సందర్భంగా ప్రత్యేక నమా జ్‌లు ఆచరించారు.

దొనకొండలో..

దొనకొండ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ ప ర్వదినాన్ని ము స్లింలు భక్తిశ్ర ద్ధలతో జరుపుకు న్నారు. దొనకొండ సమీపంలోని ఈద్గా వద్ద ఉదయం 7 గంట లకు సా మూహిక ప్రార్థనలు చేపట్టారు. అనంతరం ఒకరినొకరు బక్రీ ద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గా వద్దకు చేరిన పేదలకు దాన ధ ర్మాలు చేశారు.



దొనకొండలో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

దర్శిలో..

దర్శి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలో బక్రీద్ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకు న్నారు. ఈ ద్గాకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. టీడీపీ నియో జకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి బక్రీద్ శుభా కాంక్షలు తెలిపారు. త్యాగానికి ప్రతీక బక్రీద్ అని ఆమె పేర్కొన్నారు. పేదల పట్ల జాలి, దయ, ప్రేమ చూపించ టమే ఈ పర్వదిన సందేశమని ఆమె వివ రించారు.

ముండ్లమూరులో..

ముండ్లమూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలం లోని పలు గ్రామాల్లో ముస్లింలు బక్రీద్‌ను ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముండ్లమూరు, అగ్రహారం, శంకరాపురం, మారెళ్ళ, ఈ దర, పులిపాడు, వేముల గ్రామాల్లో ఈద్గాల వద్ద ప్రా ర్థనలు నిర్వహించారు.

తాళ్లూరులో..

తాళ్లూరు, జూన్7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో బక్రీద్ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. రమణాలవాపాలెం, రజానగరం, మ ల్కాపురం, రామభద్రాపురం, తూర్పుగంగవరం, నాగం బొట్లపాలెం, బొద్దికూరపాడు, లక్కవరం గ్రామాల్లో ఒక రికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



తాళ్లూరు: తూర్పుగంగవరంలో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఖరీఫ్ సాగుకు భూములు సిద్ధం

దర్శి జూన్ 7(ఆంధ్రజ్యోతి): దర్శి ప్రాంతంలో ఖరీఫ్ సీజన్‌లో పైర్లు సాగు చేసేందుకు భూములు దుక్కులు దున్ని సిద్ధం చేశారు. ఈఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగా రావటంతో పది రోజుల క్రితమే పదునయ్యే వర్షాలు కురిశాయి. ఆ వర్షాలకు దుక్కులు దున్నారు. ఆతర్వాత రుతుపవనాలు బలహీనపడటంతో వర్షాలు పడలేదు. దీంతో అన్నదాతలు విత్తనాలు కొనుగోలు చేసి వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. సాగర్ ఆయకట్టు భూముల్లో పెసర, మినుము పైర్లు వేసేందుకు రైతులు సన్నద్ధమయ్యారు. మెట్ట ప్రాంతాల్లో కంది, సజ్జ పైర్లు సాగు చేసేందుకు విత్తనాలు కొనుగోలు చేసి సిద్ధం ఉంచారు. ప్రస్తుతం మబ్బులు కమ్మి ఉండటంతో అన్నదాతలు వరుణదేవుడు కరుణించాలని వేడుకుంటున్నారు.



దర్శి ప్రాంతంలో దుక్కులు దున్ని విత్తనం వేసేందుకు సిద్ధంచేసిన భూములు

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు

పామూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): శ్రీమదన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు శనివారం ఉభయదాత మాజీ సర్పంచ్ సోమిశెట్టి వెంకట నారాయణ కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు నారాయణ సత్యబాబు నిత్యహోమం, స్వామివార్లకు విశేష పూజలు, కుంకుమార్చన హారతులు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామి వార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో దేవస్థాన ఈవో నరసింహబాబు, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు రావల్సిందిగా ఉగ్రకు ఆహ్వానం

పామూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : పామూరు పట్టణంలో ఈనెల 5 నుంచి జరుగుతున్న శ్రీ మదన వేణుగోపాలస్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో భాగంగా 10వ తేదీన ఆర్యవైశ్యుల సంఘం ఆధ్వర్యంలో జరిగే వేడుకలకు రావలందిగా ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డికి శనివారం పామూరు ఆర్యవైశ్య కమిటీ ఉభయదాతలు ఆహ్వానపత్రాన్ని అందజేశారు. కనిగిరిలోని ఉగ్ర క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వ కంగా కలిశారు. కార్యక్రమంలో వాసవీమాత దేవస్థాన అధ్యక్షుడు కోటా నరసింహారావు, పందిటి హరీష్, మెంటా నరసింహారావు, కె.హరగోపాల్, హరి, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



కనిగిరిలో ఉగ్రకు బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రాన్ని అందజేస్తున్న ఆర్యవైశ్య ఉభయదాతలు

రేపు అభయాంజనేయస్వామి వార్షికోత్సవం

పీసీపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదయిర్లపాడులో ఈనెల 9 నుంచి రెండురోజులపాటు అభయాంజనేయస్వామి తృతీయ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మాదాసు రమేష్ తెలిపారు. 9న గణపతి పూజ, కలశస్థాపన, హను మాన్ హోమం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10న గణపతి పూజ, పంచామృతాభిషేకం, ఆకుపూజ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, ఏపీ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ చైర్మన్ షేక్ రియాజ్, జనసేన నియోజకవర్గ నా యకుడు వరికూటి నాగరాజు తదితరులు పా ల్గొంటారని తెలిపారు.

ఈ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా హనుమాన్ శోభాయాత్రను నిర్వహిస్తున్నట్లు మాదాసు రమేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ముండ్లమూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఎస్సీ కాలనీకి చెందిన తాతపూడి వెంకటేష్(54) ఉదయం బహిర్భూమికి వెళ్లి ఇంటికి వస్తున్నాడు. ఈక్రమంలో ముండ్లమూరు బస్టాండ్ సమీపంలో ప్రైవేట్ అంబులెన్స్ ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే బంధువులు ఒంగోలుకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

సంఘటనా స్థలాన్ని ఎస్ఐ కమలాకర్ పరిశీలించి తీవ్రంగా గాయపడిన వెంకటేష్‌ను ఒంగోలుకు తరలించే ఏర్పాట్లు చేశారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఏఎస్ఐ ఎం.వెంకటేశ్వరరెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.



వెంకటేష్ మృత దేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్ఐ వెంకటేశ్వరరెడ్డి

ఇంటర్ సప్లిమెంటరీలో ప్రతిభచాటిన అక్షర విద్యార్థులు



ఎన్ఎల్ ప్రణవి, 467 మార్కులు

పామూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ సప్లి మెంటరీ ఫలితాల్లో స్థానిక అక్షర కళాశాల విద్యార్థు లు ప్రతిభచాటారు. శనివారం విడుదలైన ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో ఉత్తమ మార్కులు సాధించిన ట్లు కరస్పాండెంట్ కదిరి బాబురంగారావు తెలిపారు. నల్లబోతుల లక్ష్మీప్రణవి 467 మార్కులు, కదిరి పూజిత, మితికెల నవీణ, పాతల నాగమణి 465 మార్కులు, కె.అంజన్ సాయికుమార్ 464 మార్కు లు సాధించినట్లు తెలిపారు.

మహిళలను కించపర్చిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలి

దర్శి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): అమరావతి రైతులను కించపర్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఓ చానల్ అమరావతిపై విషం చిమ్ముతూ అసత్య ప్రచారాలు చేస్తుందని విమర్శించారు. అమరావతి ప్రాంత రైతులను, మహిళలను కించపర్చే విధంగా వ్యాఖ్యలు చేసినవారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజకు ఫిర్యాదు చేశారు. రాజధాని నిర్మాణం కోసం 36 వేల ఎకరాల భూములు ఇచ్చిన మహిళా రైతులను కించపర్చటం క్ష మించరాని నేరమన్నారు. భవిష్యత్తులో ఎవరూ ఇలాంటి వ్యాఖ్యలు చేయ కుండా కఠినంగా శిక్షించాలని కోరారు.

ఆక్రమణలను ఉపేక్షించం

పొదిలి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలో ప్రభుత్వ స్థలాల్లో ఎక్కడైనా ఆక్రమణలు జరిగితే ఉపేక్షించేది లేదని నగరపంచా యతీ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి హెచ్చరించారు. విశ్వనాధపురంలో కొందరు అనుమతులు లేకుండా ఇం కుడు గుంతలు తీస్తున్నారని తెలు సుకొని కమిషనర్ అక్కడకు వెళ్లి పరిశీలించారు. ప్రభుత్వ స్థలంలో ఇంకుడు గుంతను ఏర్పాటు చేయొద్దని హెచ్చరించారు. ఎక్స్‌కవేటర్‌తో గుంతను పూడ్చివేయించారు. ఎవరి ఇంటి పని నిమిత్తం వెళ్లే ఎక్స్‌కవే టర్ డ్రైవర్లు, తాపీమేస్త్రీ, పైపులైన్ మరమ్మతులు చేసే కార్మికులు నగర పంచాయతీ అనుమతి ఉందాలేదా తెలుసుకొని చేయాలని కమిషనర్ సూచించారు.

ఎక్కడి చెత్త అక్కడే..!



డివైడర్ల వద్ద పేరుకుపోయిన చెత్త

ఎర్రగొండపాలెం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్మికులకు జీతాలు చెల్లించలేదని ఎర్రగొండపాలెం మేజరు గ్రామపంచాయతీలో కార్మి కులు విధులకు గైర్హాజరు అవుతున్నారు. దీంతో ప్రధాన రోడ్లపై ఎక్కడికక్కడ చెత్త పేరుకు పోయి తీవ్రమైన కంపు వస్తోంది. శుక్ర, శని వారం రెండు రోజులు పంచాయతీ కార్మికులు చెత్త తొలగించక పోవడంతో వీధులు అపరి శుభ్రంగా కన్పిస్తున్నాయి. ఇదిలావుండగా శని వారం పంచాయతీ కార్మికులతో ఎంపీడీవో శ్రీనివాసరావు చర్చలు జరిపారు. పంచాయతీకి కార్యదర్శిని నియమించిన వారంలోజుల వ్యవధిలో 8 నెలలు జీతాలు చెల్లిస్తామని ఎంపీడీవో, సర్పంచి అరుణాబాయ్ హామీ ఇచ్చారు. అనంతరం సాయంత్రం కొన్ని వీధుల్లో కార్మికులు చెత్తను తొలగించారు.

రైతులకు సబ్సిడీతో విత్తనాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఈశ్వరయ్య

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు, కౌలు రైతులకు 90శాతం సబ్సి డీతో నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వం అందిం చాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లాలోని మండల కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహి స్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్య క్షుడు గుజ్జుల ఈశ్వరయ్య తెలిపారు. ఒంగోలు లోని సీపీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీ భవ పథకం ద్వారా రూ.20వేల నగదును వెం టనే రైతు ఖాతాల్లో జమ చేయాలన్నారు. కౌలు రైతులకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేయాలని కోరారు.

జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేలా చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలపై మండల కార్యాలయాల వద్ద జరిగే ధర్నాల్లో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.హనుమారెడ్డి, కె.వీరారెడ్డి, నాయ కులు చెరుకూరి వాసు, గద్దల రవి పాల్గొన్నారు.

పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్రం కృషి

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ సుపరిపాలనలో అన్ని వర్గాల సంక్షేమం అనేక పథకాలను అమలు చేశారని బీజేపీ రాష్ట్ర నాయకురాలు సాధినేని యామినిశర్మ పేర్కొన్నారు. మోదీ 11 ఏళ్ళ పాలన, పర్యావరణ పరిరక్షణ, సేవా,పేదల సం క్షేమ కార్యక్రమాలపై ఒంగోలులోని ఇందిరా ప్రి యదర్శిని లా కాలేజీలో శనివారం జరిగిన కార్య క్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాలేజీ ఆవరణలో మొక్కలు నాటారు. అనంత రం జరిగిన సదస్సులో యామినిశర్మ మాట్లాడు తూ వికసిత్ భారత్ లక్ష్యంగా అనేక కార్యక్రమా లను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. అంత్యోదయ స్ఫూర్తితో సబ్కాసాత్, సబ్కా వికా స్, సబ్కావిశ్వాస్ నినాదంతో ముందుకు వెళ్ళాల ని శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జి రవిశంకర్ నరేందంమోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.

జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 21న అంతర్జాతీయయోగా దినోత్సవం, 23న పా ర్టీ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదానం, ఈనెల 25న 1975 ఎమర్జెన్సీ ప్రకటించి 50 సంవ త్సరాలను పూర్తయిన సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు శివారెడ్డి, నాయకులు డాక్టర్ కొమ్మి నరసింగరావు, శివాజీ యాదవ్, సరాల శ్రీనివాసరెడ్డి, మాకినేని అమరసింహ, కూకట్ల నాగేశ్వ రరావు, దండ శ్రీనివాసరావు, కావూరి వాసు త దితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల్లో యోగాపై అవగాహన

కొత్తపట్నం, జూన్7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో యో గాసనాల సాధన ద్వారా ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న తెలిపారు. శనివారం ఆమె కొత్తపట్నం బీచ్‌లో పర్యటించారు. యోగాపై అవగాహన కల్పించేందుకు బీచ్‌లో ఆదివారం యోగాసనాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈసందర్భంగా బీచ్ వద్ద యో గాసనాల సాధనకు అనువైన ప్రదేశాలను పరిశీలించారు. మూడు ప్రాం తాలను సందర్శించి అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేసి సిద్ధం చేయాలని స్థానిక రెవెన్యూ అధికారులను ఆమె ఆదేశించారు. తీరంలో ఆహ్లాదకర మైన వాతావరణంలో యోగా సాధన చేయటం ద్వారా మానసిక ప్రశాం తత లభిస్తుందని ఆర్డీవో చెప్పారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్లు, మత్స్యశాఖ ఏడీ శ్రీనివాసరావు, తహసీల్దార్ మధుసూదన రావు, ఎంపీడీవో శ్రీకృష్ణ, ఈవోఆర్డీ వేణుగోపాలమూర్తి, పాల్గొన్నారు.



ఉష్ణోగ్రత (అంచనా)


8-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	41	28
తెనాలి	40	28
నరసరావుపేట	40	28
బాపట్ల	40	28
రెంటచింతల	41	28
చీరాల	40	28

చిన్నోడైనా.. చేసేసుకుంటాం

నచ్చితే చాలంటోన్న అమ్మాయిలు

- పెళ్లిపై మారుతున్న నవతరం స్వరం
- సంప్రదాయాలను కాదంటోన్న యువతరం
- తమ ఆకాంక్షలకు అనుగుణంగా అబ్బాయిల ఎంపిక
- నగరాలు, సెలబ్రిటీల నుంచి గ్రామాల్లోకి చొచ్చుకెళ్లిన వైనం

పెళ్లి అంటే.. రెండు మనసులు.. మూడు ముళ్లు.. ఏడు అడుగులు. మన సంప్రదాయం ప్రకారం వయస్సు.. కులానికి పెద్దలు అత్యంత ప్రాధాన్యం ఇస్తారు. కానీ నేటి తరం ముఖ్యంగా యువతులు మనసుకు నచ్చితే చాలు.. అబ్బాయి చిన్నవాడైనా పర్లేదంటోంది. ఒకప్పుడు కొందరు సెలబ్రిటీల్లో కనిపించిన ఈ తరహా వివాహాలు ఇప్పుడు జనసామాన్యంలోకి వచ్చేశాయి. నగరాలకే పరిమితమైన ఈ ఆలోచనలు ఇప్పుడు గ్రామాలకు విస్తరించాయి. వరుడు కన్నా వధువు వయసు పెద్దగా ఉంటే అదో పెద్ద చర్చ ఒకప్పుడు కానీ ఇప్పుడు ఇది చాలా సాధారణమైపోయింది. తాజాగా జరిగిన అఖిల్ వివాహం కూడా ఈ కోవలోనిదేనని సమాచారం. కానీ ఈ విషయంపై ప్రజల్లో పెద్దగా చర్చ జరగకపోవడం ఆ తరహా వివాహాల ఆమోదానికి అద్దం పట్టేదిగా ఉంది. మనువు.. మనసుతో ముడిపడిన విషయం దానికి వయసు తారతమ్యం ఎందుకని యువతులు ప్రశ్నిస్తున్నారు.





sunday special

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ప్రేమకు రెండు మనసులు కలిస్తే చాలు. కానీ పెళ్లికి వయసులు కూడా కలవాల్సిందే. పెద్దలు కుదిర్చిన పెళ్లయితే ఇది తప్పనిసరి. అమ్మాయి కన్నా అబ్బాయి కనీసం ఓ రెండు మూడేళ్లయినా పెద్ద వాడై ఉండాలి. ఇదే సంప్రదాయం. అయితే ఈ తరం అమ్మాయి మారుతోంది. తన ఆలోచనలను మార్చుకుంటోంది. తనకేం కావాలో తెలుసుకుంటుంది. సాధించుకుంటోంది. పెళ్లికి మనసు ముఖ్యం కానీ వయసు కాదంటోంది. ఈ మార్పును అబ్బాయిలతో పాటు పెద్దలూ అంగీకరిస్తున్నారు. మేం తక్కువేం టి... అబ్బాయి గొప్పేంటి? కలసి నడవాల్సిన మా మధ్య ఉండాల్సింది అవగాహన కదా.. వయసు అంతరమెందుకు? మనసుకు నచ్చినోడు మాకన్నా పెద్దవాడే కావాలంటే ఎలా? చిన్నోడైతే సమస్యేంటి? ఇవీ.. ఈ తరం అమ్మాయిల ఆలోచనలు. అమ్మాయిల్లో ఆర్థిక స్వాతంత్ర్యం పెరగడంతో వివాహం విషయంలో మిగతా వాటికన్నా తమ ఇష్టానికే పెద్దపీట వేస్తున్నారు. మనది పురుషాధిక్య సమాజం కాబట్టే అబ్బాయి కన్నా అమ్మాయి చిన్నదై ఉండాలనే నిబంధన తెచ్చారనే భావన యువతుల్లో వ్యాపించింది. పెళ్లిపై అమ్మాయి స్వరం మారుతోంది. తమ ఆకాంక్షలకు అను గుణంగా జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకుం టున్నది. వయసులో తనకన్నా చిన్నవాడైనా పర్లేదంటోంది. మనసుకు నచ్చితే పెద్దలను (మిగతా 6వ పేజీలో)

నాడు సంచలనం..

ఆరోప్రాణం.. అప్పుడెప్పుడో తొంభయ్యో దశకంలో వచ్చిన సినిమా అది. అందులో హీరో వినీత్.. హీరోయిన్ సౌందర్య కన్నా రెండేళ్లు చిన్నవాడు. వారి ప్రేమకు అదే అడ్డంకి. దీన్ని అధిగమించి వారు ఎలా ఒక్కటయ్యారన్నదే కథ. అప్పట్లో ఈ సినిమా గురించి ఓ రేంజ్‌లో చర్చలు జరిగాయి. అదే తొంభయ్యో దశకంలోనే సచిన్ టెండూల్కర్.. తనకన్నా ఐదేళ్లు పెద్దమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అప్పట్లో అదో సంచలనం. ఈ విషయం గురించి చర్చించని గడప లేదంటే అతిశయోక్తి కాదు.

నేడు క్రేజీ..

తనకన్నా రెండు మూడేళ్ల వయసు తక్కువగా ఉన్నవాడిని చేసుకోవడం అమ్మాయిల్లో క్రేజీగా మారుతోంది. పల్లె సీమల్లో వివిధ కారణాలతో ఇలాంటి వివాహాలకు అనుమతి ఇస్తుంటే నగరాల్లో అయితే అమ్మాయిలు ఏరికోరి మరీ తమకన్నా చిన్నవాడినే వరించడం కొసమెరుపు. అబ్బాయిలు కూడా ఈ క్రేజీ అమ్మాయిల వెంటే ఆనందంగా నడుస్తున్నారు. సాఫ్ట్‌వేర్ కొలువులు, విదేశాలలో స్థిరపడిన అమ్మాయిలలో ఈ ధోరణి ఎక్కువగా కనబడుతోంది. అన్నీ కుదిరి అమ్మాయి వయసు ఎక్కువగా ఉండడమే ప్రతిబంధకంగా మారితే అబ్బాయి తరపు వాళ్లే ముందుకొచ్చి అదేమంత ఇబ్బంది కాదని వధువు కుటుంబీకులను ఒప్పించడం గమనించాల్సిన అంశం.



బాపట్ల జమేదారుపేటలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం

భక్తిశ్రద్ధలతో బక్రీదు

ప్రత్యేక ప్రార్థనలతో ఈద్గాలు కిటకిట

బాపట్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతీక అయిన బక్రీదు పర్వదినాన్ని జిల్లావ్యాప్తంగా శనివారం ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాల వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనలకు పెద్దసంఖ్యలో ముస్లింలు తరలివచ్చారు. బాపట్ల, రేపల్లె, చీరాల తదితర ప్రాంతాల్లోని ఈద్గాలకు ముస్లింలు తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గాల వద్ద మత గురువులు బక్రీద్ విశిష్టత గురించి వివరించారు. వేడుకల్లో భాగంగా ఖుర్బానీ చేసి దానధర్మాలు చేశారు.

ఎక్కడి వాళ్లు అక్కడే

- 20 ఏళ్లు దాటినా బదిలీలు లేవు
- లేని రోగాలు చూపెడుతున్న ఎస్టీవోలు
- అవుట్ సోర్సింగ్ ఉద్యోగి కోసం నానాపాట్లు
- బదిలీలలో ఖజానా శాఖ నిబంధనలకు నీళ్లు



గుంటూరు సిటీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల సర్వీస్ దాటిన వారిని ఖచ్చితంగా బదిలీ చేయాలని ప్రభుత్వం చెబుతుంది. ఇరవై ఏళ్లు అయినా పర్వాలేదు అంటోంది ఖజానాశాఖ. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల డీటీవోలు ఉద్యోగుల బదిలీ విషయంలో నిబంధనలు పాటించటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం గత నెలలో వెలువరించిన జీవో ప్రకారం ఖజానా శాఖకు చెందిన చాలామంది అధికారులు, సిబ్బందికి స్థానచలనం కలగాలి. కానీ కాసుల వర్షం కురిపించే స్థానాలను వదలకుండా ఉండేందుకు నానాప్రయత్నాలు చేస్తున్నారు. అటువంటి వారికి అధికారులు కూడా వంత పాడుతున్నట్లు తెలుస్తుంది. దీంతో ఒకే స్థానంలో 20 ఏళ్లు.. 15 ఏళ్లపైబడి సర్వీస్ చేసిన వాళ్లు కూడా బిందాస్‌గా ఉండటం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఉమ్మడి గుంటూరు జిల్లా లోని కొందరు ఎస్టీవో(సబ్ ట్రెజరీ ఆఫీసర్)లు బదిలీ నుంచి తప్పించుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక రోగాలు, డయాలసిస్ చేయించుకునే వారిని బదిలీ నుంచి మినహాయించాలని జీవోలో ఉంది. ఈ మినహాయింపు పొందేందుకు కొందరు ఎస్టీవోలు లేని రోగాలు ఉన్నట్లుగా చూపుతున్నట్లు సమాచారం. జీవోలో లేని రోగాలు కూడా చేర్చి బదిలీకి సున్నం కొడుతున్నారు. ఓ ఎస్టీవో కేవలం ఒక కిడ్నీ అని చూపారు. అయితే జీవో ప్రకారం అటువంటి మినహాయింపు లేకపోయినా బదిలీ నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తుంది. బదిలీలను తప్పించుకునేందుకు ఐదుగురు ఉద్యోగులు దొంగ సర్టిఫికెట్లు సమర్పించినట్లు తెలుస్తుంది. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తరఫున ఆయా పదవుల్లో ఉన్నట్లు సర్టిఫికెట్లు సమర్పించారు. వాస్తవానికి ఆ లేఖలు 2022లో ఇచ్చినవని నాయకులు చెబుతున్నారు. అప్పటి లేఖలు ఇప్పుడు చూపించి బదిలీ ప్రక్రియను తప్పించుకునేందుకు పక్కదారి పట్టించారు.

రెండు దశాబ్దాలు పై మాటే..

గుంటూరు, బాపట్ల జిల్లాలో కొందరు సీనియర్ అకౌంట్ టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు ఒకే చోట 20 ఏళ్లపై బడి పని చేస్తున్నారు. బాపట్లలో ఓ ఉద్యోగి 20 ఏళ్లు, తెనాలిలో మరో ఉద్యోగి 18 ఏళ్లు, మంగళగిరి, గుంటూరు కార్యాలయాల్లో ఇద్దరు ఉద్యోగులు 15 ఏళ్ల నుంచి పనిచేస్తున్నారు. బదిలీల నిబంధనల ప్రకారం వారిని బదిలీ చెయ్యాలి. కానీ ఈ పరిస్థితి ఇక్కడ కనిపించడం లేదు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు బదిలీలు ఉండవు. పల్నాడు ప్రాంతానికి చెందిన ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని గుంటూరుకు బదిలీ చేసేందుకు అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేయడం చర్చనీయాంశంగా మారింది.

ధాన్యం సేకరణ.. ముగిసినట్లేనా?

- నాలుగు రోజులుగా నిలిచిన కొనుగోళ్లు
- 5,000 టన్నులు పూర్తి.. మరో 20,000 టన్నుల కోసం ఎదురుచూపు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రబీ సీజన్‌లో మద్దతు ధరకు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ గడచిన నాలుగు రోజుల నుంచి నిలిచి పోయింది. ఈ సీజన్‌లో ధాన్యం సేకరణకు తొలుత ప్రభుత్వం 30,000 టన్నులకు, ఆ తర్వాత మరో 25,000 టన్నుల సేకరణకు అనుమతులు ఇచ్చింది. ప్రభుత్వం మొదట ఇచ్చిన లక్ష్యం 3 మే 20తోనే ముగిసింది. కాగా 25,000 టన్నుల్లో ఇప్పటి వరకు పూర్తయింది 5,000 టన్నులే కాగా మిగిలిన 20,000 టన్నులకు ఆమోదం తెలపాల్సిందిగా అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. కానీ అటువైపు నుంచి ఎటువంటి స్పందన లేదు. దీంతో గడచిన నాలుగు రోజులుగా జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని కొనుగోళ్ల కేంద్రాల్లో కొనుగోళ్లు నిలిచిపోయాయి. దీంతో రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లు ఇంతటితో ముగిసినట్లేనా అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాపట్ల, రేపల్లె మండలాల్లో ఇంకా 40,000 టన్నుల వరకు ధాన్యం రైతుల వద్ద ఉండవచ్చని సమాచారం. అదనపు అనుమతుల విషయంలో ప్రభుత్వం ఎటూ తేల్చకపోవడం, మరో వైపు కేంద్రాలలో కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు గందరగోళంలో ఉన్నారు.

లేట్ ఖరీఫ్ దిగుబడులు అధికం

ఖరీఫ్ మాదిరిగానే రబీలో కూడా ధాన్యం సేకరణ విషయంలో ఇబ్బందులు తప్పవనే అభిప్రాయం ఆరంభంలోనే వ్యక్తమైంది. లేట్ ఖరీఫ్ దిగుబడులే దాదాపు 42,000 టన్నుల ధాన్యం ఉంటుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. మొత్తం రబీ దిగిబడులు దాదాపు 1.10 టన్నులుగా తేల్చింది. కానీ సేకరణకు తొలుత ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు 30,000 టన్నులే కాగా ఇదంతా లేట్ ఖరీఫ్ వాటాగానే వెళుతుందని అప్పట్లోనే అధికారులు భావించి అదనపు అనుమతుల కోసం ప్రభుత్వానికి నివేదించారు. దీంతో రెండో విడతలో 25,000 టన్నుల సేకరణకు అనుమతి ఇచ్చి నట్లు ప్రకటించిన ప్రభుత్వం 5,000 టన్నులకు మాత్రమే ఎనేబుల్ ఇచ్చింది. దీంతో ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 35,000 టన్నులు సేకరించినట్లయింది. కానీ ఇంకా 20,000 టన్నుల విషయంపై అస్పష్టత రాజ్య మేలుతోంది.

నిబంధనల ప్రకారం అయితే మరో వారం రోజులే...

రబీ సీజన్‌లో 75 రోజుల పాటు మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరిచి ఉంచాలి. ఈ ప్రకారం మరో వారం రోజులు కొనుగోలు కేంద్రాలు తెరిచి ఉంచే వీలున్నది. కానీ ప్రభుత్వం అదనంగా ఇస్తానన్న అనుమతుల విషయంలో మూడు రోజులుగా ఎటూ తేల్చకపోవడంతో ఇప్పటికే అనధికారికంగా కేంద్రాలు మూతపడ్డాయి.



ప్రభుత్వానికి నివేదికలు పంపించామని ఎనేబుల్ కాగానే ధాన్యం సేకరణ చేప డతామని అధికారులు చెప్తున్నారు. అదనపు అనుమతుల విషయంలో ప్రభుత్వం త్వరగా తేల్చాలని, తమను త్రిశంకు స్వర్గంలో పెట్టడం భావ్యం కాదని రైతులు వాపోతున్నారు.

కొత్తగొల్లపాలెం రైతులకు కలెక్టర్ ఊరట

చినగంజాం మండలం కొత్తగొల్లపాలెం గ్రామానికి చెందిన రైతులు దాదాపు 2,800 బస్తాల ధాన్యాన్ని జీపీఎస్ నిబంధనలు పాటించకుండా మార్చి 30న మిల్లులకు తరలించిన సంగతి తెలిసిందే. దీంతో వీటికి సబంధించి నగదు జమ విషయంలో జాప్యం జరుగుతూ వస్తోంది. పలుమార్లు కలెక్టర్ వెంకటమురళిని కలిసిన రైతులు సమస్యను విన్నవించుకున్నారు. దీంతో వారి వరకు ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేసేలా అనుమతి ఇవ్వాలని కలెక్టర్ సిఫార్సుతో ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ పరిస్థితుల్లో త్వరలోనే కొత్తగొల్లపాలెం రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందని సివిల్ సప్లయిస్ విభాగం తెలిపింది.

ఇంటర్ అడ్వాన్స్‌లో అరకొరే

ప్రథమ 45, ద్వితీయ సంవత్సరం 63 శాతం ఉత్తీర్ణత

గుంటూరు(విద్య), జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ బోర్డు శనివారం విడుదల చేసిన ఫలితాల్లో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల విద్యార్థులు అరకొర ఫలితాలు సాధించారు. మూడు జిల్లాల సగటును పరిశీలిస్తే ప్రథమ సంవత్సరం విద్యార్థులు 45 శాతం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 63 శాతం ఉత్తీర్ణత సాధించారు. గుంటూరు జిల్లా నుంచి ప్రథమ సంవత్సరం విద్యార్థులు 5117 మంది పరీక్షకు హాజరుకాగా 2425 మంది(48 శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాపట్ల జిల్లా నుంచి 2762 మందికి 1150 మంది(42 శాతం), పల్నాడు జిల్లా నుంచి 4846 మందికి 2049 మంది(42 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో గుంటూరు జిల్లా నుంచి 3202 మంది పరీక్ష హాజరుకాగా 2011 మంది(63 శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాపట్ల జిల్లా నుంచి 2098 మందికి 1319 మంది(63 శాతం), పల్నాడు జిల్లా నుంచి 2798 మందికి 1884 మంది(67 శాతం) ఉత్తీర్ణత సాధించారు.

బర్లీ రైతుల్లో మనోధైర్యం

కొనుగోలును ప్రారంభించిన మార్క్‌ఫెడ్



పొగాకును పరిశీలిస్తున్న మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ

పర్చూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నల్లబర్లీ పొగాకు కొనుగోలుపై సందిగ్ధంలో ఉన్న రైతుల్లో ప్రభుత్వం మనోధైర్యాన్ని నింపింది. రైతుల వద్ద ఉన్న పొగాకును కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా శనివారం పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాన్ని బాపట్ల జిల్లా మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ ప్రారంభించారు. అనంతరం రైతుల నుంచి పొగాకును తొలి కొనుగోలుచేశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ మరో వారం రోజుల్లో అన్ని చోట్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ప్రత్యేక కార్యదర్శి దేవరకొండ తిరుపతి రాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి కృష్ణ, మండల అధ్యక్షుడు షేక్.షంషుద్దీన్, మానం హరిబాబు, ఆకుల శ్రీనివాసరావు, కొల్లా శ్రీనివాసరావు, పోట్రు శోభన్, అడ్డగడ వెంకటేశ్వర్లు, రామకృష్ణ పాల్గొన్నారు.

ఫలించిన ఎమ్మెల్యే ఏలూరి కృషి

పర్చూరు ప్రాంతంలో పొగాకు రైతులు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయించే విధంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేసిన కృషి ఫలించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్ రంగంలోకి దిగింది.

ఆక్వా పార్కుకు.. రూ.85 కోట్లు

- దిండిలో వందెకరాల భూసేకరణ పూర్తి
- త్వరలో శంకుస్థాపన చేస్తాం : మంత్రి అనగాని సత్యప్రసాద్



నిజాంపట్నం మండలం దిండిగ్రామం లోని సముద్ర తీరప్రాంతం

రేపల్లె, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఆక్వారంగాన్ని అభివృద్ధి చేసి, తీర ప్రాంతంలోని మత్స్యకారులు, ప్రజలు ఆర్థికంగా బలపడే దిశగా ప్రభుత్వ కృషి చేస్తుంది. ఈ క్రమంలో నిజాంపట్నం మండలం దిండి గ్రామంలో రూ.85 కోట్లుతో ఇంటిగ్రేటెడ్ ఆక్వాపార్కు ఏర్పాటుకు మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. దిండి పంచాయతీ పరిధిలోని 100 ఎకరాలను సేకరించి ఆక్వాపార్కు ఏర్పాటుకు సిద్ధం చేశారు. ఆక్వాపార్కు ఏర్పాటు చేస్తే వివిధ రకాల చేపలు, రొయ్యలు, పీతలు, మత్స్యసంపద అభివృద్ధితో పాటు అమ్మకాలు, ఎగుమతులతో వేలాదిమందికి జీవనోపాధి లభిస్తోంది. ఈ పార్కు నిర్మాణంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దిండికి ప్రత్యేక గుర్తింపు రానున్నది.



నిజాంపట్నం హార్బర్‌లో లైట్‌హౌస్

వేలాది మందికి జీవనోపాధి

తీరప్రాంత అభివృద్ధితో పాటు ఈ ప్రాంత ప్రజల జీవనోపాధికి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నాం. పరిశ్రమల అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది. దిండి పంచాయతీలో ఆక్వా పార్కు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాం. పార్కు ఏర్పాటుకు అవసరమైన భూములను సిద్ధం చేశాం. ఈ పార్కు నిర్మాణంతో తీరప్రాంతంలోని వేలాదిమందికి జీవనోపాధి లభిస్తోంది. త్వరలో ఆ క్వాపార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తాం.



\- మంత్రి అనగాని సత్యప్రసాద్

చిన్నోడైనా చేసేసుకుంటాం

(5వ పేజీ తరువాయి)

ఒప్పించి పెళ్లి చేసుకుంటోంది.

వయసు పట్టింపు లేదు..

పెళ్లిళ్ల పేరయ్యలు మొదలు, మ్యాట్రిమోని సైట్ల వరకు గతంలో అబ్బాయి వయసు ఎక్కువగా ఉండాలనేది దాదాపు ఓ అధికారిక నిబంధనగా ఉండేది. అమ్మాయి వయసు అబ్బాయి కన్నా తక్కువగా ఉండడం తప్పనిసరి. అలాంటి సంబంధాలే తల్లిదండ్రుల వద్దకు వెళ్లేవి. కానీ గడచిన దశాబ్ద కాలంగా ఈ తీరులో కొంత మార్పు రాగా ఇటీవల కొన్ని మ్యాట్రిమోని సైట్లలో వయసు విషయంలో నాలుగు నుంచి ఐదేళ్ల వరకు తమకు ఇబ్బందేమి లేదని అమ్మాయిలు, అబ్బాయిలూ ఇద్దరూ ఆప్షన్ ఇస్తున్నారు. ఉమ్మడి గుంటూరుతో పాటు బాపట్ల జిల్లాలో కూడా చాలా వరకు గ్రామీణ నేపథ్యమే ఎక్కువ. దశాబ్దం క్రితం వరకు వయసులో అబ్బాయి కన్నా అమ్మాయి వయసు ఎక్కువగా ఉండే పెళ్లిళ్లకు పెద్దలు అంగీకరించేవారు కాదు. గుట్టుచప్పుడు కాకుండా జరిగే ప్రేమ వివాహాల్లోనే వయసు ఎక్కువ విషయాన్ని గోప్యంగా ఉంచేవారు. అయితే ప్రస్తుతం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో జరిగిన వివాహాల్లో అమ్మాయి వయసు అబ్బాయి కన్నా కనీసం రెండేళ్లు ఎక్కువగా ఉండడం గమనార్హం. రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నమోదయ్యే వివాహాలను పరిశీలించినా నెలకు ఐదు నుంచి పది వరకు అమ్మాయి వయసు అబ్బాయి కన్నా ఒకటి నుంచి మూడేళ్ల వరకు ఎక్కువగా ఉంటుందని అధికారిక గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. ఇవి కూడా ఎక్కువగా గ్రామాల్లో పుట్టి పెరిగిన వారే కావడం గమనార్హం. వరుడు కన్నా వధువు వయసు ఎక్కువగా ఉండే వివాహాలు ప్రేమల్లోనే కాకుండా పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లలో కూడా చాలా సహజమై పోయాయి.

శాస్త్రీయ ఆలోచనలే సంప్రదాయంగా..

సహజంగా ఆలోచనల్లో పరిపక్వత విషయంలో అబ్బాయి కన్నా అమ్మాయి దాదాపు ఐదేళ్లు ముందుగానే ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు. దీంతో వివాహం అనంతరం సమస్యలు తలెత్తకుండా ముందుచూపుతో వయసు అంతరం పెట్టి శాస్త్రీయ నిరూపణనే సంప్రదాయంగా స్థిరపరచారని అభ్యుదయవాదులు చెబుతుండగా, వరుడు వధువు కంటే పెద్దవాడై ఉండాలని లేకపోతే పురుషుడికి ఆయుక్షీణమని ధర్మశాస్త్రాలలో ఎప్పుడో చెప్పారని పండితులు వాదిస్తున్నారు.

24 మంది తహసీల్దార్ల బదిలీ

● ఇద్దరు నెల్లూరు, మరోకరు బాపట్ల జిల్లాకు కేటాయింపు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 24 మంది తహసీల్దార్లను బదిలీలు చేస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సెలవులో ఉన్న ఇరువురు తహసీల్దార్లను నెల్లూరు జిల్లాకు కేటాయించారు. మరొక తహసీల్దార్‌ను బాపట్లకు బదిలీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్లుగా పనిచేస్తున్న కొంతమందికి అడహాక్ పదోన్నతిపై తహసీల్దార్లుగా నియమించారు. వివిధ మండలాల్లో పనిచేస్తున్న తహసీల్దార్లను బదిలీలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
టి.రవి	సింగరాయకొండ	కలెక్టరేట్(అడ్మిన్)
కే నాగలక్ష్మి	తాళ్లూరు	కలెక్టరేట్‌సూపరింటెండెంట్
సీహెచ్‌శ్రీనివాసరావు	కలెక్టరేట్ ఏవో	కలెక్టరేట్‌సూపరింటెండెంట్
డి. శ్రీవణ్‌కుమార్		కలెక్టరేట్ సూపరింటెండెంట్ ఆర్డీవో ఆఫీసు కేఆర్‌సీసీ
ఎ. దిలీప్‌కుమార్	హనుమంతునిపాడు	మార్కాపురం కేఆర్‌సీసీ
డి.మంజునాధరెడ్డి	సీఎస్‌పురం	యర్రగొండపాలెం
సీహెచ్ అశోక్‌రెడ్డి	రాచర్ల	దోర్నాల
కే సంజీవరావు	కలెక్టరేట్	తాళ్లూరు సూపరింటెండెంట్
నారాయణరెడ్డి	కలెక్టరేట్ సూపరిటెండెంట్	సంతనూతలపాడు
వి.ఆదిలక్ష్మి	సంతనూతలపాడు	మద్దిపాడు
పి.మధుసూదనరావు	కొత్తపట్నం	ఒంగోలు అర్బన్
కే శ్రీకాంత్	దోర్నాల	కొత్తపట్నం
ఎస్. శ్రీనివాసరావు	వలేటివారిపాలెం	కొండపి
పీ మురళీ	కొండపి	జరుగుమల్లి
బి. జనార్దన్	జరుగుమల్లి	మర్రిపూడి
నాగార్జునరెడ్డి	మార్కాపురం కేఆర్‌సీసీ	అర్ధవీడు
ఎస్‌కేఎండీ హుస్సేన్	నెల్లూరు కలెక్టరేట్	సీఎస్‌పురం
ఎస్‌కే నాగూర్‌మీరా	సెలవు	హనుమంతునిపాడు
ఎస్.వాసు	ఒంగోలు అర్బన్	వెలిగండ్ల
ఎస్‌కే రఫీఅహ్మద్	పెద్దారవీడు(డీటీ)	రాచర్ల
ఆర్ వాసుదేవరావు	ఎన్‌జిపాడు(డీటీ)	పామూరు
ఎవీఎస్ శ్రీనివాసరావు	మార్కాపురం(డీటీ)	బాపట్ల
నయూబ్‌అహ్మద్	సెలవు	నెల్లూరు కలెక్టరేట్
బి. జనార్దన్	సెలవు	నెల్లూరు కలెక్టరేట్

భారీగా స్కూలు అసిస్టెంట్ల బదిలీ

ఒంగోలు విద్య, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో భారీగా స్కూలు అసిస్టెంట్లకు స్థానచలనం కలిగింది. జిల్లాలో మొత్తం 2,205 మంది బదిలీ య్యారు. జిల్లాలో మూడో వంతు యూపీ స్కూళ్లను ప్రాథమిక పాఠశాలలుగా డౌన్‌గ్రేడ్ చేయడం, హైస్కూళ్లలోని 3, 4, 5 తరగతులను వెనక్కు పంపడంతో వందలసంఖ్యలో స్కూలు అసిస్టెంట్లు మిగులుగా తేలారు. దీంతో వారు తప్పనిసరిగా బదిలీ కాక తప్పలేదు. ఒకే పాఠశాలలో ఎనిమిదేళ్ల పూర్తయిన వారు, పునర్విభజనలో మిగులుగా తేలిన వారు సుమారు 1,600మంది కూడా తప్పనిసరిగా బదిలీ కావాల్సి వచ్చింది. మిగులుగా తేలిన వారిలో 404 మంది స్కూలు అసిస్టెంట్లను ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా సర్దుబాటు చేశారు. ఈ నేపథ్యంలో స్కూలు అసిస్టెంట్లు మొత్తం 2,929 మంది బదిలీకి దరఖాస్తు చేశారు. వీటిలో 14 దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. బదిలీ అయిన వారిలో స్కూలు అసిస్టెంట్ తెలుగు 181మంది, హిందీ 233 మంది, ఇంగ్లీషు 223 మంది. సంస్కృతం నలుగురు, ఉర్దూ ఆరుగురు, గణితం 282 మంది, ఫిజికల్ సైన్స్ 365 మంది, బయాలాజికల్ సైన్స్ 200 మంది, సోషల్ 164 మంది, స్పెషల్ ఎడ్యుకేషన్ 9 మంది, పీఎస్ హెచ్‌ఎంలుగా 404 మంది మొత్తం 2,205 మంది స్థానాలు మారారు. బదిలీ ఉత్తర్వులు అందుకున్న స్కూలు అసిస్టెంట్లందరూ ఆదివారం సాయంత్రం ప్రస్తుతం వారు పనిచేస్తున్న స్థానాల నుంచి రిలీవ్ అయ్యి సోమవారం బదిలీ అయిన కొత్త స్థానాల్లో చేరాలని డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు.

వీరయ్యచౌదరి కేసులో మరో మలుపు

● గతంలోనే హత్యాయత్నం చేసిన గ్యాంగ్
● కార్యాలయంలో జనం ఉండటంతో వెనక్కి
● హైదరాబాద్ గ్యాంగ్ కోసం వేట
● ప్రశ్నార్థకంగా మారిన సురేష్ వ్యవహారం

ఒంగోలుక్రైం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వీరయ్యచౌదరి హత్య కేసు మరో మలుపు తిరిగింది. కిరాయి హంతకుడు నెల్లూరు జిల్లాకు చెందిన నాగరాజును విచారించిన పోలీసులకు ఆశ్చర్యం కలిగించే విషయాలు తెలిశాయి. వీరయ్య చౌదరిని హత్య చేయడానికి ఆరు నెలల ముందే పథకం రూపొందించిన విషయం విదితమే. ఈ మేరకు ఆయనను హత్య చేసేందుకు హైదరాబాద్ గ్యాంగ్‌ను పిలిపించారనేది కూడా పోలీసుల విచారణలో వెల్లడైంది. మీడియా సమావేశంలోనూ ఆ వివరాలను ఎస్పీ తెలిపారు. అయితే నాగరాజును విచారించిన తర్వాత మరిన్ని నిజాలు వెలుగుచూశాయి. వీరయ్యచౌదరిని హత్య చేసేందుకు హైదరాబాద్ నుంచి ముగ్గురు కిరాయి హంతకులు వచ్చి ఒంగోలులో మకాం వేశారు. ఏప్రిల్‌లో ఆ ముగ్గురితోపాటు ప్రస్తుతం హత్యకేసులో నిందితులుగా ఉన్న గౌతం, నాగరాజులు కలిసి కత్తులు తీసుకొని వీరయ్యచౌదరి కార్యాలయానికి వెళ్లారు. అయితే అక్కడ ఎక్కువమంది ఉండటంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకుని వెనుతిరిగారు. ఆ తర్వాత హైదరాబాద్ గ్యాంగ్ భయపడి వెళ్లిపోయింది. దీంతో నెల్లూరు జిల్లాకు చెందిన మరో ఇరువురిని కలుపుకొని హత్య చేశారు. అయితే హైదరాబాద్ గ్యాంగ్‌తో ముప్పా సురేష్‌కు లింక్ ఉందా? అనే కోణంలో విచారణ చేపట్టారు. హైదరాబాద్ గ్యాంగ్‌ను ఎవరు మాట్లాడారు అనే కోణంలో విచారిస్తున్నారు. కాగా వీరయ్యచౌదరి హత్య కేసులో సూత్రధారిగా ఉన్న ముప్పా సురేష్ 40 రోజులుగా పోలీసులకు దొరకలేదు. హైదరాబాద్‌కు బృందాలు వెళ్లి తిరిగి వచ్చాయి. సురేష్ కంపెనీలో డైరెక్టర్‌గా ఉన్న గౌతమ్‌రెడ్డి రెండు దఫాలుగా రూ.లక్ష ప్రధాన పాత్రదారి వినోద్‌కు పంపినట్లు గుర్తించారు. దీంతో గౌతమ్‌రెడ్డిని పిలిపించి పోలీసులు విచారణ చేశారు.

బాలాజీనగర్‌కు చెందిన వీరాంజనేయులు తన మనువడిని ఫస్ట్ క్లాస్‌లో చదివించేందుకు ఓ కార్పొరేట్ స్కూలు అడ్మిషన్‌కు వెళ్లగా ఫీజు, బెల్ట్, టై, పుస్తకాలు మొత్తం రూ.35వేలు చెప్పడంతో అవాక్కయ్యారు. యూనిఫాం మాత్రం బయట తీసుకోవాలని చెప్పడంతో ఏం చేయాలో అర్థం కాలేదు. తెలిసిన వాళ్లతో చెప్పించుకుంటే రూ.3వేలు తగ్గిస్తామన్నారు. దీంతో చేసేదేమీ లేక అడ్మిషన్ రాసి వచ్చారు.

విజయనగర్ కాలనీలో నివసించే శ్రీనివాసరావు ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. తన ఇద్దరు పిల్లలను ఓ ప్రైవేటు స్కూలులో చదవిస్తున్నాడు. కూతురు టెన్త్ కాగా, కొడుకు 7వతరగతి. ఈ ఏడాది పాపకు రూ.30వేలు, బాబుకు రూ.28వేలు ఫీజు పెంచినట్లు స్కూలు యాజమాన్యం చెప్పడంతో చేసేదేమీ లేక, స్కూలు మార్చలేక అక్కడే కొనసాగించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

మామిడిపాలెంకు చెందిన చంద్రమోహన్ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. ఇద్దరు ఆడపిల్లలు. ఒకరు 9వ తరగతి, ఇంకొకరు 10తరగతికి వచ్చారు. గతేడాది వరకు ప్రైవేటు స్కూల్‌లో చదివించారు. అయితే పెరిగిన ఫీజులు, స్కూల్ బస్‌చార్జీలు, యూనిఫాం అన్నీ కలుపుకొని రూ.70వేలు కావాల్సి రావడంతో భరించలేక బండ్లమిట్టలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడానికి సిద్ధమయ్యాడు.

కారుమంచి గ్రామానికి చెందిన శ్రీనివాసరావు, తన కొడుకు ఇటీవల 10వతరగతి మంచి మార్కులతో పాసయ్యాడు. అయితే ఇంటర్ చేర్పించడానికి కాలేజీల్లో ఫీజుల వివరాలు చూసి అవాక్కయ్యాడు. డేస్కాలర్‌కు ఏడాదికి రూ.50వేలుపైనే అవుతుండగా, ఇక హాస్టల్‌లో చేర్చాలంటే అన్నీ కలిపి రూ.లక్షపైనే చెప్పారు. దీంతో అమ్మో ఇవేమి ఫీజులు అంటూ అవాక్కయ్యాడు.

అమ్మో... జూన్..!

మధ్యతరగతి కుటుంబాల్లో గుబులు

ప్రైవేటు స్కూళ్లల్లో ఫీజుల మోత..

పెరిగిన బ్యాగులు, పుస్తకాల ధరలు

విద్యార్థుల తల్లిదండ్రులపై రూ.లక్షల్లో భారం

ఏడాదికేడాది పెరుగుతున్న ఖర్చులు

సామాన్య కుటుంబాలు జూన్ నెల వచ్చిందంటేనే భయపడిపోతున్నారు. అమ్మో.. అంటూ నోరు వెళ్లబెడుతున్నారు. నెలరోజుల పాటు వేసవి సెలవుల్లో ఆటపాటలతో ఆనందంగా గడిపిన విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పట్టేందుకు సిద్ధమవుతుండగా, వారి తల్లిదండ్రులు మాత్రం ఆర్థిక ఇబ్బందులను అధిగమించేంది ఎలా అనే ఆలోచన చేస్తున్నారు. అడ్మిషన్ నుంచి పిల్లలు తరగతి గదిలో అడుగుపెట్టేంత వరకు వారికి లెక్కల పరీక్షే. ఖర్చుల మోతే.



ఒంగోలు కార్పొరేషన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : జూన్ నెల అనగానే పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఖర్చుల దడ పుడుతోంది. ఏటికేడు పెరుగుతున్న స్కూలు, కాలేజీ ఫీజులు, అందుకు అయ్యే ఇతర వ్యయం తలచుకుంటేనే గుండె గుభేల్ మంటుంది. ఈ నెలలో విద్యా సంస్థల పునఃప్రారంభంతో ఖర్చు తడిసి మోపెడవుతుంది, ఇదిలా ఉండగా నెలవారీ జీతాల పైనే ఆధారపడి జీవితాలను నెట్టుకొచ్చే మధ్యతరగతి కుటుంబాలు లెక్కలతో మల్లగుల్లాలు పడుతున్నారు. దీంతో ఈ మాసంలో ఆదాయం.. వ్యయం అంచనాలతో సాధారణ కుటుంబాలు సతమవుతున్నాయి. ముఖ్యంగా ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు ఫీజులు, పుస్తకాలు, బస్సు చార్జీలు, యూనిఫాంలు, యాప్‌ల రూపంలో విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద నుంచి భారీగా వసూళ్లకు దిగడంతో వారు ఆందోళన చెందుతున్నారు. తమ పిల్లల భవిష్యత్ బాగుండాలని భావిస్తూ తల్లిదండ్రులు పిల్లలను స్కూళ్లలో చేరుస్తున్నారు.

భారీగా ఫీజులు

పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఈనెల 12 తర్వాత పూర్తిస్థాయిలో ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఒకటో తేదీ నుంచే అడ్మిషన్‌లు ప్రక్రియ ప్రారంభించాయి. ప్రచారాలకు తెరలేపాయి. ప్రజలను ఆకట్టుకునేందుకు వివిధ మార్గాలను ఎంచుకుంటున్నాయి. రంగురంగుల ప్రింటింగ్‌లతో ఆకర్షణీయంగా కరపత్రాలు పంచుతూ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇదిలా ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో ఉండేవారు దగ్గరి పట్టణంలోని మంచి పాఠశాలలను ఎంచుకునే ప్రయత్నంలో నిమగ్నం కాగా, అక్కడ పుస్తకాల ధరలు, ఫీజుల గురించి తెలుసుకుంటే గుండె బరువెక్కిపోతుంది. యూకేజీ, ఎల్‌కేజీ స్థాయిలోనే వేలకు వేలు ఫీజులు రూపంలో పిండుకోవడం ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలకు పరామామూలైంది.

పెన్సిల్ నుంచి పుస్తకాల వరకు మోతే

పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నాయంటే తల్లిదండ్రులు ఖర్చులకు భయపడాల్సిన పరిస్థితి వచ్చింది. ముఖ్యంగా పిల్లలు స్కూలులో అడుగు పెట్టాలంటే పుస్తకాలు, నోట్‌బుక్కులతోపాటు, బ్యాగు, దానికి తోడు పిల్లాడికి లంచ్ బాక్స్, పెన్ను, పెన్సిల్ నోట్ బుక్స్. ఇలా ఒకటేమిటి రకరకాల వస్తువులు కొనుగోలు తప్పనిసరి. గతంలో విద్యార్థులు కావలసిన పుస్తకాలు తమకిష్టమొచ్చిన చోట కొనుక్కునేవారు. అయితే ఇపుడు పాఠశాలల పంథా మారింది. పెన్సిల్ దగ్గర నుంచి పుస్తకాల వరకు, బెల్టు, టై, షూస్, యూనీఫాం అన్నీ ఆయా స్కూళ్లలోనే కొనాలి. దీంతో ఒక్కో విద్యార్థికి సుమారు రూ.10వేలకుపైనే ఖర్చు కూడిన జాబితా కళ్ల ముందు కనిపిస్తుండగా ఇక ఏటా పెరుగుతున్న ఫీజులతో అదనంగా మరో రూ. 25వేలు కట్టాల్సి వస్తోంది. ఒకవైపు ఆర్థికభారం.. మరోవైపు పిల్లల భవిష్యత్ కోసం మౌనంగానే ముందడుగు వేస్తున్నారు.

ఒక్కో కుటుంబంపై లక్షల్లో భారం

మధ్యతరగతి కుటుంబాలది ఎపుడూ లెక్కల పుస్తకమే. ఒకవైపు నిత్యావసర సరుకులు, వివిధ అవసరాల ఖర్చులు అడ్డగోలుగా పెరిగిపోయాయి. దీంతో ఏనెలకానెల ఆదాయ, వ్యయాలపై ఆచీతూచీ అడుగులు వేస్తున్నవారిలో ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు ఉద్యోగులు, రోజువారీ కూలీలు ఉన్నారు. అయితే చదువు విషయంలో పేద, మధ్య తరగతి అనే బేధానికి ఫుల్‌స్టాప్ పెట్టాల్సిందే.

సాధారణ రోజుల్లోనే ఒక సాధారణ చిన్న కుటుంబం ఇంటి అవసరాలకు సుమారు రూ. 25 నుంచి 30వేల వరకు ఖర్చు అవుతుండగా, ఈ నెలలో ఇంటి అవసరాలు పక్కన పెడితే కేవలం పిల్లల స్కూలు కోసం ఒక్కొక్కరికీ సుమారు రూ. 50 వేల వరకు ఖర్చుచేయాల్సి వస్తుందని వాపోతున్నారు. అయితే ఒకరితో సరిపెట్టుకునే అంశం కాదని, ఇంట్లో ఇద్దరు పిల్లలు ఉంటే ఇక అంతే.. జూన్‌లో లక్ష రూపాయలకు పైనే ఖర్చు కావాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు.

ఇకపోతే పదవ తరగతి పాసైన విద్యార్థుల ఇళ్లలో అంతకు రెట్టింపు ఆందోళన ఇంటర్ ఏ కాలేజీలో చేర్చాలి.. డే స్కాలర్‌నా, హాస్టల్లోనా అనే ఆలోచనతో పాటు, ఆయా కాలేజిల గుర్తింపను బట్టి ఒక్కోవిద్యార్థికి అక్షరాల రూ. 2 లక్షలపైనే ఖర్చవుతోంది.

జూన్ నెల వస్తేనే భయం వేస్తుంది

ఏడాది మొత్తం పెద్దగా భయం అనిపించదు. రోజువారీ సమోసాలు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటూ ఉంటాను. కానీ జూన్ వస్తేనే భయం వేస్తుంది. అప్పు చేసే ధైర్యం లేదు. అలాగని దాచుకున్న డబ్బులు లేవు. ఏ రోజు పనిచేసుకుంటే ఆ రోజు కుటుంబ జీవనం, అలాంటిది పిల్లల ఫీజులు, యూనీఫారం, పుస్తకాలు కొనుగోలు భారంగా మారింది. ఇద్దరు పిల్లలకు కనీసం ఎలా కాదన్నా రూ. 50వేలు ఖర్చు అవుతుంది.

\- వెంకటేశ్వర్లు, చిరువ్యాపారి

10వ తరగతికి రూ. 60వేలు ఖర్చు

\- మోడుబోయిన మహేశ్వర్

వృత్తి రిత్యా సొంతంగా ఫంక్షన్లకు డెకరేషన్‌లు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. అమ్మాయి 10వ తరగతికి వచ్చింది. పోయిన సంవత్సరం సుమారుగా 40వేలు ఖర్చు అయితే ఈ సంవత్సరం స్కూలు ఫీజు రూ.40వేలు కాకుండా, పుస్తకాల కోసం, రూ. 9,500, పరీక్షల కోసం అదనంగా డబ్బులు కట్టాలి అంటున్నారు. యూనీఫాం, కోటు, బెల్ట్, షూలు అన్నీ వాళ్ళ స్కూలులోనే కొనాలంటున్నారు. దీంతో ఒక సంవత్సరానికి సుమారు రూ. 60వేలు అవుతుంది. పిల్లలు బాగా చదివి, ఉన్నతంగా ఉండాలన్న ఆశతో ఆర్థిక భారమైనా ఖర్చు భరించాల్సి వస్తుంది.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాను

\- రాంబాబు, మునిసిపల్ కార్మికుడు

ఇద్దరు పిల్లల చదవుకోసం సంవత్సరానికి సుమారు రూ.50 నుంచి రూ.70వేలు అవుతుంది. ప్రైవేటు స్కూల్స్‌లో ఫీజుల మోత, పుస్తకాలు, వ్యాను, జీతాలు తక్కువ ఖర్చులు ఎరుపెక్కువ. అయితే ప్రభుత్వ పాఠశాలలో కూడా చదువు బాగా చెబుతున్నారు. అందుకే ప్రవేటు స్కూలు మాన్పించి, కార్పొరేషన్ పీవీఆర్ స్కూలులో ఇద్దరు పిల్లలను చేర్పించాను. ప్రవేటు స్కూలు కంటే ప్రభుత్వ స్కూలులోనే బాగా చదువుతున్నారు. నాకు ఫీజుల మోత భయం లేకుండా సంతోషంగా ఉన్నాను.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

పలు ప్రాంతాల్లో ముస్లింల ప్రార్థనలు

సింగరాయకొండలో పాల్గొన్న మంత్రి స్వామి

ఇతరచోట్ల ఎమ్మెల్యేలు హాజరు



సింగరాయకొండలో బక్రీద్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి డీఎస్‌బీవీ స్వామి

ఒంగోలు కల్చరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ముస్లింలు బక్రీద్‌ను శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా అనేక గ్రామాలు, పట్టణాలలో ఆయా మసీదులు, ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. మతపెద్దలు ప్రార్థనలు జరిపించి అల్లాహ్ బోధనలు, ఖురాన్ సూత్రాలను వివరించారు. ఒంగోలు నగరంలోని కొణిజేడు బస్టాండ్ దగ్గర ఉన్న ఈద్గాలో శనివారం ఉదయం వేలాదిగా ముస్లింలు మత ప్రార్థనలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ కరుణ, దయ, దాతృత్వం వంటివి అవలంబించటం వల్లనే అల్లాహ్ దయ కలుగుతుందని సమాజంలో మనకంటే తక్కువ వారికి ఇచ్చే దానం ఎంతో గొప్పదని అన్నారు. ఇక స్థానిక ఇస్లాంపేట, పెద్దమసీదు, కోర్టుసెంటర్, మంగమూరు రోడ్డు బైపాస్ మొదలైన అనేక చోట్ల ఉన్న మసీదులలో సైతం బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

ప్రార్థనల్లో పాల్గొన్న ప్రముఖులు

అదే సమయంలో పలుచోట్ల అధికారపార్టీ ప్రజాప్రతినిధుల సందడి కనిపించింది. ముస్లిం సోదరులతో కలిసి పలువురు కీలక ప్రజాప్రతినిధులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. జిల్లాకు చెందిన సాంఘిక సంక్షేమశాఖమంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి తన నియోజకవర్గ పరిధిలోని సింగరాయకొండలో బక్రీదు వేడుకల్లో పాల్గొన్నారు. స్థానిక టీడీపీ నాయకులు,ముస్లీంలతో కలిసి ప్రార్థనలు నిర్వహించారు. రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య కూడా సింగరాయకొండలో ముస్లీం సోదరులు ఏర్పాటు చేసిన ఆత్మీయ విందు సమావేశంలో పాల్గొన్నారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిపట్టణంలోని కొంగలవీడు రోడ్డులోని ఈద్గాలో జరిగిన బక్రీద్ వేడుకల్లో పాల్గొని ప్రార్థనలు చేశారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పట్టణంలోని ఈద్గాలో జరిగిన బక్రీద్ వేడుకల్లో పాల్గొన్నారు. స్థానిక ముస్లీం పెద్దలతో కలిసి ప్రార్థనలు నిర్వహించారు. అలాగే ఒంగోలు, కనిగిరి, పొదిలి, యర్రగొండపాలెం, కంభం, పామూరు, చీమకుర్తి, దర్శివంటి పట్టణాలతో పాటు పలు ఇతర ప్రాంతాల్లోనూ ముస్లీంలు భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. పలుచోట్ల స్థానిక ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నేతలు కూడా ప్రార్థనల్లో పాల్గొని ముస్లీం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.

స్థల వివాదానికి రాజకీయ రంగు

● టీడీపీ కేడర్, అధికారులను బదనామ్ చేసే యత్నం
● వైసీపీ సోషల్ మీడియాలో రాద్ధాంతం
● పురుగుమందు తాగేలా ప్రేరేపించి...
● ఆపై పరామర్శల పేరుతో విమర్శలు చేస్తూ పోస్టులు

బల్లికురవ,జూన్7(ఆంధ్రజ్యోతి): సెంటు స్థలం విషయమై రెండు కుటుంబాల మధ్య నెలకొన్న వివాదాన్ని వైసీపీ సోషల్ మీడియా బ్యాచ్ రాద్ధాంతం చేస్తూ టీడీపీ క్యాడర్‌ను, అధికారులను బదనామ్ చేసే పనిలో నిమగ్నం కావటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. మండలంలోని రామాంజనేయపురంలో నాగిపోగు ఏసురత్నం, నాసరమ్మ కుటుంబాల మధ్య సెంటు స్థలం విషయంపై గత కొంతకాలంగా వివాదం ఉంది. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన వైసీపీ నేతలు ఏసురత్నంను పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడేలా ప్రేరేపించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం ఏసురత్నం పురుగు మందు తాగటంతో తొలుత అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు, అనంతరం ఒంగోలు వైద్యశాలకు తరలించారు. అధికారులను బెదిరించే క్రమంలో పురుగు మందు తాగిన వ్యక్తి చేత స్టేట్‌మెంట్‌లు కూడా ఇప్పిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిని రాజకీయ రంగు పులిమే పనిలో వైసీపీ క్యాడర్ నిమగ్నమైంది. ఈ క్రమంలో ఒంగోలులో చికిత్స పొందుతున్న ఏసురత్నంను వైసీపీ నేతలు పరామర్శించినట్లు వెళ్లి టీడీపీ నేతలు, అధికారులపై విమర్శలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుండటం విమర్శలకు తావిస్తోంది. ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకపోయినా అధికార పార్టీని బదనామ్ చేసే ఉద్దేశంతో వైసీపీ సోషల్ మీడియా వ్యవహరిస్తుందనే విమర్శలు వస్తున్నాయి. ఈ విషయాలను టీడీపీ క్యాడర్ తీవ్రంగా ఖండిస్తున్నది. వైసీపీ నేతలు, సోషల్ మీడియా పుణ్యాన ప్రశాంతంగా ఉన్న గ్రామాలు కాస్తా రగిలిపోయే పరిస్థితి నెలకొందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అధికారులు స్పందించి ఆరంభంలోనే ఇటువంటి విషయాలకు ఫుల్‌స్టాప్ పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అప్పులబాధతో కౌలురైతు ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ సైదుబాబు

మార్కాపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా వ్యవసాయంలో నష్టాలు, ఆర్థిక కష్టాలు ఎదురుకావడంతో భరించలేక కౌలురైతు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన ప్రకాశం జిల్లా మార్కాపురంలోని సుందరయ్య కాలనీలో శనివారం చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై ఎం.సైదుబాబు కథనం మేరకు.. తర్లుపాడు మండలం మీర్జాపేట గ్రామానికి చెందిన రాజారపు పెద్ద యలమంద(55) 20 ఏళ్ల క్రితం స్థానిక సుందరయ్య కాలనీకి వచ్చి అక్కడే నివాసముంటున్నారు. చుట్టుపక్కల ఉన్న భూములు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. ఈక్రమంలో పదేళ్లుగా జాతీయ రహదారి 565 ఆనుకుని ఎస్సార్ పెట్రోల్ బంకుకు ఇరువైపులా 10ఎకరాల్లో మిరపను సాగుచేస్తున్నారు. రెండేళ్లుగా దిగుబడి అంతంతమాత్రంగా రావడం, ధర లేకపోవడంతో సుమారు రూ.20లక్షల మేర అప్పులపాలయ్యారు. ఒకవైపు నష్టాలు, మరోవైపు అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. దీంతో మానసిక వేదనకు గురైన పెద్దయలమంద శనివారం ఉదయం 8.00 గంటలకు ఎప్పటిలాగే పొలానికి వెళ్లి అక్కడ కలుపు నివారణ కోసం వాడే మందును తాగారు. పొలంలో విగతజీవిగా పడి ఉన్న రైతును గొర్రెల కాపరి చూసి ఆయన భార్య కాశమ్మకు తెలియజేశారు. కుటుంబ సభ్యులు అక్కడి వెళ్లి చూసేసరికి అప్పటికే మృతిచెంది ఉన్నారు. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో వెనుకంజ

ఒంగోలు విద్య, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో జిల్లా విద్యార్థులు వెనుకంజ వేశారు. మార్చిలో జరిగిన పబ్లిక్ పరీక్షా ఫలితాలతో పోల్చితే రాష్ట్రస్థాయిలో జిల్లాస్థానం మరింత దిగజారింది. ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో కేవలం 37శాతం మంది ఉత్తీర్ణతతో 24వస్థానంలో నిలిచింది. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 57శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 21వస్థానంలో జిల్లా ఉంది. రాష్ట్ర సగటు ఉత్తీర్ణత కంటే ఆరుశాతం తక్కువతో విద్యార్థులు చతికిలబడ్డారు. జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 4,266 మంది హాజరు కాగా 2,433 మంది పాసయ్యారు. రాష్ట్రంలో సగటున 63శాతం మంది పాసుకాగా జిల్లాలో ఆరుశాతం తక్కువగా 57శాతం మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 567మంది పరీక్షకు హాజరుకాగా 348మంది పాసయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి 700 మంది పరీక్షకు హాజరు కాగా 428 మంది అంటే 61.1శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. కొండపి, తాళ్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. ఏపీ మోడల్ జూనియర్ కళాశాలల్లో 103 మందికి 67మంది అంటే 65శాతం పాసయ్యారు. దర్శి, ముండ్లమూరు మోడల్ జూనియర్ కళాశాలలు వందశాతం పాసయ్యారు. హైస్కూలు ప్లస్‌లో 63మందికి 40మంది పాసయ్యారు. పాకల, హెచ్.నిడమానూరు, కె.ఉప్పలపాడు హైస్కూలు ప్లస్‌లో నూరుశాతం ఉత్తీర్ణులయ్యారు. కేజీబీవీలో 104మందికి 59 మంది పాసై 56.86శాతం ఉత్తీర్ణత సాధించారు. ఏపీఎస్‌డబ్ల్యూఆర్/ఏపీటీడబ్ల్యూఆర్‌లో 36మందికి 19మంది పాసయ్యారు. కంభం, దూపాడులో వందశాతం పాసయ్యారు. ఎయిడెడ్‌లో 31 మందికి 25మంది అంటే 81శాతం పాసయ్యారు. గిద్దలూరు ఎస్‌వీ జూనియర్ కళాశాలలో 95శాతం మంది పాసయ్యారు.

ప్రథమ సంవత్సరంలో..

ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షకు 5,999 మంది హాజరు కాగా కేవలం 2,248 మంది పాసయ్యారు. రాష్ట్ర సగటున 45శాతం మంది ఉత్తీర్ణులు కాగా జిల్లాలో 8శాతం తక్కువగా కేవలం 37శాతం మంది మాత్రమే పాసయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 369మందికి 173 మంది పాసు కాగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 977 మందికి 412 మంది, ఏపీ మోడల్ జూనియర్ కళాశాలల్ల 138 మందికి 60మంది, హైస్కూలు ప్లస్‌లో 130 మందికి 42 మంది, కేజీబీవీల్లో 290 మందికి 156మంది, ఏపీఎస్‌డబ్ల్యూఆర్/ఏపీటీడబ్ల్యూఆర్‌లో 123 మందికి 54 మంది, ఎయిడెడ్‌లో 54 మందికి కేవలం 13మంది మాత్రమే పాసయ్యారు. ఈ కళాశాలల్లో అతితక్కువగా కేవలం 24 శాతం మంది మాత్రమే పాసయ్యారు.

చంద్రప్రభ వాహనంపై లక్ష్మీనరసింహుడు

● శాస్త్రోక్తంగా ధ్వజారోహణ
● గరుడు ప్రసాదం స్వీకరణకు అధిక సంఖ్యలో వచ్చిన మహిళలు



స్వామివారిని గ్రామోత్సవానికి తీసుకెళ్తున్న మోతకాపులు

సింగరాయకొండ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన వరాహ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు రమణీయంగా సాగుతున్నాయి. అందులో భాగంగా రెండోరోజైన శనివారం స్వామివారికి శాస్త్రోక్తంగా ధ్వజారోహణ నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను గరుత్మంతుడి ద్వారా ఆహ్వానం పలికేందుకు మూలవిరాట్ వరాహ లక్ష్మీనరసింహస్వామి ఎదురుగా ఉన్న ధ్వజస్తంభంపై గరుడపటాన్ని అర్చకులు ఎగురవేశారు. ధ్వజారోహణ సందర్భంగా స్వామివారికి నివేదన చేసిన గరుడ ప్రసాదాన్ని (పొడిముద్ద) సంతానంలేని మహిళలు స్వీకరించి 9 రోజులపాటు నియమనిష్ఠలతో ఉండి మరలా ధ్వజా అవరోహణ సందర్భంగా స్వీకరిస్తే సంతానప్రాప్తి కలుగుతుందని ఇక్కడి భక్తుల విశ్వాసం. దీంతో సంతానం లేని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని గరుడ ప్రసాదాన్ని స్వీకరించారు.

ధ్వజారోహణ అనంతరం మోతకాపులు ఉత్సవమూర్తులను గ్రామోత్సవానికి తీసుకెళ్లారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేకంగా అలంకృతుడైన స్వామివారు రాత్రి చంద్రప్రభ వాహనంపై విహరించారు. గ్రామస్థులు రంగవల్లులువేసి స్వామివారికి హారతులు పట్టారు. ఈ కార్యక్రమంలో ఈవో పి.కృష్ణవేణి, ప్రధాన అర్చకులు ఉదయగిరి వెంకట శేషా లక్ష్మీనరసింహాచార్యులు, అర్చకుడు నరసింహాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ఆదివారం ఉదయం స్వామివారిని సూర్యప్రభ వాహనంపై ఊరేగిస్తారు. రాత్రికి హంసవాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు.

అవీ.. ఇవీ



తనిఖీలు నిర్వహిస్తున్న జీఆర్పీ పోలీసులు

చీరాల రైల్వే స్టేషన్‌లో
ముమ్మర తనిఖీలు

చీరాల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : చీరాల రైల్వే స్టేషన్‌లో శనివారం రాత్రి రైల్వే పోలీసులు ముమ్మర తనిఖీలు చేశారు. జీఆర్పీ ఎస్సై కొండయ్య ఆధ్వర్యంలో జరిగిన తనిఖీల్లో అనుమానితుల వివరాలు సైతం సేకరించారు. అలాగే అనుమానిత ప్రయాణికుల లగేజీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించిన తనిఖీల్లో గంజాయి, తదితర మాదక ద్రవ్యాలపై నిశితంగా పరిశీలన చేసినట్లు వివరించారు. ఎస్సై వెంట పలువురు సిబ్బంది ఉన్నారు.



సిమెంట్ బల్లలను ఏర్పాటు చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో
సిమెంట్ బల్లల ఏర్పాటు

అద్దంకిటౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ప్రజలు సేద తీరేందుకు వీలుగా పలు ప్రాంతాలల్లో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో సిమెంట్ బల్లలను ఏర్పాటు చేశారు. శనివారం అద్దంకిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, మాధవస్వామి గుడి, దత్త గుడి, బాల ఆంజనేయ స్వామి గుడుల్లో ఒక్కొక్కటి, సింగరకొండ కాకతీయ సేవా సత్రం వద్ద రెండు సిమెంట్ బల్లలను ఏర్పాటు చేసినట్లు రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. పలువురు దాతల ఆర్థిక సహకారంతో బల్లలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ మురళి సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, మహమ్మద్ రఫీ, నందిరెడ్డి శ్రీనివాసరావు, బాచిన పూర్ణచంద్రరావు, అంజాద్ బాషా, తదితరులు పాల్గొన్నారు.



వెండి కిరీటం అందజేస్తున్న ఒంగోలుకు చెందిన టీడీపీ నేత మేడికొండ మోహనరావు,రమాదేవి దంపతులు

ప్రసన్నాంజనేయుడికి
వెండి కిరీటం బహూకరణ

అద్దంకి,జూన్7(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి కి అలంకరించేందుకు ఒంగోలు 37 వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు మేడికొండ మోహనరావు, రమాదేవి దంపతులు 1,76,795 రూపాయల విలువైన వెండి కిరీటాన్ని శనివారం అందజేశారు. ప్రత్యేక పూజల అనంతరం వెండి కిరీటాన్ని స్వామి వారికి అందజేశారు. ముండ్లమూరు మండలం శంకరాపురంకు చెందిన మోహనరావు ఒంగోలులోని 37 వ డివిజన్ సుజాతనగర్‌లో స్థిరపడ్డారు. ఒంగోలుకు చెందిన ఆముదాల ప్రకాశరావు,ఈశ్వరమ్మ దంపతులు ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖ మండపం నిర్మాణానికి రూ. 1,01,116 లను అందజేశారు.

ప్రగతి పథంలో భవిత కేంద్రాలు

రేపటితో ముగియనున్న ప్రత్యేక అవసరాల చిన్నారుల సర్వే

చీరాల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : దృష్టి, వినికిడి సమస్యలున్న చిన్నారులకు సైతం సాంకేతిక విద్యనందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఈక్రమంలోనే డిజిటల్ విధానంలో సాంకేతిక విద్యనందించేందుకు ట్యాబులు అందించి బోధన సాగిస్తున్నది. ప్రత్యేక అవసరాలున్న పిల్లల ఆరోగ్యంతో పాటు వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు భవిత కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈక్రమంలోనే భవిత కేంద్రాల సిబ్బంది ప్రత్యేక యాప్ విధానంతో శిక్షణ అందిస్తున్నారు. అందుకు సంబంధించిన ఎన్‌రోల్‌మెంట్ సర్వే గతేడాది మాదిరిగా ఈ ఏడాది కూడా నిర్వహిస్తున్నారు. మే 13 నుంచి ప్రారంభమైన ఈ సర్వే జూన్ 9తో ముగియనుంది. గతేడాది సర్వేలో 759 మందిని గుర్తించి బోధన అందిస్తుండగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 130 మంది మాత్రమే ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను అధికారులు గుర్తించడం విశేషం.



సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

పారదర్శక సేవలు - ప్రత్యేక బోధన

జిల్లా వ్యాప్తంగా ఉన్న 25 మండలాల్లో ఒక్కో మండలానికి ఒక కేంద్రం చొప్పున ప్రస్తుతం 25 భవిత కేంద్రాలు ఉన్నాయి. అలాగే ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు జిల్లా పరిధిలో 3,713 మంది ఉన్నారు. ఈక్రమంలో వారు భవిత కేంద్రాల్లో 460 మంది, జిల్లా పరిషత్‌లలో 1,809, జూనియర్ కళాశాలల్లో 176, యూపీ స్కూల్స్‌లో 306, ప్రాథమిక పాఠశాలల్లో 962 మంది చదువుతున్నారు. అయితే వీరిలో వినికిడి, దృష్టి సమస్యలున్న వారి బోధన కోసం గతేడాది 190 ట్యాబులు పంపిణీ చేయగా, వినికిడి సమస్య చిన్నారులకు 103, దృష్టి సమస్య చిన్నారులకు 11 ట్యాబులు పంపిణీ జరిగింది. వారికి శిక్షణ అందించేందుకు ఐఈఆర్‌పీలకు 49, స్కూల్ అసిస్టెంట్‌లకు 27 అందించి తద్వారా డిజిటల్ బోధన అందిస్తున్నారు.

అనునిత్యం పరిశీలన



ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ప్రత్యేక విద్యతో పాటు అనునిత్యం జీవన విధానాలపై దృష్టి సారిస్తున్నాం. తద్వారా వారికి బంగారు బాటలు పడతాయి. అలాగే ట్యాబులు పొందిన వారు వినికిడి, దృష్టి సమస్యలున్న వారికి ప్రత్యేక యాప్‌లు అందించి బోధన సాగిస్తున్నాము. అలాగే వినియోగం స్థితి గతులపై దృష్టి పెట్టాం.

- జ్యోత్స్న, జిల్లా సహిత విద్య సమన్వయకర్త

బర్లీ పొగాకు కొనుగోలుకు
ఎమ్మెల్యే ఏలూరి కృషి

మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించడంపై రైతుల హర్షం



యద్దనపూడి టీడీపీ కార్యాలయంలో సమావేశమైన నేతలు, రైతులు

యద్దనపూడి,(మార్టూరు)జూన్7(ఆంధ్రజ్యోతి):మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో నలకలబర్లీ పొగాకును కొనుగోలు చేయడంలో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు కృషి ఫలించిందని టీడీపీ యద్దనపూడి మండల నాయకులు శనివారం సాయంత్రం ఒకప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. యద్దనపూడి గ్రామ టీడీపీ కార్యాలయంలో మండల నాయకులు సమావేశమయ్యారు.గత కొన్నిరోజులుగా పొగాకును కొనుగోలు చేసే వారు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే ఏలూరి చొరవ తీసుకోవడంతో శనివారం పర్చూరు ఏఎంసీ మార్కెట్‌లో తొలిసారిగా మార్క్‌ఫెడ్ వారు పొగాకును కొనుగోలు చేశారు. దాంతో పొగాకు రైతులు తమ పొగాకును కూడా కొనుగోలు చేస్తారనే ధైర్యంగా ఉన్నారు.అందుకు ఎంతో కృషి చేసిన ఎమ్మెల్యే సాంబ శివరావుకు పొగాకు రైతులతో పాటు, టీడీపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో నల్లపనేని రంగయ్యచౌదరి, కనపర్తి నాగేశ్వరరావు, గుదే తారకరామారావు, కోయసతీష్, రావిపాటి సీతయ్య, గొట్టిపాటి సతీష్ కుమార్,కె.వంశీ, తదితరులు పాల్గొన్నారు.



ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల సభ్యులు

సెకండరీ గ్రేడ్ టీచర్లకు
మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

● ఉపాధ్యాయ సంఘాల నాయకుల డిమాండ్

అద్దంకిటౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదీలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఐక్య ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఎంఆర్‌సీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఐక్య ఉపాధ్యాయ సంఘాల చర్చలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, ప్రస్తుతం బదిలీల్లో వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించడాన్ని ఐక్య వేదిక తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ప్రభుత్వం 700 మంది ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించకపోతే ఉమ్మడి జిల్లాలలో డీఈవో ఆఫీస్ ముట్టడి కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు బేతాళ పూర్ణచంద్రరావు, మలాది నాగరాజు, కందుల గంగాధర్, జగన్నాధం బాబురావు, కరి రామయ్య, చప్పిడి కేశవరావు, కోవి మల్లికార్జునరావు, శ్రీనివాసరావు, చంద్రశేఖర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో బక్రీద్



అద్దంకి లోని శింగరకొండ రోడ్డులో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

అద్దంకి,జూన్7(ఆంధ్రజ్యోతి): బక్రీద్‌ను శనివారం ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. అద్దంకి పట్టణంలోని మసీదులలో, శింగరకొండ రోడ్డు, టైలర్స్ కాలనీ, ఒంగోలు రోడ్డులలో ఉన్న ఈద్గాల వద్ద ప్రత్యేక నమాజులను చేశారు. పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.



పర్చూరులో ఏర్పాటు చేసిన సామూహిక ప్రార్థనల్లో బక్రీద్ ప్రత్యేకతను వివరిస్తున్న ఇమాం

బల్లికురవలో

బల్లికురవ : మండలంలోని పలు గ్రామాలలో శనివారం ముస్లింలు బక్రీద్ పండుగ వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాల వద్దకు చేరి సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. కొణిదెన, ముక్తేశ్వరం, వల్లాపల్లి, వైదన, కొప్పెరపాడు, బల్లికురవ, అంబడిపూడి, కోటవారిపాలెం, చెన్నుపల్లి, మల్లాయపాలెం తదితర గ్రామాలలో బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు.

పంగులూరులో

పంగులూరు : బక్రీద్‌ను ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని అలవలపాడు, పంగులూరు, రామకూరు, గ్రామాలలో శనివారం ముస్లింలు ఈద్గావద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

చీరాలలో

చీరాల : స్థానిక సాల్మన్‌సెంటర్ నవాబ్‌పేట ఈద్గా దర్గాలో నిర్వహించిన ప్రార్థనల్లో యువనాయకుడు గౌరీ అమర్నాథ్, పలువురు ముస్లిం పెద్దలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మార్టూరులో

మార్టూరు : స్థానిక బస్టాండు సమీపంలో ఈద్గా వద్ద ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. బంధుమిత్రులకు,స్నేహితులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.మిఠాయిలు పంచిపెట్టారు. కొంతమంది దానధర్మాలు చేశారు. యద్దనపూడి మండలంలోని పలు గ్రామాలలో ముస్లిం కుటుంబాలు బక్రీద్ పండుగ వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.

పర్చూరులో

పర్చూరు : స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు పాల్గొన్నారు. నాగులపాలెం, ఉప్పుటూరు, చెరుకూరు, నూతలపాడు గ్రామాల్లో కూడా బక్రీద్ పండుగ వేడుకలను అత్యంత వేడుకగా జరుపుకున్నారు. అలాగే కారంచేడులో మండలంలోని పలు గ్రామాల్లో బక్రీద్ వేడుకలు జరుపుకున్నారు.

చినగంజాంలో

చినగంజాం : మండలంలోని చినగంజాం, కడవకుదురు తదితర గ్రామాల్లోని ముస్లింలు అల్లాహ్‌ను స్మరించుకుంటూ వీధులలో ఊరేగింపు నిర్వహించారు. మసీదు, ఈద్గాల వద్దకు వెళ్లి సామూహిక ప్రార్థనలుచేశారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా మసీదులను, ఈద్గాలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

ఇంకొల్లులో

ఇంకొల్లు: బక్రీద్‌ను ముస్లింలు శనివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాల వద్దకు చేరుకొని ప్రార్థనలు చేశారు. మతపెద్దలు ఖురాన్‌లోని సూక్తులను వివరించారు.



బక్రీద్ సందర్భంగా మొక్కలు నాటుతున్న ముస్లింలు

మొక్కలు నాటిన ముస్లింలు

అద్దంకి,జూన్7(ఆంధ్రజ్యోతి): బక్రీద్‌ను పురస్కరించుకొని రాజీవ్ కాలనీలో ముస్లింలు శనివారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, సీఐ సుబ్బరాజు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కాకాని అశోక్, అద్దంకి పట్టణ తెలుగుయువత అధ్యక్షుడు వడ్డవల్లి పూర్ణచంద్రరావు, చిలుకూరి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపట్ల
అప్రమత్తంగా ఉండాలి



బూదవాడలో జరిగిన ఉచిత వైద్యశిబిరంలో రోగికి సూచనలిస్తున్న డాక్టర్ అమూల్య

పంగులూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి):సమాజంలో ప్రతిఒక్కరూ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ వెంకటేష్ సూచించారు. మండలంలోని బూదవాడ గ్రామంలో ఇంకొల్లుకు చెందిన చెరుకూరి హాస్పటల్స్ నిర్వహించిన వైద్య శిబిరాన్ని డాక్టర్ వెంకటేష్ ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ ముద్దన సతీష్, షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ అమూల్య పాల్గొని వంద మంది రోగులకు వైద్య పరీక్షలు న్విహించి అవసరమైన మందులు అందజేశారు. గొట్టిపాటి యువసేన ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఈ ఉచిత వైద్య శిబిరంలో పలువురు టీడీప నాయకులు కొమ్మారెడ్డి, శ్రీనివాసరెడ్డి, సుబ్బారెడ్డి, వజ్రాల శ్రీనివాసరెడ్డి, అలవల రామిరెడ్డి, టీడీపీ గ్రామ అధ్యక్షులు మన్నెం వెంకయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మూడు రోజుల పాటు
సచివాలయాల్లో సేవలకు అంతరాయం

బల్లికురవ. జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాలలో ఉన్న సచివాలయాలలో పలు సేవలకు మూడు రోజుల పాటు అంతరాయం కలుగుతుందని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని తహసీల్దార్ రవినాయక్ తెలిపారు. శనివారం తహసీల్దార్ మాట్లాడుతూ ఏపీ సేవా పోర్టల్‌ను మైక్రో సాఫ్ట్ అజ్యూర్ క్లౌడ్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డేటా సెంటర్‌కు తరలింపు చేస్తున్నందున శనివారం నుంచి 10 వ తేదీ రాత్రి వరకు గ్రామ వార్డు సచివాలయాలలో ప్రజలకు ఆదాయ, సమగ్ర ధ్రువీకరణ పత్రం, భూమి మ్యూటేషన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, వృద్ధాప్య ధ్రువీకరణ పత్రాలు, వివాహ ధ్రువీకరణ పత్రాలు రెవెన్యూ వాటర్ ట్యాక్స్ వంటి పలు సర్వీసులకు అంతరాయం కలుగుతుందని, మిగిలిన ఇతర ప్రభుత్వ సేవలు మీసేవా కేంద్రాలలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రజలు గమనించి వారి పనులను మూడు రోజుల తదుపరి చేయించుకోవాలని తహసీల్దార్ కోరారు.



ఏబీసీ కాలువపై ప్రమాదకరంగా ఉన్న వంతెనపై నుంచి దాటుతున్న గొర్రెలు

క్రమశిక్షణతో
వంతెనపై గొర్రెల మంద

బల్లికురవ. జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిదిలోని అద్దంకి బ్రాంచ్ కాలువపై శనివారం గొర్రెల మంద ఎంతో క్రమశిక్షణతో పాటు భయం భయంతో వంతెనపై ప్రయాణం చేశాయి. ఏబీసీ కాలువ వంతెనకు రెండు వైపులా రక్షణ గోడలు కూడా లేవు. దీంతో ఉత్తరం వైపు నుంచి దక్షిణం వైపునకు ఏబీసీ కాలువపై వెళ్లాల్సిన గొర్రెల మంద ఒక దాని వెంట ఒకటి కాలువలోకి పడకుండా ఎంతో జాగ్రత్తగా దాటాయి. ఈ గొర్రెలు కాలువకు మూడు వైపులా ప్రయాణం చేయటం ప్రజలు ఆసక్తిగా గమనించారు. కాలువలో నీరు ఉన్నా నీటి కోసం దిగితే ప్రమాదం బారిన పడతాయని గొర్రెల యజమానులు ఎంతో ఆందోళన చెందారు. అయితే గొర్రెలు మాత్రం చాలా జాగ్రత్తగా కాలువ వంతెనను సురక్షితంగా దాటాయి.

భార్య కనిపించడం లేదని ఫిర్యాదు

మార్టూరు,జూన్7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలలపూడి గ్రామానికి చెందిన చిట్టిబోయిన గోపి తన భార్య శబరి కుమారి గత నెల 21 వతేదీ నుంచి కనిపించడం లేదని స్టేషన్ లో శనివారం ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు తెలిపారు. ఆయన కథనం ప్రకారం ఏడాది క్రితం పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన శబరికుమారితో గోపికి వివాహం జరిగింది.కానీ భార్య డిగ్రీ చదువు నిమిత్తం ఎక్కువగా పుట్టింట్లోనే ఉంటోంది. గత నెల 16 వతేదీన భార్యను కోలలపూడిలోని ఇంటికి తీసుకు వచ్చిన గోపి 21 వతేదీ రాత్రినుంచి భార్య కనిపించకపోవడంతో ఆమె కోసం గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు భార్య కనిపించకపోవడంతో స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేపు యోగాంధ్రపై మాస్ ర్యాలీ

చినగంజాం, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సోమవారం ఉదయం 8గంటలకు యోగాంధ్రపై మాస్ ర్యాలీ నిర్వహించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీ.హెచ్.పూర్ణచంద్రరావు గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. ఆయా గ్రామాలలోని పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి యోగా డే యొక్క ప్రాముఖ్యతను గ్రామాల్లోని ప్రజలకు తెలియజేస్తూ మాస్ ర్యాలీ నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయుటలో మండల తహసీల్దార్, మండల విద్యాశాఖాధికారి, వెలుగు ఏపీఎం, ఏపీవో, వైద్యశాఖ, గృహనిర్మాణ శాఖ, పోలీసు డిపార్ట్‌మెంట్ సిబ్బంది హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

ముప్పాళ్లలో నేత్రదానం


ఇంకొల్లు,జూన్7,(ఆంధ్రజ్యోతి) : ముప్పాళ్ల గ్రామంలో శనివారం నేత్రదానం జరిగింది.గ్రామానికి చెందిన కల్లూరి పార్వతమ్మ(66) మృతి చెందగా కుటుంబసభ్యుల సహకారంతో ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు శంకర కంటి వైద్యులు నేత్రాలను సేకరించారు.నేత్రదానంకు సహకరించిన మృతురాలి కుటుంబసభ్యులు వెంకటేశ్వర్లు,ఆంజనేయులను రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు జెట్టి వెంకటేశ్వర్లు, రామ్మోహనరావు, రోటరీ క్లబ్ అధ్యక్షులు రఫీ,సభ్యులు అభినందించారు.

రేపు రేణుకాంబ అమ్మవారి వార్షికోత్సవం

యద్దనపూడి,(మార్టూరు)జూన్7(ఆంధ్రజ్యోతి):యద్దనపూడి మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలో జంపని వంశస్థులు సోమవారం శ్రీ రేణుకాంబ అమ్మవారి దేవస్థానంలో 10 వ వార్షిక వేడుకలను నిర్వహిస్తున్నట్లు జంపని శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

అన్నదానం

జాండ్రపేట(చీరాల), జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జాండ్రపేట శ్రీ భవానీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిరుపేదలకు అన్నదానం నిర్వహించారు. ఈసందర్భంగా చైర్మన్ డాక్టర్ సజ్జా లీలావతి మాట్లాడుతూ అన్ని దానాలకన్నా అన్నదానం మిన్న అని, ఆకలితో ఉన్నవారికి కడుపు నింపడంలో సంతోషముందన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు మోహన్‌రావు, పుష్పవల్లి, డాక్టర్ సజ్జా కమల్నాథ్ కార్తీక్, పరంజ్యోతి, బసవేశ్వరరావు పాల్గొన్నారు.



ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో

జిల్లాకు మూడోస్థానం

నెల్లూరు(విద్య), జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ ఫలితాలను శనివారం విడుదల చేశారు. ఈ రెండు జనరల్ విభాగాల్లోనూ జిల్లాకు రాష్ట్రస్థాయిలో మూడోస్థానం దక్కింది. ప్రథమ సంవత్సరం ఒకేషనల్‌లో ప్రథమస్థానం, ద్వితీయసంవత్సరంలో ద్వితీయ స్థానం దక్కించుకుంది. జిల్లాలో ఈ ఏడాది ప్రథమ సంవత్సరం జనరల్ విభాగంలో 6342 మంది పరీక్షకు హాజరుకాగా 3395 మంది ఉత్తీర్ణతతో 54 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరం విభాగంలో 3469 మంది హాజరు కాగా 2677 మంది ఉత్తీర్ణతతో 77 శాతం ఉత్తీర్ణత పొందారు. అదేవిధంగా ఒకేషనల్‌లో ప్రథమ సంవత్సరంలో 283 మంది హాజరు కాగా 200 మందితో ఉత్తీర్ణతతో 77 శాతం, ద్వితీయ సంవత్సరంలో 141 మంది హాజరు కాగా 128 మంది ఉత్తీర్ణతతో 91శాతం ఉత్తీర్ణత సాధించారు.

● రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలి..

రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు bie.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా సోమవారం

(మిగతా 7వ పేజీలో..)

భక్తిశ్రద్ధలతో బక్రీద్

ఈద్గాలు, మసీదుల్లో సామూహిక ప్రార్థనలు

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్‌ను శనివారం జిల్లాలోని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం 6 నుంచి 8గంటల వరకు మసీదల్లో ప్రత్యేక ప్రార్థనలు, దువాలు జరిగాయి. బక్రీద్ గురించి మహ్మద్ ప్రవక్త ఖురాన్‌లో తెలిపిన విధంగా, త్యాగం, ప్రేమ సహనం పాటించాలని మతపెద్దలు తమ తమ ప్రసంగాల్లో వివరించారు. అన్నీ ఈద్గాల్లో ఉదయం 9 నుంచి 11.30గంటల వరకు సామూహికంగా జరిగిన ప్రార్థనల్లో ముస్లింలు పాల్గొన్నారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలియచేసుకున్నారు.

● మతసామరస్యం పాటిస్తున్న ముస్లింలు

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి భారతీయ ముస్లింలు దేశభక్తికి కట్టుబడి ఉన్నారని, మత సామరస్యం పాటిస్తున్నారని ఇమామ్ ఖతీబ్ సయ్యద్ అబూబకర్ అష్రఫీ సాబిరి పిలుపునిచ్చారు. శనివారం దర్గామిట్ట బారాషహీద్ ఈద్గాలో బక్రీద్ నమాజ్ అనంతరం ఆయన సందేశం ఇచ్చారు. దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ వారితో పోరాటం చేసి అశువులుబాసిన ముస్లిం దేశభక్తులను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సామూహిక ప్రార్థనలకు నగరం నలుమూలల నుంచి ముస్లింలు భారీ సంఖ్యలో తరలివచ్చారు.



నెల్లూరు బారాషహీద్ దర్గా ప్రాంగణంలోని ఈద్గాలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు

సౌర విద్యుత్‌కు మరింత ప్రోత్సాహం

- సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వ రాయితీలు
- బీసీలకు అదనంగా రూ.20 వేలు
- ఐదు నుంచి ఆరు లక్షలమందికి లబ్ధి

జిల్లాలో సోలార్ విద్యుత్ ప్లాంట్లను వినియోగదారులు ఎక్కువగా ఏర్పాటు చేసుకునేలా ప్రభుత్వం ముమ్మర కసరత్తు చేస్తోంది. సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం సబ్సిడీని ఇస్తూ వినియోగదారులను ప్రోత్సహిస్తున్నది. అయినా ఆశించిన స్థాయిలో వినియోగదారులు ముందుకు రావడం లేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి కేంద్రం ఇస్తున్న సబ్సిడీకి అదనంగా బీసీ వర్గాలకు మరో రూ.20 వేలు రాయితీని అందజేస్తున్నట్లు ప్రకటించింది.

నెల్లూరు (జడ్పీ), జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గృహాలు, వాణిజ్య సముదాయాలు, వ్యవసాయానికి సంబంధించి 11 లక్షల మేర విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటితోపాటు పరిశ్రమలకు కలిపి రోజుకి 15 మిలియన్ యూ నిట్ల (ఎంయూ) విద్యుత్‌ను ప్రభుత్వం సరఫరా చేస్తున్న ది. రాష్ట్రంలో బొగ్గు, నీటితో ఉత్పత్తి అయ్యే కరెంటు డి మాండ్‌కు తగ్గట్లుగా లేదు. దీంతో వేసవిలో కోతలు తప్ప డం లేదు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం అధిక ధరలకు ప్రభుత్వం బయట రాష్ట్రాల నుంచి కొనుగోలు చేయా ల్సి వస్తున్నది. ఆ భారం వినియోగదారులపైనే పడుతోంది. అయితే ప్రతి ఇంటికి సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా అధిక డిమాండ్‌కు చెక్ పెట్టే అవకాశం ఉంది.

● బీసీలకు అదనపు సబ్సిడీ

జిల్లాలో ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను ప్రభుత్వం అందిస్తున్నది. దీంతో సుమారు 60 వేల కుటుంబాలు లబ్ధిపొందుతున్నాయి. వీరందరికి సూర్యఘర్ పీఎం ద్వారా సోలార్ విద్యుత్‌ను ప్రభుత్వమే ఉచితంగా ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తున్నది. అలాగే బీసీ వర్గాల్లో పేద, మధ్య తరగతి కుటుంబాలు ఎక్కువగా సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదనంగా రూ.20 వేల సబ్సిడీని అందించనుంది. కిలోవాట్ సోలార్ విద్యుత్ ఏర్పాటుకు రూ.70 వేల నుంచి రూ.80 వేల వరకు ఖర్చు అవుతుంది. ఇందులో రూ.38 వేలు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీగా అందచేస్తున్నది. రెండు కిలోవాట్‌కి రూ.1.3 లక్షల నుంచి 1.4 లక్షల వరకు ఖర్చు అవుతోంది. అందులో రూ.60 వేలను కేంద్రప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది. మూడు కిలోవాట్‌కి రూ.2.1 లక్షల నుంచి రూ.2.2 లక్షల వరకు ఖర్చు అవుతుండగా, అందులో రూ.78 వేలు కేంద్రం సబ్సిడీ అంద చేస్తుండగా దీనికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.20 వేలు బీసీ వర్గాలకు సబ్సిడీని ఇవ్వనున్నది. బీసీ వర్గాలకు ఇది మరింత ఊరట నివ్వనున్నది. జిల్లాలో దాదాపుగా 5 లక్షల నుంచి 6 లక్షల వరకు బీసీ వర్గాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. వీరందరికీ లబ్ధి చేకూరనున్నది.



సౌర విద్యుత్ పలకాలను పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్

● అవగాహన పెంచేలా ప్రత్యేక చర్యలు

ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం అమలుపై ప్రజల్లో అవగాహన పెంచేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఏపీ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ డైరెక్టర్ (టెక్నికల్) కే. గురవయ్య పిలుపునిచ్చారు. నగరంలోని విద్యుత్ భవన్ స్కాడా సమావేశ

(మిగతా 7వ పేజీలో..)

కాకాణి... అదే మౌనం

రెండో రోజూ నోరు తెరవని మాజీ మంత్రి ● నేటితో ముగియనున్న పోలీసు కస్టడీ

నెల్లూరు(క్రైం), జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పోలీసు కస్టడీలో రెండవరోజు శనివారం కూడా నోరుమెదపలేదని తెలిసింది. పొదలకూరు మండలం రుస్తుం మైన్స్‌లో క్వార్ట్జ్ అక్రమ తవ్వకాల కేసులో ఏ4గా రిమాండ్‌లో ఉన్న కాకాణిని జిల్లా కేంద్ర కారాగారం నుంచి పోలీసు కస్టడీకు తీసుకున్న విషయం తెలిసిందే. కృష్ణపట్నం పోలీసు స్టేషన్‌లో నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెండో రోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, మధాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విచారణ సాగింది. పోలీసులు ఏ ప్రశ్న అడిగినా కాకాణి నాకు తెలియదు, గుర్తులేదు... అన్న సమాధానాలు చెప్పినట్లు సమాచారం. ఆదివారం నాటితో కాకాణి పోలీసు కస్టడీ ముగియనుంది.

● ఇద్దరికి బెయిల్

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన రుస్తుం మైన్స్ అక్రమాల కేసులో నిందితులుగా

(మిగతా 7వ పేజీలో..)

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	132
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	262

కోడిగుడ్ల ధర (100): 540

నరసింహుడి సేవలో జడ్పీ సీఈవో విద్యారమ



వలేటివారిపాలెం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామిని శనివారం జడ్పీ సీఈవో విద్యారమ దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. గర్భగుడిలో ప్రధాన ఉప అర్చకులు గౌరీశంకర్ అష్టోత్తర ప్రత్యేక పూజలు చేసి శాలువాతో సత్కరించి స్వామి వారి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈవో విద్యారమ మాట్లాడుతూ ఆలయ ప్రకృతి సౌందర్య బాగుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరేంద్రదేవ్, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో అటకెక్కిన

‘లిఫ్ట్ ఇరిగేషన్’

● గత టీడీపీ ప్రభుత్వంలో నిధుల మంజూరు ● గత వైసీపీ హయాంలో రద్దు

● కూటమి పాలనలోనైనా కార్యరూపం దాల్చేనా? ● ఆశగా ఎదురు చూస్తున్న రైతులు



కొత్తపల్లి చెరువులో అక్కడక్కడ ఉన్న నీరు

కావలి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): చెంతనే సోమశిల నీరు.. కానీ సమీపం పొలాలకు సాగునీరు అందక రైతుల అవస్థ.. ఈ పరిస్థితిలో 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం లిఫ్ట్ ఇరిగేషన్ పథకం కింద నిధులు మంజూరు చేసింది. అయితే ఆ తరవాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ పథకాన్ని అటకెక్కించింది. దీంతో రైతుల ఆశలు అడియాశలయ్యాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అయినా ఈ పథకాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతుందా అని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. కావలి మండలంలో 17 పంచాయతీలు ఉండగా వాటిలో 13 పంచాయతీలకు సోమశిల నీరు అందుతోంది. కొత్తపల్లి, ఆర్సీపాలెం, చలంచర్ల, అడవిల క్ష్మీపురం పంచాయతీలు మెట్ట పంచాయతీలుగా రైల్వే ట్రాక్‌కు పడమర వైపున ఉన్నాయి. ఆ పంచాయితీల పరిధిలోని చెరువులు కేవలం వర్షాధారంపై ఆధార పడి ఉన్నాయి. వాటికింద పంటలు సాగు చేస్తే అవి పండేవరకు నమ్మకం లేక పంట చేతికి వచ్చే సమయంలో చివరి తడి నీరు తగ్గి పంటలు ఎండి పోతోన్నాయి. దీంతో రైతులు ఆరుగాలం కష్టపడి సాగుచేసుకున్న పంటలు చేతికందక తీవ్రంగా నష్టపోతున్నారు. ఆయా పంచాయతీల రైతులు తమకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సోమశిల జలాలు అందిస్తే సాగు చేసుకున్న పంటలు చేతికందుతాయనే నమ్మకం ఏర్పడుతోంది. దీంతో ఎన్నాళ్లగానో రైతులు కావలి కాలువ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం మంజూరు చేసి తమ ప్రాంత పొలాలకు సోమశిల జలాలు అందించాలని కోరుతున్నారు. ఈ క్రమంలో గత టీడీపీ ప్రభుత్వంలో బీద మస్తాన్‌రావు, బీద రవిచంద్రలు ప్రత్యేక చొరవ తీసుకుని ఆ 4 పంచాయతీలకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సోమశిల జలాలు అందించేందుకు ప్రయత్నాలు చేపట్టారు. అందులో భాగంగా అధికారులను తీసుకు వచ్చి ఆయా ప్రాంతాలను పరిశీలించడంతో లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సోమశిల జలాలు అందించేందుకు సాధ్యమవుతోందని



కావలి చెరువుకు సోమశిల నీరు వెళ్లే కావలి కాలువ



నీరు లేని చలంచర్ల చెరువు

గుర్తించి రూ.42 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. ప్రతిపాదనలు పంపిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం మంజూరు అనుమతులు ఇచ్చింది. అయితే దానికి టెండర్లు పిలిచే తరుణంలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో అప్పట్లో టెండర్లు నిలిపివేశారు. ఎన్నికల అనంతరం రాష్ట్రంలో అధికారమార్పిడి జరిగి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.

● అటకెక్కించిన వైసీపీ ప్రభుత్వం

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసిన పథకాన్ని మనం కొనసాగిస్తే ఆ పేరు వారికే వస్తుందని లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని అటకెక్కించింది. దగదర్తి విమానాశ్రయం లాగా దానిని కూడా కొంత కాలానికి రద్దు చేయించింది. దీంతో రైతులు లిఫ్ట్ ఇరిగేషన్ పథకంపై పెట్టుకున్న ఆశలన్నీ అడియాశలయ్యాయి. రైతులు ఎన్ని పర్యాయాలు వైసీపీ పాలకుల దృష్టికి తీసుకెళ్లినా వారు స్పందించక పోవడంతో ఆ పథకం వైసీపీ పాలనలో మరుగున పడింది.

● యువగళంలో లోకేష్ దృష్టికి..

మళ్లీ కూటమితో కలిసి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతులు లిఫ్ట్ ఇరిగేషన్ పథకంపై ఆశలు పెట్టుకున్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా కొత్తపల్లికి వచ్చిన యువ నాయకుడు నారా లోకేష్‌కు ఈ పథకం గురుంచి, దాని ఆవశ్యకతను తెలయచేస్తూ మళ్లీ మంజూరు చేయాలని విన్నవించుకున్నారు. దీంతో ఆయన రాష్ట్రంలో ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ పథకాన్ని పునరుద్ధరిస్తానని రైతులకు అప్పట్లో హామీ ఇచ్చారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో దానిని పునరుద్ధరించాలని ప్రభుత్వ పాలకులను రైతులు కోరుతున్నారు. ఈ పథకం పునరుద్ధరణ జరిగితే మండలంలోని అన్ని పంచాయతీలకు సోమశిల జలాలు అందించినట్లవుతోంది. దీంతో రైతులకు మండలంలో సాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమయ్యే అవకాశాలు ఉన్నాయి.

31వ ఎమ్మార్పీఎస్ దినోత్సవానికి సన్నాహక ఏర్పాట్లు



కరేడు ఎమ్మార్పీఎస్ కార్యకర్తలతో ఉమ్మడి ప్రకాశం జిల్లా ఇన్‌చార్జ్ నరేంద్రబాబు

ఉలవపాడు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): జూలై 7వ తేదీన ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే గ్రామాల్లోని ఎమ్మార్పీఎస్ శ్రేణులను సమాయత్తం చేస్తున్నట్లు ఉమ్మడి ప్రకాశం జిల్లా ఇన్‌చార్జి నరేంద్రబాబు మాదిగ తెలిపారు. శనివారం కరేడులోని అరుంధతి కాలనీలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, నాయకులతో ఆయన సమావేశం అయ్యారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గ్రామాల్లోని ఎస్సీ కాలనీల్లో జూలై 7న జెండాలు ఆవిష్కరణ కోసం దిమ్మెలను ఆధునీకరించడం, జెండా దిమ్మెలు లేని చోట నూతన ఏర్పాట్లు జరిగేలా చూసేందుకు ఎస్సీ కాలనీల్లో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఈనెల 11వ తేదీన కందుకూరులో గ్రామ, మండల కమిటీల నిర్మాణం కొరకు సమావేశం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కందుకూరు నియోజకవర్గ ఎంఎస్‌పీ రావినూతల ముత్తు మాదిగ, ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు రావినూతల ఐజాక్, కరేటి గోపాల్, పున్నెపల్లి శ్రీనివాసులు, ఏలియా, వినయ్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ తిరుపతి రీజియన్ నాయకుడు ఎస్ఎస్ మూర్తి, తదితరులు

కావలి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ నాయకులు కామ్రేడ్ వై. తారకనాథ్ 21వ వర్ధంతిని పురస్కరించుకుని ఆ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్‌బ్రాంచ్‌లో జరిగిన ఈ శిబిరాన్ని ఎస్‌బీఐ యూనియన్ తిరుపతి రీజియన్ నాయకుడు ఎస్ఎస్ మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తారకనాథ్ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది సమస్యల పరిష్కారానికి యూనియన్ తరుపున ఎనలేని సేవలు అందించారన్నారు. ఎక్కువ మంది రక్త దాతలను తీసుకువచ్చిన ముంగమూరు మాజీ సర్పంచు యన్నాబత్తిన వెంకటేశ్వర్లు, కిరణ్‌కుమార్‌లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రక్తకేంద్రం వైద్యాధికారిణి రమ్య, ఎస్‌బీఐ యూనియన్ నాయకులు గిరిధర్, శ్రీనివాసులురెడ్డి, జ్యోత్స్న. సుమన, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు టీ. శ్రీనివాసరావు, ప్రకాశరావు, రెడ్‌క్రాస్ బాధ్యులు డీ. రవిప్రకాష్, కే. హరినారపరెడ్డి. ఆరికట్ల మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మంత్రి ఆనం అభినందన

కందుకూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : గత విద్యా సంవత్సరంలో నిర్వహించిన 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో షైనింగ్ స్టార్స్ ప్రతిభా అవార్డుకు ఎంపికైన విద్యార్థులను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అభినందించారు. శనివారం కందుకూరు పట్టణంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి పాల్గొన్నారు. మండల పరిధిలో షైనింగ్ స్టార్ ప్రతిభా అవార్డులకు 8 మంది విద్యార్థులు ఎంపిక కాగా అందులో ఐదుగురు బీఆర్ ఆక్స్‌ఫర్డ్ పాఠశాలకు చెందిన వారు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు బాల భాస్కరరావు, నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఉపశమనం



కలిగిరిలో కురుస్తున్న వర్షం

కలిగిరి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం కురిసిన వర్షం ప్రజానీకానికి కాసింత ఉపశమనం కలిగించింది. ఎండవేడిమికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ఓ మోస్తరు వర్షం కురవడంతో వీధులన్నీ జలమయమయ్యాయి. దీంతో వాతావరణం చల్లబడటంతో ప్రజలు సేదతీరారు.

ప్రసన్నుడి ఆలయంలో ప్రత్యేక పూజలు



ఊంజల సేవలో స్వామి అమ్మవార్లు

బిట్రగుంట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండ బిట్రగుంట బిలకూట క్షేత్రంపై వెలసి ఉన్న ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజాభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ, సాయంత్రం ఊంజల సేవా కార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్ని స్వామి అమ్మవార్లను పూజించారు. ఈ కార్యక్రమంలో ఈవో రాధాకృష్ణ, అర్చకులు సత్యనారాయణ చార్యులు, భక్తులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఏడాది కాలంలో హామీలన్నీ నెరవేర్చాం

● షాపింగ్ కాంప్లెక్స్‌కు మంత్రి ఆనం, ఎమ్మెల్యే ఇంటూరి భూమి పూజ



కందుకూరు అంకమ్మ ఆలయంలో షాపింక్ కాంప్లెక్స్‌కు భూమిపూజ చేస్తున్న మంత్రి ఆనం, ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : దేవాదాయ శాఖలో ఇచ్చిన ప్రతి హామీని గత ఏడాది కాలంలో నెరవేర్చామని, రాష్ట్రంలో అనేక దేవాలయాల పునర్నిర్మాణానికి రూ.500 కోట్లు ఖర్చు చేశామని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. శనివారం కందుకూరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యాక్రమాలకు శంకుస్థాపనులు, ప్రారంభోత్సవాల్లో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావులో కలిసి ఆయన పాల్గొన్నారు. కందుకూరులో గ్రామదేవత అంకమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్మించ తలపెట్టిన షాపింగ్ క్లాంప్లెక్స్‌కు భూమి పూజ చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం ఆర్టీసీ ఆవరణంలోని షాపింగ్ కాంప్లెక్స్‌కు భూమి పూజ చేశారు. తొలుత అంకమ్మ ఆలయంలో జరుగుతున్న అనివేటి మండపం నిర్మాణ పనులను పరిశీలించి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ... రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గతంలో కంటే 30 శాతం అధికంగా భక్తులు ఆలయాలను దర్శించుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో 6ఏ కేటగిరిలో ఉన్న 148 ఆలయాలకు గాను 70 ఆలయాల్లో నిత్య అన్నప్రసాద కార్యక్రమాలు ప్రారంభించామని, వీటిలో మాలకొండ దేవస్థానం కూడా ఉందని తెలిపారు. వీలైనంత త్వరలోనే మిగిలిన ఆలయాల్లో కూడా నిత్య అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రాంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఇచ్చి ప్రతి హామీని నెరవేర్చే క్రమంలో గ్రామీణ ప్రాంతాల ఆలయాల్లో ధూపదీప నైవేద్యాలకు పూజార్లకు రూ.10,000 ఇస్తున్నామని, అర్చకుల సంభావనను రూ.10 వేలకు పెంచామని తెలిపారు. అలాగే వేదం చదివి ఉన్న 6000 మంది వేద పండితులకు నెలకు రూ.3000 చొప్పున నిరుద్యోగ సంభావన మంజూరు చేశామన్నారు.

అంకమ్మ ఆలయానికి గాలిగోపురం నిర్మాణానికి చర్యలు

ఎంతో వైభోవంగా నిర్మాణం జరిగిన కందుకూరు అంకమ్మ ఆలయ పునర్నిర్మాణం పనులను త్వరలో పూర్తిచేసేలా జర్యలు తీసుకోవడంతోపాటు ఏడు అంతస్తుల రాజగోపురం నిర్మాణంకు కూడా దేవాదాయ శాఖ నుంచి నిధులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటానని మంత్రి ఆనం ప్రకటించారు. పట్టణం నడిబొడ్డున ఉన్న అమ్మవారి ఆలయానికి ఆదాయం వనరులు పెంచే క్రమంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేయాలని పట్టణ పెద్దలు, ఎమ్మెల్యే నిర్ణయించడం శుభపరిణామం అన్నారు. ఈ కాంప్లెక్స్‌లో షాపులు నిర్వహించేవారు లీజుదారులే కానీ హక్కుదారులు కాదని, అమ్మవారే హక్కుదారుగా ఉంటారని అయన తెలిపారు. అమ్మవారికి నిత్య కైంకర్యాలు, ఆగమన శాస్త్రం ప్రకారం వైభవంగా జరిగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అలాగే ప్రతి సంవత్సరం జతార నిర్వహించేందుకు అందరి అభిప్రాయాలు సేకరించి ఒక విధానం రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్, వివిధ శాఖల అధికారులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

నోరు తెరవని కాకాణి

(5వ పేజీ తరువాయి)

రిమాండ్‌లో ఉన్న వారిలో ఇద్దరికి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో పేర్నాటి శ్యాం ప్రసాద్‌రెడ్డితోపాటు మరో ఇద్దరు ముందస్తు బెయిలు తీసుకోగా, ఏ4గా ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి పోలీసు కస్టడీలో ఉన్నారు. ఏ6గా ఉన్న వేమిరెడ్డి అరవింద్ కుమార్‌రెడ్డి నాలుగు రోజుల క్రితమే బెయిల్‌పై విడుదలయ్యారు. ఏ7 కరుణాకర్‌రెడ్డి, ఏ8 శివారెడ్డికి హైకోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. దీంతో వారు శనివారం నెల్లూరు సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు.

ఇంటర్ సప్లిమెంటరీలో 3వ స్థానం

(5వ పేజీ తరువాయి)

నుంచి ఈ నెల 13వతేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆర్ఐవో వరప్రసాద్‌రావు తెలిపారు. రీకౌంటింగ్‌కు ఒక్కో పేపర్‌కు రూ.260లు, రీ వెరిఫికేషన్(స్కాన్ చేసిన కాపీ) ఒక్కో పేపర్‌కు రూ.1300లు చెల్లించాలన్నారు. అభ్యర్థులు సెప్టంబరు 10వతేదీ లోపల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

సౌర విద్యుత్‌కు మరింత ప్రోత్సాహం

(5వ పేజీ తరువాయి)



మాట్లాడుతున్న విద్యుత్ పంపిణీ సంస్థ డైరెక్టర్ (టెక్నికల్) గురవయ్య

మందిరంలో శనివారం నెల్లూరు రూరల్ విద్యుత్ డివిజన్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సౌర విద్యుత్ ఉత్పత్తి పథకాన్ని మరింత ప్రోత్సహించాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఎదురవుతున్న ప్రాంతాలను గుర్తించి, తక్షణమే వోల్టేజ్ స్థిరీకరణకు అవసరమైన ఇంప్రూ మెంట్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం బుజబుజ నెల్లూరు విద్యుత్ ఉపకేంద్రాన్ని సందర్శించారు. అక్కడ విద్యుత్ సరఫరా, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ వి విజయన్, ఈఈ సోమశేఖర్‌రెడ్డి, నోడల్ ఆఫీసర్ శేషాద్రి బాలచంద్ర, ఈఈ ట్రాన్స్‌ఫార్మర్స్ లక్ష్మీనారాయణ, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

త్యాగాలకు ప్రతీక బక్రీద్



కావలిటౌన్ : దైవ సందేశానిస్తున్న ముఫ్తీ ఖలీల్ అహ్మద్

కావలిటౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : త్యాగాలకు ప్రతీక బక్రీద్ అని ముఫ్తీ ఖలీల్ అహ్మద్ పేర్కొన్నారు. బక్రీద్ పర్వదినం పురస్కరించుకుని శనివారం పట్టణంలోని జామియా (పెద్ద)మసీద్, వైకుంఠపురంలోని మదీనా మసీద్ ఈద్గాలో, కసాయి వీధిలోని అక్సా మసీద్, ఇస్లాంపేటలోని సున్నతల్ మసీద్, అహ్లె అదీస్ మసీద్, కచ్చేరిమిట్టలోని మసీద్, వెంగళరావునగర్‌లోని ఈద్గా మసీదుల్లో ఉదయం 6-30 నుంచి 8-30 గంటల వరకు భక్తిశ్రద్ధలతో బక్రీద్(ఈదుల్‌జుహ)ప్రార్థనలు ఆచరించారు. నమాజ్ అనంతరం పిల్లలు పెద్దలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ అంటూ బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకోవడంతో పండుగ వాతావరణం నెలకొంది. మత పెద్దలు తమ దైవ సందేశాలు అందించారు.

● **కావలి రూరల్** : మండలంలోని గ్రామాల్లో ఉన్న ఈద్గాలు, మసీదుల వద్ద బక్రీదు వేడుకలు ఘనంగా నిర్వహించారు. సిరిపురం, ఆర్సీపాలెం, సర్వాయపాలెం తదితర గ్రామాల్లోని ఈద్గాలు, మసీదుల వద్ద ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. త్యాగం, స్నేహం, పవిత్రత, దయాగుణానికి ప్రతీతగా పేదలకు ఖుర్బానీ పంచి పెట్టారు.

● **అల్లూరు** : త్యాగాలకు ప్రతీకగా నిర్వహించే బక్రీదు వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని అన్ని మసీదులు, ఈద్గాల్లో మత పెద్దలు ఈద్ అల్ అదాహ్ నమాజును నిర్వహించారు. నమాజులు పూర్తయిన అనంతరం ఖుర్బానీ కార్యక్రమాన్ని చేపట్టారు. గోధుమ రొట్టెలను తయారు చేసి పేదలకు పంపిణీ చేశారు. ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

● **లింగసముద్రం** : లింగసముద్రం, పెంట్రాల, ఆర్‌ఆర్ పాలెం, మొగిలిచెర్ల, చినపవని, పెదపవని గ్రామాలలో ముస్లింలు ఈద్గాలకు వెళ్లి నమాజు చేశారు. ప్రవక్తలు బక్రీద్ పండుగ విశిష్టతను వివరించారు.

● **కొండాపురం** : మండలంలోని సాయిపేట, రేణమాల, నేకునాంపేట, కొండాపురం, కొమ్మి, భీమవరప్పాడు, తూర్పుఎర్రబల్లి, గరిమెనపెంట తదితర గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మసీదులకు వెళ్లి నమాజు చేశారు.

● **కలిగిరి** : బక్రీద్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. దర్గాలను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. హిందువులు ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

● **బిట్రగుంట** : బోగోలు మండలంలో బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలు మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చెంచులక్ష్మీపురంలోని ఈద్గా వద్ద ఇమాము సోయబ్ హక్తర్, ఇబ్రహీంపేట తిప్ప మధ్య ఉన్న ఈద్గా వద్ద ఇమాము అబ్దుల్‌వహీద్‌లు బక్రీద్ పండుక గురించి వివరించారు.

● **కందుకూరు** : కందుకూరు పట్టణం పరిసర గ్రామాల్లో ముస్లింలు బక్రీదు పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని పెద్ద మసీదు, జామీయా మసీదు, సంతోష్ నగర్, విక్కిరాలపేట రోడ్డు, లుంబినీవనం ప్రాంతాల్లో ఉన్న ఈద్గాల్లో ముస్లింలు వేలాది మంది ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. బక్రీద్ సందర్భంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకోవడంతో పాటు తమ ఇరుగుపొరుగువారికి తోఫాలు అందచేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు.



లింగసముద్రం : ఈద్గా వద్ద నమాజు చేస్తున్న ముస్లింలు



అల్లూరు : మసీదులో నమాజు చేయిస్తున్న మత పెద్ద



కొండాపురం : సాయిపేటలో నమాజు చేస్తున్న ముస్లింలు

షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఇద్దరు విద్యార్థినుల ఎంపిక

లింగసముద్రం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఉత్తమ ప్రతిభ కనబరిచిన లింగసముద్రం కేఆర్ జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినిలు ఎంపికయ్యారు. 2024-25 విద్యా సంవత్సరంలో జరిగిన 10వ తరగతి పరీక్షలలో కంచరగుంట మహాలక్ష్మి 586 మార్కులు, పతకమూరి సుష్మ 585 మార్కులు సాధించి ఈ అవార్డుకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు ఉమ్మడిశెట్టి మాధవరావు శనివారం చెప్పారు. ఈ నెల 9వ తేదీన నెల్లూరులోని కస్తూర్బా గార్డెన్స్‌లో జరిగే కార్యక్రమంలో వీరిద్దరికి జిల్లా కలెక్టర్, మంత్రి చేతుల మీదుగా రూ.20 వేల, మెడల్, ప్రశంసాపత్రం అందజేస్తారని తెలిపారు. వీరిని హెచ్‌ఎం మాధవరావు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు, విద్యార్థులు అభినం దించారు.

అన్నెబోయినపల్లి-అంగిరేకులపాడు రోడ్డు అభివృద్ధికి రూ.2 కోట్ల మంజూరు

లింగసముద్రం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అధ్వానంగా ఉన్న అన్నెబోయినపల్లి - అంగిరేకులపాడు పంచాయతీరాజ్ రోడ్డు అభివృద్ధికి రూ.2 కోట్ల మంజూరు అయ్యాయి. దీంతో అధికారులు టెండర్లు పిలిచారు. ఈ నెల 17వ తేదీ టెండర్లు వేసేందుకు ఆఖరు తేదీ అని "ఏఈ ఏ హనుమంతరావు చెప్పారు. దీంతో ఈ రెండు గ్రామాల ప్రజలకు రోడ్డు కష్టాలు త్వరలో తీరనున్నాయి.

రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక పాలన

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు

నెల్లూరు (వైద్యం), జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రభుత్వ పాలన కార్మిక వర్గానికి వ్యతిరేకంగా ఉందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు ఆరోపించారు. శనివారం సీఐటీయూ జిల్లా కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వ పాలన ఆశ బారెడు.. ఆచరణ మూరెడు అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. కృష్ణపట్నం పోర్టు, విశాఖ ఉక్కు కర్మాగారంలో కార్మికులను విధుల నుంచి తొలగించారని, రాష్ట్రంలో భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించిన దాఖలాలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశ్రామికవేత్తలకు అండగా కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జరుగుతుందని, ఇందులో ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షకార్యదర్శులు టీవీవీ ప్రసాద్, అజయ్‌కుమార్, నగర కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో నరసింగరావు, ప్రసాద్, అజయ్‌కుమార్ తదితరులు

అన్నదాన సమాజం హాస్టల్‌లో

ప్రవేశానికి 28 వరకు గడువు

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు పప్పులవీధిలో పాండురంగ అన్నదాన సమాజం ఆధ్వర్యంలో పేద ఆర్యవైశ్య విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న హాస్టల్‌లో ప్రవేశానికి దరఖాస్తులను ఈ నెల 28వరకు స్వీకరిస్తామని సమాజం కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2025-2026 విద్యా సంవత్సరానికి 6వతరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకునే పేద ఆర్యవైశ్య విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైన వారి జాబితాను 29వతేదీన ప్రకటిస్తారన్నారు. పూర్తి వివరాలకు 0861- 2328427, 83309 58427 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.



అశ్వవాహనంపై చాముండేశ్వరి

ఇందుకూరుపేట మండలం గంగపట్నంలో చాముండేశ్వరీదేవి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం అమ్మవారు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి తాతా శ్రీనివాసరావు, గుండాల కృష్ణారెడ్డి, కొండూరు వెంకట రమణారెడ్డి, కేతిరెడ్డి అవినాష్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

- ఇందుకూరుపేట (ఆంధ్రజ్యోతి)

మెదడులో గడ్డలు ముప్పే!



- గుర్తిస్తే వెంటనే చికిత్స చేయించుకోవాలి
- లేదంటే ప్రాణాలపై ఆశ వదులుకోవాల్సిందే..
- రేడియేషన్, సెల్‌ఫోన్‌ల వల్ల ముప్పు
- క్యాన్సర్ కణుతులుగా మారుతున్న వైనం
- జిల్లాలో 1200మందిపైగా బాధితులు
- నేడు వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే

నెల్లూరు (వైద్యం) జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : నేడు అనేక శారీరక,మానసిక రుగ్మతలు మానవుడిని పట్టి పీడిస్తున్నాయి. వివిధ వ్యాధులను నిర్లక్ష్యం వల్ల ప్రాణాలకే ముప్పు వస్తున్నది. ప్రత్యేకించి శరీర అవయవాలను నియంత్రించే మెదడులో గడ్డలు (ట్యూమర్) వస్తే అవి ప్రమాదమే. జిల్లాలో ఇలాంటి వ్యాధిగ్రస్థులు పెద్దసంఖ్యలో ఉన్నారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో తెలుస్తుంది. మెదడులో ఒక అవయవాన్ని నియంత్రించే భాగంలో గడ్డ వస్తే అది ఆ అవయవంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఫలితంగా ఆ అవయవాలు చచ్చుబడే ప్రమాదం ఉంది. ఇందులో అత్యంత ప్రమాదకరంగా భావించే గియో బ్లపోమా మల్టిపార్మా(జీబీఎం) కణుతులు ఏర్పడితే దీని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ముందుగానే వ్యాధి లక్షణాలు గుర్తించి చికిత్స చేయించుకోకపోతే, ప్రాణాలపై ఆశలు వదులుకోవాల్సిందే. మెదడు గడ్డల్లో దాదాపు 120 రకాలు ఉంటాయి. మెదడులో అది వచ్చిన ప్రాంతాన్ని బట్టి దీని ప్రభావం ఉంటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రపంచ ఆరోగ్య సంస్థ వ్యాధిపై అవగాహన కలిగించేలా ప్రతి ఏటా జూన్ 8న (నేడు) ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్స్ డేగా పాటించాలని నిర్ణయించింది.

- జిల్లాలో 1200 మందికిపైగా బాధితులు

జిల్లాలో దాదాపు 1200 మందికిపైగా బ్రెయిన్ ట్యూమర్ బాధితులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ప్రధానంగా రేడియేషన్ స్థాయి నేటి వాతావరణంలో ఎక్కువగా ఉండడంతో బ్రెయిన్ ట్యూమర్‌లకు ఇదే ప్రధాన కారణంగా ఉంటున్నది. నేటి ఆధునిక తరం సెల్‌ఫోన్ లేనిదే బయటకు వెళ్లలేని పరిస్థితి. దీని నుంచి వెలువడే రేడియేషన్ కూడా ఈ ట్యూమర్‌లకు మరో కారణంగా తాజా అధ్యయనంలో తేలినట్లు మేధావులు వెల్లడిస్తున్నారు. మొబైల్ ఫోన్‌లు ఎక్కువగా వాడే వారిలో గ్లయోమా తరహాలో మెదడులో గడ్డలు వచ్చేందుకు అవకాశం ఎక్కువగా ఉన్నట్లు ఇటీవల పరిశోధనల్లో వెల్లడయింది. అందుకే 16 ఏళ్ల వయసున్న పిల్లలకు మొబైల్ ఫోన్‌లను ఇవ్వక పోవటం మంచిది. వయసుతో నిమిత్తం లేకుండా బ్రెయిన్ ట్యూమర్‌లు వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. రొమ్ము, పెద్దప్రేగు, మూత్రపిండాల క్యాన్సర్‌లు సోకిన సందర్భాలలో వారిలోని 20 నుంచి 40 శాతం కేసుల్లో అవి మెదడుకు పాకి అక్కడ క్యాన్సర్ గడ్డలు ఏర్పడుతున్నాయి

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా..!

- మేనరికాల పెళ్లిళ్లకు దూరంగా ఉండాలి.
- కుటుంబంలో ఎవరికైనా బ్రెయిన్ ట్యూమర్ ఉంటే కుటుంబ సభ్యులంతా వైద్య పరీక్షలు చేయించుకోవాలి.
- అధిక రేడియేషన్ విడుదల చేసే సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలి.
- వ్యాధి లక్షణాలు గమనించిన వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

అప్రమత్తత అవసరం

బ్రెయిన్ ట్యూమర్‌లపై ఎలాంటి నిర్లక్ష్యం వద్దు. కుటుంబ సభ్యులలో ఎవరికైనా బ్రెయిన్ ట్యూమర్ ఉంటే మిగిలిన వారు తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలి. మెదడులో కణుతులను గుర్తిస్తే ఎంతటి క్లిష్టమైన శస్త్ర చికిత్సలు అయినా సరే విజయవంతంగా చేసి ప్రాణాలు కాపాడవచ్చు. సెల్‌ఫోన్ వల్ల కూడా రేడియేషన్ ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. అవసరమైతే తప్ప సెల్‌ఫోన్ వాడొద్దు. వీలైనంత దూరంగా ఉండటం మంచిది. ఆధునిక వైద్య పరికరాలయిన న్యూరో నావిగేషన్, క్యూసా వంటి వాటి ద్వారా బ్రెయిన్ ట్యూమర్లను గుర్తించి చికిత్సలు చేసే వీలుంది. ట్యూమర్ క్యాన్సర్ సెల్‌కు ఆక్సిజన్, బ్లడ్ సప్లయ్ ఆపేసి చేసే ట్యూమర్ నివారణ చికిత్సలు కూడా అందుబాటులోకి వచ్చాయి.



- డాక్టర్ ధీరజ్, న్యూరోసర్జన్, జీజీహెచ్.

షైనింగ్ స్టార్స్‌గా 273 మంది విద్యార్థులు

- రేపు ప్రతిభా పురస్కారాల ప్రదానం

నెల్లూరు(విద్య), జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను షైనింగ్ స్టార్స్‌గా గుర్తించి నగదు ప్రోత్సాహకంతో సన్మానించేందుకు పాఠశాల విద్యా శాఖ సన్నద్ధమైంది. జిల్లాలో మొత్తం 273 మంది విద్యార్థులను షైనింగ్ స్టార్స్ ప్రతిభా అవార్డుకు ఎంపిక చేసింది. ఒక్కో విద్యార్థికి రూ.20 వేల నగదు ప్రోత్సాహకంతోపాటు మెడల్, ప్రశంసాపత్రం అందచేయనుంది. విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులను కూడా సన్మానించి ప్రోత్సహించేందుకు నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. జిల్లాలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన 237 మంది విద్యార్థులను, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన 36 మందిని ఈ అవార్డుకు ఎంపిక చేశారు. అన్ని పాఠశాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన వారినే ఎంపిక చేసినట్లు సమగ్రశిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య తెలిపారు. సంబంధిత తేదీలో విద్యార్థులు, తల్లిదండ్రులు కార్యక్రమానికి హాజరై అవార్డులు అందుకోవాలని కోరారు.

నేడు సీనియర్ సిటిజన్ల యోగాంధ్ర

- ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్

నెల్లూరు(హరనాథపురం), జూన్ 7(ఆంధ్రజ్యోతి) : సీనియర్ సిటిజన్ల కోసం ఆదివారం ప్రత్యేక యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఇన్ చార్జి కలెక్టర్ కార్తీక్ తెలిపారు. శనివారం జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం, రామచంద్ర మిషన్, చిల్డ్రన్స్‌పార్కు తదితర చోట్ల ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో సీనియర్ సిటిజన్లు పెద్దసంఖ్యలో పాల్గొనేలా చూడాలని కోరారు. సోమవారం యోగంధ్ర బ్యానర్‌తో ప్రతి గ్రామంలో ర్యాలీ నిర్వహించాలని సూచించారు. ఈనెల 10న ఉదయగిరిలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు.

అన్న ప్రసాదంలో

నాణ్యత లోపిస్తే సహించం

- మాలకొండలో అధికారులపై మండిపడ్డ మంత్రి ఆనం
- పలు అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపనలు

వలేటివారిపాలెం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మాలకొండ క్షేత్రంలో వెలసిన మాల్యాద్రి లక్ష్మీ నృసింహస్వామి సన్నిధిలోని మహా అన్నదానసత్రంలో భక్తులకు రుచికరమైన భోజనం పెట్టాలని, అందులో నాణ్యత లోపిస్తే ఉపేక్షించేది లేదని రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హెచ్చరించారు. శనివారం మాలకొండకు చేరుకున్న ఆయన కందకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన ఆయన కొత్తగా చేపట్టనున్న పనులకు శంకుస్థాపనలు చేశారు. ముందుగా మండలంలోని చుండి నుంచి అమ్మపాలెం మీదుగా గాంధీనగర్ వరకు నాబార్డు నిధులతో రూ.2.20 కోట్లతో నిర్మించిన తారురోడ్డును ప్రాంభించారు. అనంతరం మాలకొండలో కొండ కింద రూ.1.56కోట్లతో చేపట్టనున్న షాపింగ్ కాంప్లెక్స్‌కు, రూ.2.65 కోట్లతో చేపటనున్న డార్మిటరీ హాలుకు, రూ.46.50 లక్షలతో నిర్మించనున్న ప్రహరీ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం కొండపైన రూ.80 లక్షలతో నిర్మించిన 5 వసతి గదులు, రూ.2.40 కోట్లతో నిర్మిచిన రిటైనింగ్‌వాల్, రూ.77 లక్షలతో నిర్మించిన ఎస్ఎస్ క్యూలైన్‌ను ప్రారంభించారు. మాలకొండకు వచ్చిన మంత్రి రామనారాయణరెడ్డికి ఆలయ అధికారులు మేళతాళాలు మంగళవాయిద్యాలు, వేదపండితులు మంత్రోచ్ఛరణ నడుమ పూర్ణకుంభ స్వాగతం పలికారు. గర్భగుడిలో ప్రధాన ఉప అర్చకులు గౌరీశంకర్ అష్టోత్తర, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శాలువా పూలమాలతో సత్కరించి స్వామివారి ప్రసాదం అందజేశారు.


మాలకొండలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి ఆనం, ఎమ్మెల్యే ఇంటూరి తదితరులు

- భోజనం నాణ్యతపై మంత్రి అసంతృప్తి

మాలకొండలోని మహా అన్నదానసత్రంకు చేరుకున్న మంత్రి భక్తులతో కలిసి భోజనం రుచి చూశారు. ఆ సమయంలో బజ్జీ, కూరలు లేకపోవడంతో ఆలయ అధికారులపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అధికారులను మందలించారు. ఈ సందర్భంగా మంత్రి రామనారాయణరెడ్డి మాట్లాడుతూ భక్తులకు రుచి, శుచితో పాటు నాణ్యమైన భోజనం పెట్టాలన్నారు. భక్తుల అంచనాలకు అనుగుణంగా అన్నం కూరలు తయారు చేయాలని తెలిపారు. అనంతరం ఆలయ అధికారులు, అన్నదానంలో పనిచేసే సిబ్బందితో విడివిడిగా సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ సాగర్‌బాబు, డీఎస్పీ సుబ్రహ్మణ్యం, సీఐ మంగారావు, ఎస్ఐ మరిడినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు చెరువుపల్లి మాల్యాద్రి, కామినేని వీరయ్య, చెరువుపల్లి సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం రూ.14,98,455

మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి శనివారం భక్తుల నుంచి రూ. 14,98,455 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ సాగర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్‌లకు రూ.9,550, కుంకుమార్చనకు రూ.19,680, వివాహములకు రూ.5వేలు, తలనీలాలకు రూ.85,800, వాహన పూజలకు రూ.4,680, ప్రత్యేకదర్శనంకు రూ.5,41,000, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ.540, రూముఅద్దెలు రూ.31,330, కవర్లు విక్రయంతో రూ.11,100, లడ్డూప్రసాదానికి రూ.2,46,580, అన్నదానం ద్వారా రూ.5,21,595, విరాళములు రూ.21,600 లభించినట్లు తెలిపారు.

ఉపాధ్యాయ కౌన్సెలింగ్ గందరగోళం

- అర్ధరాత్రి వరకు పడిగాపులు
- సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు
- ప్రణాళిక లేని విద్యాశాఖ
- నేడు డీఈవో కార్యాలయం ముట్టడి


అర్ధరాత్రి కౌన్సెలింగ్ కేంద్రంలో ఉపాధ్యాయులు

నెల్లూరు(విద్య), జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు, బదిలీలు గందరగోళంగా మారాయి. అభ్యంతరాలు, అవరోధాలు, పాయింట్ల కేటాయింపుల్లో తేడాలు... ఇలా ఒక్కటి కాదు అన్ని విషయాల్లోనూ విద్యాశాఖ పూర్తిగా విఫలమైనట్లు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. ఒక ప్రణాళిక లేకుండా, ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం కాకుండా ఇష్టానుసారంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. శుక్రవారం కూడా రాత్రి ప్రారంభమైన కౌన్సెలింగ్ శనివారం తెల్లవారుఝామున మూడు గంటల వరకు నిర్వహించారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

- ప్రణాళిక ఏదీ ?

అర్హులైన ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పిస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం ఎస్‌జీటీలకు పీఎస్ హెచ్ఎం, స్కూల్ అసిస్టెంట్‌లుగా ఉద్యోగోన్నతులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ ప్రక్రియ ప్రణాళికాబద్ధంగా నిర్వహించకపోవడంతో తిప్పలు తప్పలేదు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కావాల్సిన కౌన్సెలింగ్ రాత్రి 10 గంటలకు ప్రారంభమైంది. నగరపాలక, పురపాలక, ప్రభుత్వ జడ్పీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులకు సర్టిఫికెట్‌ల పరిశీలన, కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆరంభం నుంచి వివిధ రకాల అభ్యంతరాలతో ఉపాధ్యాయులు, సంఘాలు వీటిని అడ్డుకున్నాయి. దీంతో ఉపాధ్యాయులంతా రాత్రి సమయాల్లో ఇబ్బందులను ఎదుర్కొంటూనే కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. వీటన్నింటిని సరిచేస్తూ తెల్లవారుఝాముకు ప్రక్రియను ముగించారు.

- పేరుకే ఆన్‌లైన్...

ఉపాధ్యాయ బదిలీల్లో ఆన్‌లైన్ విధానం గందరగోళ పరిస్థితులకు దారితీస్తోంది. సాంకేతిక సమస్యలతో అవరోధాలను ఎదుర్కొంటుండడంతో కౌన్సెలింగ్ ఆలస్యమవుతోందని అధికారులు తెలిపారు. పాఠశాల సహాయకులకు కొంతమందికి వెబ్ ఆప్షన్‌ల మేరకు బదిలీలు జరగ్గా, మరికొందరికి మ్యాన్యువల్‌గా నిర్వహించారు. ఉత్తర్వులు జనరేట్ కాకపోవడంతోనే కొందరికి మాన్యువల్‌గా నిర్వహించామని సిబ్బంది చెపుతున్నారు. అయి తే దీనిలో కూడా అవకతవకలు జరిగాయని ఉపాధ్యాయు లు ఆరోపిస్తున్నారు. క్లస్టర్ పాఠశాలల్లో సీనియర్స్ కంటే జూనియర్స్‌కే స్థానాలు దక్కాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బదిలీల్లో ఉత్తర్వులు జనరేట్ అయిన వారిలో సీనియారిటీ ముందున్న వారికంటే వెనుక ఉన్నవారికి అనుకూల ప్రదేశాలు రావడంపై ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


- నేడు ముట్టడి

ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని హామీనిచ్చి నేడు మాట తప్పి వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం ఉదయం డీఈవో కార్యాలయాన్ని ముట్టడిస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నేతలు ప్రకటించారు. శనివారం జరిగిన సమావేశంలో నేతలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇప్పటి వరకు జరిగిన ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్‌ల వెబ్ కౌన్సెలింగ్ ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. ఉద్యోగోన్నతులకు వెబ్‌ఆప్షన్‌లు పెట్టలేని పరిస్థితుల్లో మాన్యువల్ నిర్వహించాల్సి వచ్చిందన్నారు. దీనివలన ఉపాధ్యాయులు ఎన్నడూ లేని విధంగా మానసిక క్షోభ అనుభవించారని ఐక్యవేదిక నేతలు తెలిపారు. స్కూల్ అసిస్టెంట్‌లకు వెబ్ ఆప్షన్‌లలో కనిపించిన క్లస్టర్ వేకన్సీలు ఎక్కువ పాయింట్లు వచ్చిన వారికి కాకుండా ప్రిఫరెన్షియల్ కేటగిరి వాళ్లు జనరల్ కేటగిరీ కింద స్థానాలను కేటాయించకపోవడం, బాలికోన్నత పాఠశాలల్లో పురుషులను కేటాయించడం వంటి వింతలు జరిగాయన్నారు. ఇంతగా విఫలమైన ఈ వెబ్‌కౌన్సిలింగ్ విధానాన్ని ఎస్‌జీటీల మీద బలవంతంగా రుద్దుతున్నారని, ఉపాధ్యాయులు ఎవరూ కూడా వెబ్ ఆప్షన్ పెట్టకుండా కౌన్సెలింగ్‌ను బాయ్‌కాట్ చేస్తున్నామన్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు జిల్లా విద్యా శాఖ కార్యాలయం వద్దకు వేలాదిగా ఉపాధ్యాయులు తరలిరావాలని, కౌన్సెలింగ్ ప్రక్రియను మార్చే వరకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఐక్యవేదిక నాయకులు ఎ.సురేంద్రరెడ్డి, పీ.అనిల్‌కుమార్, జీవీ చలపతి శర్మ, కే నరసింహులు, వీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అధునాతనంగా

వీఆర్ హైస్కూలు


మోడల్‌గా రూపుదిద్దుకున్న వీఆర్ హైస్కూల్


పిల్లల కోసం మైదానంలో ఆట వస్తువులు

- పేద విద్యార్థుల చదువుకు సన్నద్ధం
- మాట నిలుపుకున్న మంత్రి నారాయణ
- 12న ప్రారంభం... వేయిమందికి ప్రవేశం
- ఈ ఏడాది నర్సరీ నుంచి 9వ తరగతి వరకు..

నెల్లూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పిడికెడు మెతుకులకు అవస్థలుపడే పేదపిల్లల కోసం ఓ సుందరమైన పాఠశాల పురుడు పోసుకుంది. మురికి కాలువలు, మట్టి దిబ్బల మధ్యన సేదతీరే నిరుపేద పిల్లలను అక్కున చేర్చుకొని ఉన్నతంగా తీర్చిదిద్దడానికి చదువుల తల్లి నిలయం సిద్ధంగా ఉంది. రాష్ట్రంలోనే దశాబ్దాలపాటు పేరొందిన వెంకటగిరి రాజులు స్థాపించిన చదువుల బడి(వీఆర్ హైస్కూల్) ఐదేళ్ల మరణం నుంచి మంత్రి నారాయణ కృషితో కొత్త జీవం నింపుకుంది. ఆయన ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీ నెరవేర్చే క్రమంలో మూడు నెలల క్రితం మొదలైన వీఆర్సీ పాఠశాల ఆధునికీకరణ పూర్తయ్యాయి. ఈనెల 12న ఈ పాఠశాల పునఃప్రారంభం కానున్నది.

- కార్పొరేట్‌ను తలదన్నేలా..

పేదపిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం కొత్తరూపు సంతరించుకున్న వీఆర్ హైస్కూల్ ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలను తలదన్నే స్థాయిలో ఉంది. వసతులపరంగా, బోధనపరంగా, ఆటపాటల పరంగా అన్ని విధాలుగా కార్పొరేట్‌ను మించిన రీతిలో రూపుదిద్దుకుంది. అన్ని తరగతులకు డిజిటల్ బోధన ఉంటుంది. ఇందుకోసం ప్రతి క్లాస్ రూంలో విశాలమైన డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రతి తరగతి గది విద్యార్థుల మనస్సులకు హత్తుకునేలా అందంగా తీర్చిదిద్దారు. సుశిక్షితులైన ఉపాధ్యాయులను ఎంపిక చేస్తున్నారు. ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఎక్కడా కనిపించని విధంగా వీఆర్ హైస్కూల్‌లో క్రీడామైదానం సిద్ధమైంది. ఫుట్‌బాల్, టెన్నీస్, షటిల్, వాలీబాల్, బ్యాస్కట్ బాల్ కోర్టులను సిమెంట్ కాంక్రీట్‌తో నిర్మించారు. నర్సరీ పిల్లల కోసం ప్రత్యేకంగా లాన్‌తో మైదానం సిద్ధం చేశారు.

- అన్నీ ఉచితమే..

ఇక్కడ చదివే పిల్లలకు అన్నీ ఉచితమే. ఫీజులు ఉండవు. పుస్తకాలు, యూనిఫాం అన్నీ ఉచితంగానే ఇస్తారు. అంతే కాదు మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ ఇస్తారు. పాఠశాలకు రానుపోను ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తారు. ఈ ఏడాది 1 నుంచి 9వ తరగతి వరకు అడ్మిషన్లు ఉంటాయి. మరుసటి సంవత్సరం 10, ఆ తరువాత ఇంటర్ ఫస్టియర్, ఆ తరువాత ఇంటర్ సెకండ్ ఇయర్ వరకు తరగతులు పెంచుతారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం వచ్చే సరికి వీఆర్సీలో ఐదు వేలమంది పేద విద్యార్థులు చదువుకునేలా ప్రణాళికలు రూపొందించారు. నిరుపేద పిల్లలకు మాత్రమే ఈ స్కూల్‌లో అడ్మిషన్లు కల్పిస్తారు. బీడి కార్మికులు, పాచిపని చేసి జీవనం సాగించే వారు, హమాలీలు.. ఇలా నిరుపేద వర్గాలకు చెందిన పిల్లలను గుర్తించి వారికి మాత్రమే ఈ పాఠశాలలో అడ్మిషన్లు ఇస్తారు. విద్యార్థుల ఎంపిక బాధ్యతను జాయింట్ కలెక్టర్, వీఆర్ విద్యాసంస్థల ప్రత్యేక అధికారి కే కార్తీక్ పర్యవేక్షిస్తున్నారు.